www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

## ఓవల్.. విక్టరీ థ్రిల్

ఆఖరి టెస్ట్‌లో భారత్ గెలుపు పంచ్

సూపర్ సిరాజ్ మెరుపు బంతులు

అదరగొట్టిన ప్రసిద్ధ్, ఆకాశ్ 10

మలుపు తిరిగిన చివరి రోజు ఆట

ఇంగ్లండ్‌పై 2-2తో సిరీస్ సమం



విజయోత్సాహంలో టీమిండియా

మంగళవారం | 5-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 111 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి మ.1:12 తదుపరి ద్వాదశి, నక్షత్రం: జ్యేష్ఠ ఉ.11:23 తదుపరి మూల, వర్జ్యం: రా.7.55-9.37, దుర్ముహూర్తం:ఉ.8:32-9:22, రా.10:24-11:07, అమృతఘడియలు: ఉ.6:10-7:52, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 5:59, సూర్యాస్తమయం: 6:42 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# అయోమయం.. జగన్ నాదం!



## వెంకటేశ్ నాయుడిపై అర్థంలేని వాదనలు

### జగన్ రోత పత్రికలో విచిత్ర కథనాలు

చెవిరెడ్డికి సన్నిహితుడంటూనే..

కూటమి నేతలతో దిగిన ఫొటోల ప్రచురణ

'చెల్లని నోట్లు' అంటూ 2 వేలపై కట్టు కథలు

జనం వద్దే రూ.6 వేల కోట్లున్నాయని ఒక కథనం

తాడేపల్లి ప్యాలెస్‌లోకి వెంకటేశ్‌కు డైరెక్ట్ ఎంట్రీ

జగన్‌తో పలుమార్లు కరచాలనం, భేటీలు



వెంకటేశ్ నాయుడుతో జగన్ కరచాలనం.. మధ్యలో చెవిరెడ్డి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అడ్డగోలు సమర్థనలు... అడ్డదిడ్డ వాదనలు! గుట్టలుగా నోట్లకట్టలతో దొరికిపోయిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడును వెనకేసుకొచ్చేందుకు జగన్ రోత పత్రిక నానా తంటాలు పడుతోంది. అసలు ఆయన తమ పార్టీకి చెందిన వ్యక్తా... లేక, కూటమి పార్టీలకు మద్దతుదారా? కనీసం ఈ విషయంపైనా స్పష్టత ఇవ్వలేక తన పాఠకులనూ గందరగోళంలోకి నెడుతోంది. అభద్రతా భావంతో అర్థంలేని వాదనలను తెరపైకి తెస్తోంది. మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని, వెంకటేశ్ నాయుడును బెంగళూరు విమానాశ్రయంలో ఒకే రోజు, ఒకే సమయంలో, ఇద్దరినీ కలిపి 'సిట్' అధికారులు అరెస్టు చేశారు. ఆయన చెవిరెడ్డికి సన్నిహితుడనేది నిర్వివాదాంశం. ఆదివారం సంచికలో జగన్ రోత పత్రిక పరోక్షంగా ఈ విషయాన్ని అంగీకరించింది కూడా. పట్టుబడిన డబ్బులు మద్యం స్కామ్‌కు సంబంధించినవి కావని... వెంకటేశ్ నాయుడికి రియల్ ఎస్టేట్ వ్యాపారం ఉందని వెనకేసుకొచ్చింది. ఒక్కరోజు తిరగ్గానే... సోమవారం సంచికలో వెంకటేశ్ నాయుడు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని తదితరులతో దిగిన ఫొటో ప్రచురించి... అతను టీడీపీ మద్దతుదారుడన్నట్టుగా 'కవరేజీ' ఇచ్చింది. నిజానికి... పలు సందర్భాల్లో అనేక రాజకీయ పార్టీల నాయకులతో వెంకటేశ్ నాయుడు ఫొటోలు దిగారు. టీడీపీ,

మిగతా 14వ పేజీలో...



బాబు అరాచకం

సిట్ గూండాయిజం..

లేని మద్యం స్కామ్‌ను సృష్టించి వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు

అక్రమ అరెస్టుకు తెగబడింది. లుక్ అవుట్ నోటీసులు ఇచ్చి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన స్నేహితుడు వెంకటేశ్ నాయుడులను మంగళవారం బెంగళూరు విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. బెంగళూరులోని న్యాయస్థానంలో హాజరు పరచి, ట్రాన్సిట్ వారెంట్‌పై

**మీ స్నేహితుడే కదా!** 'చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన 'స్నేహితుడు' వెంకటేశ్ నాయుడును అరెస్టు చేశారంటూ జూన్ 18వ తేదీన జగన్ పత్రికలో ప్రచురితమైన కథనం.

## అ'భద్రత'లో జగన్!

40 మందితో ప్రైవేటు సైన్యం.. రేపటి డోన్ పర్యటన నుంచి మొదలు

జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న ఆయనకు ఇప్పటికే 58 మంది రక్షణ

వారిని కాదని ప్రైవేటు ఆర్మీ ఎందుకో.. పోలీసులు అనుమతించేనా?



## అంతు చిక్కని ట్రూఅప్ లెక్క!

జగన్ హయాంలో ఏటా బాదుడు

ఇప్పుడు ఐదేళ్లకూ కలిపి మరో షాక్

12,717 కోట్ల వసూలుకు డిస్కమ్‌ల ప్రతిపాదన

నాడు విచ్చలవిడిగా ట్రాన్స్‌ఫార్మర్లు, పరికరాల కొనుగోళ్లు.. ఆ ఖర్చులు ఆ ఐదేళ్లలో చూపలేదట

ఇప్పుడు రెవెన్యూ లోటు భర్తీ చేస్తారట

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

విద్యుత్ చార్జీల బాదుడుకు పెట్టిన ముద్దు పేరు 'ట్రూ అప్'! అంటే... ఒక సంవత్సరంలో అదనంగా పడిన భారాన్ని లెక్కించి, దానిని తదుపరి ఏడాది నుంచి వసూలు చేస్తారన్న మాట! ఇలా జగన్ హయాంలో ప్రతిఏటా 'ట్రూ అప్' పేరుతో బాదారు. జగన్ జమానా పోయినా... అప్పటి భారాన్ని జనం భరిస్తూనే ఉన్నారు. ఇది సరిపోదంటూ... 2019-20 నుంచి 2024-25 వరకు ఐదేళ్లకూ కలిపి రూ.12,717 ట్రూఅప్ చార్జీలు వసూలు చేసుకుంటామంటూ డిస్కమ్‌లు విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఈఆర్‌సీ)కు ప్రతిపాదనలు పంపించాయి. ఎప్పటికప్పుడు

మిగతా 12వ పేజీలో...

హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా

## తుహిన్‌కుమార్ ప్రమాణం



అదనపు న్యాయమూర్తిగా తుహిన్ కుమార్‌తో ప్రమాణం చేయిస్తున్న చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ 11

మాజీ సీఎం, జేఎంఎం వ్యవస్థాపకుడు

## శిబుసోరేన్ కన్నుమూత



2

కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతూ.. ఢిల్లీ ఆస్పత్రిలో తుదిశ్వాస

సుదీర్ఘ పోరాటంతో జార్ఖండ్ రాష్ట్రాన్ని సాధించిన నేత


శూన్యమే మిగిలింది: సీఎం హేమంత్

ఆస్పత్రికెళ్లి నివాళులర్పించిన మోదీ

# సీట్లన్నీ ఫుల్

'నో అడ్మిషన్స్' బోర్డుపెట్టిన ఆదోనిలోని మున్సిపల్ హైస్కూల్

అభినందించిన లోకేశ్




కర్నూలు జిల్లా ఆదోనిలో పాఠశాల నోటీసు బోర్డుపై 'అడ్మిషన్స్ ఆర్ క్లోజ్డ్' అని రాసిన దృశ్యం

**'అడ్మిషన్స్ ఆర్ క్లోజ్డ్'...** కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల నోటీసు బోర్డులో కనిపించిన ప్రకటన ఇది! ఆదరణ తగ్గిందని భావిస్తున్న సమయంలో ఒక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో క్లాసులు నిండిపోవడం, కొత్త దరఖాస్తులు తీసుకోబోమంటూ ఏకంగా బోర్డు పెట్టడం అద్భుతమే! అందువల్లే ఈ విషయం దృష్టికి రాగానే విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పందించారు. "ఏపీ మోడల్ ఎడ్యుకేషన్‌కు మీరే రథసారథులు" అంటూ 'ఎక్స్'లో హెచ్ఎం ఫయాజుద్దీన్, ఇతర బోధనాసిబ్బందిని ఆయన అభినందించారు. నెహ్రూ మెమోరియల్ ఉన్నతపాఠశాల సామర్థ్యం 1725 మంది. కొత్తగా ఆరు నుంచి పదోతరగతి వరకు 425 మంది చేరితే, ఇందులో ఒక్క ఆరో తరగతిలోకే 278 మంది చేరారు. ఇంకో 25 మంది విద్యార్థుల అడ్మిషన్లు పరిశీలించాల్సి ఉంది. ఒక్కో తరగతి గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. ఇంకా కూర్చోబెట్టడానికి చోటు లేదు. దీంతో 'నో అడ్మిషన్స్ బోర్డు' పెట్టాల్సి వచ్చింది. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరుగుతుండడం, ఉపాధ్యాయులు క్రమశిక్షణతో బోధన చేస్తుండటం, ఎన్‌సీసీ, క్రీడలకు ప్రాధాన్యం, సన్నబియ్యంతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తుండడంతో.. తల్లిదండ్రులు తమ పిల్లల చెయ్యి పట్టుకుని ప్రభుత్వ బడి బాట పడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచీ ప్రతి రోజూ సిఫారసు లేఖలతో చాలా మంది తల్లిదండ్రులు ఈ ఉన్నతపాఠశాల ఎదుట బారులు తీరడం విశేషం.

- ఆదోని అగ్రికల్చర్, ఆంధ్రజ్యోతి

# విశాఖకు ఐటీ బూమ్

## పెద్ద కంపెనీలు.. భారీ పెట్టుబడులు!

ఎంఓయూలు అమలైతే 74,100 మందికి ఉద్యోగాలు

ఒక్క టీసీఎస్ కంపెనీయే 13 వేలు

కాగ్నిజెంట్ మరో 8 వేల ఉద్యోగాలు

కూటమి ప్రభుత్వం రాకతో ముందుకొస్తున్న పలు కంపెనీలు



కార్యకలాపాలు ప్రారంభించేందుకు టీసీఎస్‌కు కేటాయించిన రుషికొండ ఐటీ పార్కులోని మిలీనియం టవర్

రాబోయే ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక 14 నెలల కాలంలోనే విశాఖపట్నానికి రూ.24,047 కోట్ల పెట్టుబడులు వచ్చేలా ప్రముఖ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంది. ఇవి అమలైతే 74,100 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఒక్క టీసీఎస్ కంపెనీయే 13 వేల ఉద్యోగాలు ఇవ్వనుంది. కాగ్నిజెంట్ మరో 8 వేల ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించింది. డేటా సెంటర్లు అందుబాటులోకి వస్తే ఉద్యోగావకాశాలు ఇంకా పెరుగుతాయి.

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఐటీ/ఐటీఈఎస్ కంపెనీలు 300 వరకు ఉండగా, వాటిలో సుమారు 50 వేలమంది పనిచేస్తున్నారు. వాటి వార్షిక ఆదాయం రూ.3 వేల కోట్లు. ఐటీ హబ్‌గా ఉన్న విశాఖపట్నంలోనే 200 వరకూ కంపెనీలు ఉన్నాయి. వాటిలో 35 వేలమంది పనిచేస్తున్నారు. రుషికొండలో పదిహేనేళ్ల క్రితం ఐటీ పార్కులు ఏర్పాటు చేసి, కంపెనీలకు రాయితీలిచ్చి ప్రోత్సహించడంతో ఇది సాధ్యమైంది. అయితే పెద్ద కంపెనీలు విశాఖపట్నం రాకపోవడం వల్ల

మిగతా 13వ పేజీలో...




## నిజమైన భారతీయుడు అలా మాట్లాడడు!

రాహుల్ చైనా వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

ఆ దేశం 2000 చ.కి.మీ.ల మన భూభాగాన్ని ఆక్రమించిందని మీకెలా తెలుసు? 2

మీరు అక్కడ ఉన్నారా? అంటూ నిలదీత



14

## అప్పటి ఘటనల్లో ఇప్పుడు అరెస్టా?

అంత అవసరం ఏమొచ్చింది?

తురకా కిశోర్ కేసులో పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

కళ్లు మూసుకొని రిమాండ్ విధించారు

సరైన శిక్షణ ఇవ్వకపోవడం మా తప్పే

మెజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులపై ఆక్షేపణ

హెబియస్ కార్పస్ విచారణ నేటికి వాయిదా



అన్నదాత సుఖీభవ సొమ్ము అందుకున్న అనంతపురం జిల్లా శింగనమల మండలం సోదనపల్లి రైతు దంపతులు ఆదినారాయణ, లక్ష్మీదేవి కళ్లలో ఆనందం

## అన్నదాత కళ్లల్లో మెరుపులు

సుఖీభవ సాయం కోసం బ్యాంకులకు..

ఉత్సాహంగా డ్రా చేసుకున్న రైతులు 13

## ఆ విద్యార్థులకు మరో చాన్స్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బీటెక్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు గడువు పొడిగింపు

ఎట్టకేలకు స్పందించిన ఉన్నత విద్యామండలి

ఎంటెక్ ప్రవేశాలపై త్వరలో సవరణ షెడ్యూల్ 12

15 నుంచి ఆన్‌లైన్‌లో

## 700 సేవలు




తలసరి ఆదాయం పెంచడం ద్వారా జీవన ప్రమాణాలు పెంచాలి

పథకాల అమలుతోపాటు ఆదాయం పెరిగేలా చూడాలి 13

రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై సమీక్షలో సీఎం

## గీత కార్మికులకు 10% బార్లు

లాటరీ విధానంలోనే లైసెన్స్‌ల కేటాయింపు

ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు తప్పనిసరి 13

ఆదాయం ఒక్కటే కాదు.. ఆరోగ్యమూ ముఖ్యమే

బార్ పాలసీపై సీఎం చంద్రబాబు సమీక్ష

## 'స్మార్ట్' రేషన్ కార్డులు రెడీ!

చెన్నైలో ముద్రణ.. అక్కడి నుంచే నేరుగా మండలాలకు

25 నుంచి 31 వరకు లబ్ధిదారులకు పంపిణీ ఏర్పాట్లు 12



శతజయంతి సభలో మండలి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో బుద్ధప్రసాద్, గరికపాటి తదితరులు

## భాషా సంఘానికి 'మండలి' పేరు

వెంకట కృష్ణారావు సేవాభావం ఉన్న నేత 12

చరిత్ర ఉన్నంత వరకు కృష్ణా ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారు: సీఎం

## రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితమే

మహిళా ఉద్యోగులు, ట్రాన్స్‌జెండర్లకూ ఫ్రీ బస్

విద్యార్థినులకు బస్ పాస్‌లు అవసరం లేదు

ఆధార్, ఓటర్, రేషన్ కార్డుల్లో ఏదో ఒకటి చూపవచ్చు

పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఫ్రీ జర్నీ: మంత్రి



13

## భారత్‌పై మరిన్ని సుంకాలు

2

రష్యా చమురు కొనుగోళ్లే కారణం

భారత్ నుంచి రష్యాకు భారీగా ఆర్థిక వనరులు.. దీంతోనే ఉక్రెయిన్ యుద్ధం: ట్రంప్

ఘాటుగా స్పందించిన భారత్

ఐరోపా సమాఖ్య, అమెరికా అన్యాయంగా టార్గెట్ చేస్తున్నాయని మండిపాటు

## భారత్‌పై మరిన్ని సుంకాలు

**» రష్యా చమురు కొనుగోలు వల్లే ఉక్రెయిన్ యుద్ధం: ట్రంప్**



వాషింగ్టన్, ఆగస్టు 4: భారత్‌పై మరిన్ని సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇప్పటికే భారత్‌పై 25% సుంకాలను విధించిన ట్రంప్.. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు టారిఫ్‌లను పెంచుతానంటూ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో ప్రకటించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్.. బహిరంగ మార్కెట్లో దాన్ని విక్రయించి.. భారీగా లాభాలను గడిస్తోందని విమర్శించారు. చమురు కొనుగోళ్లతో భారత్ నుంచి రష్యాకు ఆర్థిక వనరులు చేరుతున్నాయని, దాంతో ఉక్రెయిన్ యుద్ధం ఆగడం లేదని ఆక్షేపించారు. రష్యాతో యుద్ధం వల్ల ఎంత మంది ఉక్రెయిన్ పౌరులు చనిపోతున్నారో భారత్‌కు అవసరం లేదని, అందుకే.. ఆ దేశంపై సుంకాలను మరింతగా పెంచబోతున్నామని స్పష్టంచేశారు. ట్రంప్ హెచ్చరికలపై భారత ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. అమెరికా సుంకాలతో భారత్‌పై స్వల్ప ప్రభావం ఉంటుందని, జీడీపీ తగ్గుదల 0.2శాతాన్ని మించదని వివరించాయి. రష్యా చమురు కొనుగోలును ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పాయి. భారత విదేశాంగ శాఖ కూడా అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై సీరియస్ అయ్యింది. భారత్‌ను అమెరికా, ఐరోపా సమాఖ్య అన్యాయంగా లక్ష్యంగా చేసుకుంటున్నాయని విమర్శించింది. "ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత.. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతిని ప్రారంభించింది. యుద్ధం కారణంగా సంప్రదాయంగా వస్తున్న చమురు సరఫరా ఐరోపాకు మళ్లింది. ఆ సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్లలో స్థిరత్వం కోసం రష్యా చమురు కొనుగోలుకు భారత్‌ను అమెరికానే ప్రోత్సహించింది" అని వివరించింది. భారత్‌లో వినియోగదారులకు అందుబాటు ధరల్లో చమురు లభించేలా భారత్ చర్యలు తీసుకుంటోందని చెప్పింది. భారత్‌ను విమర్శిస్తున్న దేశాలు కూడా రష్యాతో వ్యాపారం చేస్తున్నాయని వివరించింది. "2024లో రష్యాతో ఐరోపా సమాఖ్య 67.5 బిలియన్ యూరోల విలువైన వాణిజ్యం జరిపింది. 2023లో సేవల రంగంలో 17.2 బిలియన్ యూరోల వాణిజ్యాన్ని కొనసాగించింది. ఈ మొత్తం విలువ భారత్-రష్యా మధ్య జరిగే వాణిజ్యం కంటే చాలా తక్కువ. అమెరికా కూడా తన అణు పరిశ్రమ కోసం రష్యా నుంచి యురేనియం హెక్సాఫ్లోరైడ్‌ను.. ఈవీ పరిశ్రమల కోసం పల్లాడియం, ఎరువులు, రసాయనాలను దిగుమతి చేసుకుంటోంది" అనిపేర్కొంది.

## మా దగ్గరా అణు జలాంతర్గాములున్నాయ్

**» ట్రంప్ హెచ్చరికలకు రష్యా గట్టి కౌంటర్**

మాస్కో, ఆగస్టు 4: అమెరికా పంపిన రెండు అణు జలాంతర్గాములను ఎదుర్కొనేందుకు తమ వద్ద చాలా ఎక్కువగానే అణు జలాంతర్గాములు ఉన్నాయంటూ రష్యా గట్టిగా కౌంటర్ ఇచ్చింది. రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రీ మెద్వెదేవ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో ఆ దేశానికి చేరువలో రెండు అణు జలాంతర్గాములను మోహరించాలని తాను ఆదేశించినట్టు శుక్రవారం ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా రష్యా పార్లమెంటు సీనియర్ సభ్యుడు విక్టర్ వాడలాట్స్కీ స్పందించారు. 'అమెరికా అణు జలాంతర్గాముల కంటే రష్యా అణు జలాంతర్గాములు చాలా పెద్దవి' అన్నారు.

## మద్యం మత్తులో డ్రైవింగ్..
## కారుతో 30 మందిని ఢీకొట్టిన ఆర్మీ అధికారి

నాగ్‌పూర్, 4: సెలవుపై వచ్చిన ఓ ఆర్మీ అధికారి మద్యం మత్తులో కారు నడిపి 30 మందిని గాయపరిచాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగింది. అస్సాంలో సైనికుడిగా పనిచేస్తున్న హర్షపాల్ మహదేవ్ వాఘ్‌మారే (40) నాలుగు రోజుల సెలవుపై మహారాష్ట్రలోని తన స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో పక్క గ్రామానికి కారులో బయల్దేరాడు. అయితే, అప్పటికే మద్యం మత్తులో ఉన్న అతడు కారును వేగంగా, నిర్లక్ష్యంగా నడిపి రోడ్డుపై వెళ్తున్న దాదాపు 30 మందిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు బోల్తాకొట్టి పక్కనే ఉన్న మురుగు కాలువలో పడిపోయింది. క్షణాల్లోనే అక్కడికి చేరుకున్న స్థానికులు ఆ మురుగు కాలువ నుంచి హర్షపాల్‌ను బయటకు లాగి చితకబాదారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ఆర్మీ అధికారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేశారు.

## ఎప్పుడు జైలుకెళ్తాడో? జగన్‌కే తెలియాలి

**» ఈ సారి ఎన్నాళ్లు జైల్లో ఉంటాడో?**

**» ఆయన సహచరులూ జైలు బాట: మంత్రి జనార్దన్‌రెడ్డి**



ఉక్కు పరిశ్రమ వ్యర్థాలు, తారు మిశ్రమంతో ప్రయోగాత్మకంగా వేస్తున్న రోడ్‌ను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం కోసం సీఎం చంద్రబాబు పరిశ్రమలు, పెట్టుబడులు తెచ్చి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తుంటే.. పెట్టుబడిదారులకు తప్పుడు మెయిల్స్ చేస్తూ, అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని ఆర్అండ్‌బీశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మండిపడ్డారు. గత ఐదేళ్లూ పెట్టుబడిదారులు రాకుండా అడ్డుకుని, పారిశ్రామిక వేత్తలను బెదిరించిన జగన్.. ఇప్పుడు పెట్టుబడులు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. చంద్రబాబు రాయలసీమలో ఫ్యాక్షన్‌ను నియంత్రిస్తే.. జగన్ పాలనలో ఫ్యాక్షన్‌ను పెంచి పోషించారని విమర్శించారు. 'జగన్ మంత్రివర్గ సహచరులు జైళ్లకు వెళ్తున్నారు. కాళ్లకు చెప్పులేసుకోను.. నేను దేవుడ్ని అని చెప్పుకొనే చెవిరెడ్డి, పెద్ద మనిషిలా చెప్పుకొనే మాజీ మంత్రి కాకాణి జైలుకెళ్లారు. ఒక ఎంపీ జైల్లో ఉన్నారు. 16 నెలలు జైలులో గడిపిన జగన్ ఎప్పుడు జైలుకెళ్తారో? ఈ సారి ఎన్నాళ్లు జైల్లో ఉంటారో ఆయనకే తెలియాలి. వైఎస్సార్ హయాంలో తప్పు చేసిన ఐఏఎస్‌లు జైళ్లకెళ్లి కెరీర్‌ను నాశనం చేసుకున్నారు. జగన్ హయాంలోనూ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొందరు తప్పులు చేశారు. వచ్చే నాలుగేళ్లలో రాయలసీమ కోనసీమకు ధీటుగా హార్టీకల్చర్ హబ్‌గా, పరిశ్రమలు, ప్రాజెక్టులు, ఉద్యోగ, ఉపాధి కేంద్రంగా తయారవుతుంది. సీమ ప్రజలు ప్రశాంతతను కోరుకుంటున్నారు. అది చంద్రబాబు, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం' అన్నారు. వెంకటేశ్‌నాయుడు నోట్ల కట్టలతో వీడియో కనిపించిన విషయంపై మాట్లాడుతూ అతనిది నంద్యాల అయినా తనకు తెలియదని చెప్పారు. జనవరి 1న బొకే ఇచ్చి, సెల్ఫీ తీసుకుంటే.. వారు చేసే తప్పుడు పనులతో సంబంధం ఉన్నట్లు కాదన్నారు.

### లక్ష కోట్లతో రోడ్ల నిర్మాణం

రాష్ట్రంలో ఐదేళ్లు జగన్ అసమర్థ, అరాచక, అవినీతి పాలనతో విధ్వంసం సృష్టిస్తే.. చిన్నాభిన్నమైన వ్యవస్థల్ని సరిచేస్తూ ఇప్పుడు సీఎం చంద్రబాబు డబుల్ ఇంజన్ సర్కార్‌తో ముందుకెళ్తున్నారని జనార్ధన్‌రెడ్డి చెప్పారు. 'రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల నిర్మించడానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే రూ.70వేల కోట్ల పనులు జరుగుతున్నాయి. హైదరాబాద్-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే, ఆరు వరుసల ప్రాజెక్టులుగా రూ.6,700 కోట్లతో హైదరాబాద్- విజయవాడ హైవే, రూ.2,600 కోట్లతో విజయవాడ-మచిలీపట్నం హైవే, నాలుగు వరుసలుగా రూ.2,605కోట్లతో వినుకొండ-గుంటూరు హైవే, రూ.4,200 కోట్లతో బుగ్గ-కైప-గిద్దలూరు రూ.2,500 కోట్లతో ఆకివీడు-దిగమర్రు, రూ.4,200కోట్లతో పెడన-లక్ష్మీపురం, రూ.1,182 కోట్లతో ముద్దనూరు-కడప రోడ్లున్నాయి. త్వరలో వీటికి డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్రానికి పంపుతాం. గతేడాది రూ.861 కోట్లతో గుంతలు లేని రోడ్ల పథకాన్ని అమలు చేశాం. 171 నియోజకవర్గాల్లో 20 వేల కిలోమీటర్ల గుంతలు పూడ్చాం' అని చెప్పారు.

## నిజమైన భారతీయుడు అలా మాట్లాడడు!



### రాహుల్ చైనా వ్యాఖ్యలపై సుప్రీం ఆగ్రహం

**» ఆ దేశం మన భూభాగంలో 2వేల చ.కిమీ ఆక్రమించిందని మీకెలా తెలుసు?**

**» మీరు అక్కడ ఉన్నారా.. అంటూ నిలదీత**

**» రాహుల్ మెరుగ్గా మాట్లాడాల్సిందని న్యాయవాది సింఘ్వీ అంగీకారం**

**» పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట**

**» లఖ్‌నవూ కోర్టులో విచారణపై సుప్రీం స్టే**

న్యూఢిల్లీ, ఆగస్టు 4: చైనా భారత భూభాగాన్ని ఆక్రమించిందని.. అరుణాచల్ ప్రదేశ్‌లో భారత జవాన్లను కొడుతోందని వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆయన నిజంగా భారతీయుడైతే ఇలాంటి వ్యాఖ్యలు చేయరని స్పష్టంచేసింది. గల్వాన్ లోయలో 2020 జూన్‌లో భారత, చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణల్లో 20 మంది భారత జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే. చైనా భూభాగాన్ని ఆక్రమించుకుందని, ప్రధాని మోదీ, ఆయన ప్రభుత్వం చైనాకు లొంగిపోయారని 2022 డిసెంబరులో 'భారత్ జోడో యాత్ర' సందర్భంగా రాహుల్ విమర్శించారు. ఆయన భారత సైన్యాన్ని అవమానించేలా మాట్లాడారంటూ లఖ్‌నవూ ప్రత్యేక కోర్టులో ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవ అనే వ్యక్తి పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసులో తమ ముందు హాజరు కావాలని కోర్టు రాహుల్‌కు ఈ ఏడాది ఫిబ్రవరిలో సమన్లు జారీచేసింది. దీనిని ఆయన అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేశారు. ఆయన వ్యాజ్యాన్ని న్యాయస్థానం మే 29న కొట్టివేసింది. ఆర్మీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడే హక్కు వాక్ స్వాతంత్ర్యం కిందకు రాదని.. కోర్టు ముందు ఆయన హాజరు కావలసిందేనని స్పష్టంచేసింది. దీంతో తనపై కేసును రద్దుచేయాలంటూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో క్వాష్ పిటిషన్ వేశారు. ఇది సోమవారం జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టిన్ జార్జి మసీహ్‌తో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా జస్టిస్ దత్తా రాహుల్ తీరుపై కటువైన వ్యాఖ్యలు చేశారు. 'చైనా మన భూభాగంలో 2 వేల చదరపు కిలోమీటర్లు ఆక్రమించిందని మీకెలా తెలుసు? మీరు అక్కడ ఉన్నారా? విశ్వసనీయ ఆధారాలేమైనా మీ వద్ద ఉన్నాయా? పార్లమెంటులో మాట్లాడకుండా సోషల్ మీడియాలో ఎందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు? ఎలాంటి ఆధారాల్లేకుండా ఇలాంటి ప్రకటనలు ఎందుకు చేస్తారు' అని ప్రశ్నలవర్షం కురిపించారు. నిజమైన భారతీయుడైతే ఇలా మాట్లాడరని స్పష్టం చేశారు. వీటిపై మీడియాలో ప్రచురించేలా ఇలా మాట్లాడకుంటే ఆయన ప్రతిపక్ష నేత ఎలా అవుతారని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కోర్టును ప్రశ్నించారు. ధర్మాసనం స్పందిస్తూ.. సరిహద్దుల్లో సంక్షోభం జరుగుతుంటే ఇరువైపులా ప్రాణనష్టం జరుగడం అసాధారణం కాదని గుర్తుచేసింది. అయితే నిజమైన భారతీయులు కూడా మన జవాన్లను కొట్టి చంపారనే అంటారని సింఘ్వీ అన్నారు. ప్రభుత్వం సరైన వివరాలు చెప్పాలన్నదే రాహుల్ అభిమతమని.. సమాచారాన్ని అణచివేయడాన్నే ఆయన లేవనెత్తుతున్నారని తెలిపారు. జస్టిస్ దత్తా జోక్యం చేసుకుని.. బాధ్యతాయుత ప్రతిపక్ష నేతగా రాహుల్ ఇలా మాట్లాడి ఉండాల్సింది కాదని.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి తగు వేదికలు ఉంటాయని.. వీటిపై ఆయన పార్లమెంటులో ఎందుకు మాట్లాడరని జస్టిస్ దత్తా నిలదీశారు. రాహుల్ మరింత మెరుగ్గా వ్యాఖ్యలు చేసి ఉండాల్సిందని సింఘ్వీ అంగీకరించారు. అయితే ఆయనపై ఫిర్యాదు చేయడం.. ఆయన్ను వేధించడానికి చేసిన ప్రయత్నమని చెప్పారు. క్రిమినల్ ఫిర్యాదును కోర్టు పరిగణనలోకి తీసుకోదలిస్తే.. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 223 ప్రకారం.. నిందితుడి వాదనలు కూడా వినాలని.. ఈ కేసులో అలా జరుగలేదని తెలిపారు. దీంతో రాహుల్‌పై లఖ్‌నవూ కోర్టులో విచారణపై ధర్మాసనం స్టే విధించింది. కేసును కొట్టివేయాలన్న ఆయన అభ్యర్థనపై యూపీ ప్రభుత్వానికి, పరువునష్టం దావా వేసిన ఉదయ్‌శంకర్ శ్రీవాస్తవకు నోటీసులు జారీచేసింది. 3 వారాల్లో జవాబివ్వాలని ఆదేశించింది.

## శ్రీకృష్ణుడే మొదటి మధ్యవర్తి!

**» ఆ మార్గంలో వివాదాన్ని పరిష్కరించుకోవాలి**

**» యూపీలో బాంకే బిహారీ ఆలయ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య**

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, శ్రీ బాంకే బిహారీ ఆలయ ట్రస్టు మధ్య వివాదం కేసులో సుప్రీంకోర్టు సోమవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. శ్రీకృష్ణుడే 'మొదటి మధ్యవర్తి' అని, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకొనేందుకు ప్రయత్నించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీలతో కూడిన ధర్మాసనం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం, ఆలయ ట్రస్టు మధ్య వివాద పరిష్కారానికి, ఆలయ వ్యవహారాలు చూసుకొనేందుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి లేదా సీనియర్ రిటైర్డ్ జిల్లా జడ్జి నేతృత్వంలో ఒక కమిటీని ప్రతిపాదించింది. మథుర జిల్లాల్లోని వృందావన్‌లో బాంకే బిహారీ ఆలయం ఉంది. భక్తుల ప్రయోజనాలు, సౌకర్యాల కోసం ఆలయ నిధుల నుంచి రూ.500 కోట్లతో బాంకే బిహారీ ఆలయ కారిడార్‌ను అభివృద్ధి చేయాలని ప్రతిపాదిస్తూ యూపీ ప్రభుత్వం ఇటీవల ఆర్డినెన్స్ జారీచేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆలయ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇది ఒక ప్రైవేటు ఆలయం అని, తమ వాదనలు వినాలని వారి తరఫు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివన్ కోరారు. దీనిపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు శ్రీకృష్ణుడి రాయబారం గురించి ప్రస్తావించింది. ఆయన ప్రపంచానికి తెలిసిన మొదటి మధ్యవర్తి అని పేర్కొంది. ఇదే సమయంలో ఆలయ నిర్వహణను తమ అధీనంలోకి తెచ్చుకొనేందుకు ఆర్డినెన్స్ తీసుకురావడంలో అంత తొందర ఎందుకని సర్వోన్నత న్యాయస్థానం యూపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అసలు మొదట ఆ ఆర్డినెన్స్ రాజ్యాంగ బద్ధతను పరిశీలించాలని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది. ఆలయ నిధులు ఉపయోగించుకొనేందుకు యూపీ ప్రభుత్వం సుప్రీంకోర్టు నుంచి అనుమతి పొందిన 'రహస్య పద్ధతి' పట్ల అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో ప్రధాన భాగస్వాముల వాదనలు వినని నేపథ్యంలో ఆలయ నిధులు వినియోగించుకొనేందుకు అనుమతిస్తూ మే 15న ఇచ్చిన తీర్పును నిలిపివేస్తామని, దీనిపై మంగళవారం ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం పేర్కొంది. 1862లో నిర్మించిన బాంకే బిహారీ ఆలయం ఉత్తర భారతంలో ఇక ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉంది. దీని రోజువారీ ఆచారాలు, ఆలయ పాలనను వంశపారపర్యంగా వస్తున్న పూజారులైన షెబాయిత్‌లు నిర్వహిస్తుంటారు. అయితే 2022లో జన్మాష్టమి వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న తొక్కిసలాటలో ఇద్దరు భక్తులు మరణించిన తర్వాత ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే డిమాండ్ వచ్చింది. ఈ నేపథ్యంలో భక్తుల రద్దీని నిర్వహించేందుకు, భద్రతా ప్రమాణాలు పాటించేందుకు ఒక కారిడార్ ప్లాన్‌ను అభివృద్ధి చేయాలని 2023 సెప్టెంబరులో అలహాబాద్ హైకోర్టు యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## లోకం తీరు




## ప్రయాణికులకు 'ఎయిరిండియా' పరీక్ష!

**ఒకేరోజు 2విమానాల్లో సాంకేతిక లోపం**

బెంగళూరు, గన్నవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెండు ఎయిరిండియా విమానాలు సోమవారం ఒకేరోజు సాంకేతిక సమస్యతో ప్రయాణికులను ఇక్కట్లకు గురిచేసింది. వీటిలో ఒకటి బెంగళూరు నుంచి కోల్‌కతాకు బయలుదేరి, గమ్యం చేరకుండానే వెనుదిరిగింది. ఢిల్లీ నుంచి విజయవాడ బయలుదేరాల్సిన మరో విమానంలో సాంకేతిక సమస్యతో నాలుగు గంటలు ఆలస్యంగా నడిచింది. వివరాలివీ.. బెంగళూరు నుంచి ఎయిరిండియా విమానం(1ఎక్స్ 2718) ఆదివారం రాత్రి 7.05 గంటలకు కోల్‌కతాకు బయల్దేరాల్సి ఉంది. కానీ 11 నిమిషాలు ఆలస్యంగా 7.16 గంటలకు టేకాఫ్ అయ్యింది. ఆకాశంలోకి వెళ్లిన కాసేపటికే విమానంలో హైడ్రాలిక్ సమస్య తలెత్తినట్లు పైలట్‌లు గుర్తించారు. కోల్‌కతాకు వెళ్లేందుకు సమయం పడుతుందని భావించి వెంటనే వెనుదిరిగారు. ముందు జాగ్రత్త చర్యగా, విమానంలో ఇంధనం బరువు తగ్గించేందుకు రాత్రి 9.19 గంటల వరకు ఆకాశంలోనే చక్కర్లు కొట్టించారు. అనంతరం బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అలాగే, ఢిల్లీ-విజయవాడ ఎయిరిండియా విమానం ప్రతి రోజూ ఢిల్లీలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి 12.40కి ఢిల్లీ వెళుతుంది. ఈ క్రమంలో సోమవారం గన్నవరానికి బయలుదేరగా.. టేకాఫ్ సమయంలో పైలట్ సాంకేతిక సమస్యను గుర్తించి మళ్లీ రన్‌వే మీదకు తీసుకువచ్చారు. అందులో 155 మంది ప్రయాణికులున్నారు. సాంకేతిక సమస్యను సరి చేసిన తర్వాత సాయంత్రం 4 గంటలకు గన్నవరం చేరుకుంది. తిరిగి 4.48కి 103 మంది ప్రయాణికులతో ఢిల్లీ వెళ్లింది. మరో 32 మంది ప్రయాణికులు టికెట్లను క్యాన్సిల్ చేసుకున్నారు.

## పార్లమెంటులోప్రతిష్టంభనపై..
## నేడు ఎన్డీయే.. 7న ఇండియా
## కూటముల భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు బుధవారం కూడా లోక్‌సభలో తీవ్ర గందరగోళం సృష్టించాయి. ఓటర్ల జాబితా సవరణపై పార్లమెంట్‌లో చర్చించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఉభయ సభలు కొనసాగలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఆదివారం రాత్రి రాష్ట్రపతి ముర్ముతో సమావేశం అయ్యారు. కానీ, ఇటీవల మోదీ బ్రిటన్, మాల్దీవుల పర్యటన తర్వాత రాష్ట్రపతిని మర్యాద పూర్వకంగా కలిసినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయితే.. పార్లమెంట్‌లో ఏర్పడిన ప్రతిష్టంభనపైనే మోదీ చర్చించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, ఒడిసాలో వరుసగా జరుగుతున్న అత్యాచార ఘటనలపై వివరణ ఇచ్చేందుకు రాష్ట్రపతిని హోంమంత్రి అమిత్ షా కలిసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అయితే, జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే విషయంపై మోదీ, అమిత్‌షా రాష్ట్రపతిని కలిసినట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై చిచ్చు రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రతిపక్షాలపై దాడిని ఎక్కు పెట్టేందుకు మోదీ మంగళవారం ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల షెడ్యూలు రీత్యా మొత్తం ఎన్డీయే ఎంపీలను సంఘటితం చేసి, అధికార కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు అవసరమైన వ్యూహరచనను ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిసింది. ప్రతిపక్షాలు కూడా సంఘటిత కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 7న భేటీకానున్నాయి. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఇవ్వనున్నారు. కూటమి నేతలంతా బిహార్ ఓటర్ల జాబితా అంశంపై నిరసనలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈనెల 8న ఎన్నికల కమిషన్(ఈసీఐ) కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.

## మూగబోయిన గిరిజన గళం!

### జార్ఖండ్ మాజీ సీఎం, జేఎంఎం అధినేత శిబుసొరేన్ కన్నుమూత

**» కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతూ ఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో తుదిశ్వాస**

**» జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరు**

**» 'సంతాలీ జాతి గురూజీ'గా గుర్తింపు**

**» శూన్యమే మిగిలింది: సీఎం హేమంత్**

రాంచీ/న్యూఢిల్లీ, ఆగస్టు 4: గిరిజనుల హక్కుల కోసం, వారి సాధికారత కోసం, ముఖ్యంగా సంతాలీ జాతి అభివృద్ధి కోసం అవిరళ కృషి సల్పిన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) పార్టీ వ్యవస్థాపకుడు శిబు సొరేన్ కన్నుమూశారు. 81 ఏళ్ల శిబు.. గత నెల రోజులకు పైగా కిడ్నీ సంబంధిత వ్యాధితో ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 8.56 గంటల సమయంలో ఆసుపత్రిలోనే ఆయన తుదిశ్వాస విడిచినట్టు డాక్టర్ ఏకే భల్లా ప్రకటించారు. "నెల రోజుల కిందట ఆయనకు గుండెపోటు వచ్చింది. ఆసుపత్రిలో అత్యవసర చికిత్సల విభాగంలో వైద్యం అందించాం. శిబు ప్రాణాలు కాపాడేందుకు అన్ని ప్రయత్నాలు చేశాం. సోమవారం పరిస్థితి విషమించి.. ఆసుపత్రిలో కుటుంబ సభ్యుల సమక్షంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు." అని డాక్టర్ భల్లా వివరించారు.

### సంతాలీ జాతి గురూజీ..

జార్ఖండ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలనే సంకల్పంతో శిబు సొరేన్ చేపట్టిన ఉద్యమాలు.. దేశవ్యాప్తంగా ఆయనకు గుర్తింపు తెచ్చిపెట్టాయి. సుదీర్ఘకాలం ఉద్యమాలతోనే గడిపిన శిబు సొరేన్.. గిరిజనుల హక్కుల కోసం పోరాడారు. ముఖ్యంగా సంతాలీ ప్రజల అభ్యున్నతి, పేదరికం, విద్య వంటి వాటి కోసం ఉద్యమాలు చేశారు. ఫలితంగా సంతాలీ జాతి గురూజీ(దిశోం గురూజీ)గా ఆయన మన్ననలు పొందారు. 38 ఏళ్ల కిందట జేఎంఎం పార్టీని స్థాపించారు. జార్ఖండ్ ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. అయితే.. ఆయన రాజకీయ జీవితం వివాదాల సుడుల్లో చిక్కుకుంది. పలు కేసులు కూడా నమోదై.. జైలుకు వెళ్లాల్సి వచ్చింది. కాగా, తన తండ్రి మరణంతో తనకు శూన్యమే మిగిలిందని జార్ఖండ్ సీఎం హేమంత్ సొరేన్ కన్నీటి పర్యంతమయ్యారు. "దిశోం గురూజీ మనల్ని వదిలి వెళ్లిపోయారు. నాకిప్పుడు శూన్యమే మిగిలింది." అని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇదిలావుంటే, మాజీ సీఎం శిబు మరణంతో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను నిరవధికంగా వాయిదా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల సంతాప దినాలను ప్రకటించింది. పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు శిబు సొరేన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన యోధుడిగా అభివర్ణించారు.



### నేడు అంత్యక్రియలు

శిబు సొరేన్ భౌతిక కాయాన్ని సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి జార్ఖండ్ రాజధాని రాంచీకి తరలించారు. మంగళవారం ఉదయం వరకు జేఎంఎం కేంద్ర కార్యాలయంలో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం.. రామ్‌గఢ్ జిల్లాలోని శిబు స్వగ్రామానికి తరలించి అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

### ఆసుపత్రికి మోదీ



శిబు సొరేన్ మరణ వార్త తెలియగానే.. ప్రధాని మోదీ గంగారామ్ ఆసుపత్రికి చేరుకుని నివాళులర్పించారు. సీఎం హేమంత్ సొరేన్ సహా కుటుంబ సభ్యులను ఓదార్చారు. గిరిజనుల కోసం శిబు జీవితాంతం కృషి సల్పారని, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతిని ఆకాంక్షించారని ప్రధాని పేర్కొన్నారు. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా శిబు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అమిత్‌షా, నితిన్ గడ్కరీ సహా పలువురు కేంద్ర మంత్రులు, జార్ఖండ్ గవర్నర్ సంతోష్ గంగ్వార్, ఖర్గే, రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్, తమిళనాడు సీఎం స్టాలిన్ సంతాపం వ్యక్తం చేశారు. ఆర్జేడీ అధినేత, మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్.. శిబు సొరేన్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం, సాధికారత కోసం తామిద్దరం కలిసి ఉద్యమించిన రోజులు ఇప్పటికీ కళ్లముందు కదలాడుతున్నాయని పేర్కొన్నారు.

## అమెరికాలోకి 'ఈబీ-5' రూట్!

**» హెచ్1బీ, విద్యార్థి వీసాలపై ఆంక్షల నేపథ్యంలో పెట్టుబడుల మార్గం పడుతున్న భారతీయులు**

**» 2024 అక్టోబర్- 2025 జనవరి మధ్య 1,200 దరఖాస్తులు..649 వీసాల మంజూరు**




వాషింగ్టన్, ఆగస్టు 4: అమెరికాలో ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వీసాలపై ఆంక్షలు పెరిగాయి. ముఖ్యంగా భారతీయులకు విద్యార్థి వీసాలు, చదువు పూర్తయ్యాక తాత్కాలిక ఉద్యోగం చేసుకునేందుకు వీలు కల్పించే హెచ్ 1బీ వీసాలు అందడం కష్టంగా మారింది. 2024 అక్టోబర్ నుంచి 2025 మార్చి మధ్య.. అంతకుముందు ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఏకంగా 43.5 శాతం విద్యార్థి వీసాలు తగ్గిపోయాయి. ఈ క్రమంలో అమెరికాకు వెళ్లేందుకు భారతీయులు 'ఈబీ-5' వీసాల మార్గం పడుతున్నారు. ఇక అమెరికాలో గ్రీన్‌కార్డులు, హెచ్1బీ తదితర వీసాలకు సంబంధించి ప్రస్తుతం కోటీ పది లక్షల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అంచనా. వాటిని పరిష్కరించేందుకు కొన్నేళ్లు పట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో త్వరగా శాశ్వత నివాస అర్హత పొందేందుకు ఈబీ-5 వీసా వీలు కల్పిస్తుంది. 'అమెరికన్ ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ అలయన్స్ (ఏఐఐఏ)' తాజాగా ఈ వివరాలను వెల్లడించింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి భారతీయులు ఈబీ-5 వీసాల కోసం దరఖాస్తు చేసుకోవడం ఇంతకు ముందెన్నడూ లేనంతగా పెరిగిందని తెలిపింది. ఈబీ-5 వీసాల కోసం భారతీయుల నుంచి 2024 అక్టోబర్ నుంచి 2025 జనవరి వరకు 1,200 దరఖాస్తులు వచ్చాయని, అందులో 649 వీసాలు మంజూరయ్యాయని యూనైటెడ్ స్టేట్స్ ఇమిగ్రేషన్ ఫండ్ (యూఎస్ఐఎఫ్) చీఫ్ నికోలస్ తెలిపారు. అంతకుముందు 2023 అక్టోబర్ నుంచి సెప్టెంబర్ 2024 వరకు ఏడాది కాలంలో మంజూరైన ఈబీ-5 వీసాలు 1,428 మాత్రమేనని తెలిపారు. అమెరికాలో నివాసం కోసం రకరకాల వీసాల అవసరం లేకుండా 'గోల్డ్ కార్డు' ప్రవేశపెడుతున్నామని.. రూ.43.8 కోట్లు (5 మిలియన్ డాలర్లు) చెల్లించి 'గోల్డ్ కార్డు'ను పొందవచ్చని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈబీ-5 వీసా స్థానంలోనే గోల్డ్ కార్డును ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అది అమల్లోకి వచ్చేలోగానే ఈబీ-5 వీసాతో అమెరికాలో నివాస అర్హత పొందేందుకు భారతీయులు క్యూ కడుతున్నారు.

### ఏమిటీ ఈబీ-5 వీసా..

అమెరికాలో పెట్టుబడులు పెట్టి, స్థానికంగా ఉద్యోగాలు కల్పించేవారికి నివాస అర్హత కల్పిస్తూ ఈబీ-5 వీసాలను జారీ చేస్తారు. అమెరికాలోని సాధారణ ప్రాంతాల్లో సుమారు రూ.9.2 కోట్లు (10.5 లక్షల డాలర్లు) లేదా 'టార్గెటెడ్ ఎంప్లాయ్‌మెంట్ ఏరియా (టీఈఏ)'లలో రూ.7 కోట్లు (8 లక్షల డాలర్లు) పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. పెట్టుబడి పెట్టినవారితోపాటు వారి జీవిత భాగస్వామి, వివాహం కాని 21 ఏళ్లలోపు పిల్లలకు అమెరికాలో శాశ్వత నివాస అర్హత లభిస్తుంది.. ఈబీ-5 గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాక మూడు నుంచి ఆరు నెలల్లోపే ఉద్యోగ, ప్రయాణ పర్మిట్లు వస్తాయని.. ఈబీ-5 గ్రీన్‌కార్డు మంజూరయ్యే వరకు ఆగాల్సిన అవసరం లేదని వివరించారు. కాగా, అమెరికాలో స్థానికుల ఉద్యోగావకాశాలను విదేశీ విద్యార్థులు కొల్లగొట్టేందుకు హెచ్-1బీ వీసాలు కారణమవుతున్నాయని.. అందువల్ల హెచ్-1బీ వీసాలను మొత్తంగా ఎత్తేయాలని ట్రంప్ సన్నిహితుడు స్టీవ్ బానన్ డిమాండ్ చేశారు. అమెరికాకు వస్తున్న విదేశీ విదార్థులను వారి చదువు పూర్తికాగానే స్వదేశాలకు తిప్పి పంపేయాలని ప్రతిపాదించారు.

## శ్రీవారి సేవలో కర్ణాటక, ఒడిశా గవర్నర్లు


తిరుమల ఆలయం ముందు కుటుంబ సభ్యులతో కంభంపాటి హరిబాబు

తిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల గవర్నర్లు థావర్ చంద్ గెహ్లోత్, కంభంపాటి హరిబాబు దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వారిని వేదపండితులు ఆశీర్వదించగా టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

## గ్రానైట్ క్వారీని పరిశీలించిన ఒడిశా బృందం

- ప్రమాదంపై ఏపీ ప్రభుత్వ స్పందన బాగుందని వ్యాఖ్య

బల్లికురవ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా బల్లికురవ ప్రాంతంలోని వీర్లకొండవద్ద ఉన్న సత్య కృష్ణ గ్రానైట్ క్వారీలో బండరాయి పడి ఒడిశాకు చెందిన ఆరుగురు కూలీలు మృతి చెందిన ఘటనపై అక్కడి ప్రభుత్వం స్పందించింది. సోమవారం ఆ రాష్ట్ర లేబర్ జాయింట్ కమిషనర్ భగవణ మహాపాత్ర, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా లేబర్ జాయింట్ కమిషనర్ ప్రీతిష్ పాండా, లేబర్ కమిషనర్ కన్సల్టెంట్ బస్తాబంద్ ఆచార్య చీరాల ఆర్డీవోతో కలిసి ప్రమాదం జరిగిన క్వారీని పరిశీలించారు. అనంతరం నరసరావుపేట వెళ్లి అక్కడ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ఒడిశా ప్రభుత్వం రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ప్రమాదం జరిగిన వెంటనే బాగా స్పందిందని వ్యాఖ్యానించారు.

## ఖతర్‌లోనే తనకల్లు వాసి మృతదేహం

- పంపేందుకు డబ్బులు అడుగుతున్న యజమాని
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం వినతి


నూరుల్లా

తనకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఖతర్‌లో ఆత్మహత్య చేసుకున్న నూరుల్లా మృతదేహం కోసం అతని కుటుంబం ఎదురు చూస్తోంది. మృతదేహాన్ని పంపాలంటే ఏడు వేల రియాల్స్ ఇవ్వాలని అక్కడి యజమాని కపిల్ డిమాండ్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన నూరుల్లా(36), మూడేళ్ల క్రితం ఖతర్ వెళ్లారు. అక్కడ కపిల్ అనే వ్యక్తి వద్ద డ్రైవర్‌గా పనిచేసేవారు. గత నెల 31న నూరుల్లా ఆత్మహత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేందుకు సహకరించాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను బాధితులు ఆశ్రయించారు. ఎమ్మెల్యే చొరవతో సీఎంఓ అధికారులు తమతో మాట్లాడారని తెలిపారు. తొలుత సొంత ఖర్చులతో మృతదేహాన్ని పంపుతానని యజమాని చెప్పారని, ఇప్పుడు ఏడు వేల రియాల్స్ (సుమారు రూ.1.60 లక్షలు) అడుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేదంటే అక్కడే అంత్యక్రియలు నిర్వహించి, తమకు రూ.50 వేలు పంపుతామని అంటున్నారని తెలిపారు. ప్రభుత్వం చొరవ చూపి, మృతదేహాన్ని తెప్పించాలని నూరుల్లా భార్య షాజార్ విజ్ఞప్తి చేశారు.

## మహారాష్ట్ర చైన్ గ్యాంగ్ ఆటకట్టు

- అదుపులోకి తీసుకున్న తిరుమల పోలీసులు

తిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల బంగారు గొలుసుల చోరీ చేసే మహారాష్ట్రకు చెందిన ముఠాను సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 87 గ్రాముల బంగారు చైన్లు, ఓ కట్టర్, స్కార్పియో కారును తిరుమల వన్‌టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేశంలోని ప్రసిద్ధ ఆలయాల వద్ద వీరు బంగారు గొలుసుల దొంగతనాలకు పాల్పడుతుంటారని పోలీసులు తెలిపారు. జూన్ 17న తిరుమలలోని పీఏసీ3లోని 6వ నంబరు హాల్లో నిద్రిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తురాలి మెడలోని 47 గ్రాముల బంగారు తాళిబొట్టును వీరు దొంగిలించారు. జూలై 26న శ్రీవారి ఆలయంలోని వెండి వాకిలి వద్ద కృష్ణగిరికి చెందిన 65 ఏళ్ల భక్తురాలి మెడలోని 40 గ్రాముల బంగారు తాళిబొట్టును అపహరించారు. భక్తుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు తిరుమల పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించి వీరిని కనిపెట్టారు. అహ్మదాబాద్ జిల్లాకు చెందిన అర్జున్ మసల్కార్(24), జిల్నా జిల్లాకు చెందిన భగవాన్ బాపురావు గైక్వాడ్(42), రవి జనార్థన్ జాదవ్(38), బీడ్ జిల్లాకు చెందిన వికాస్ విజయ్ జాదవ్(27), గణేష్ సునీల్ గైక్వాడ్(30), ఆకాష్ బబన్ గైక్వాడ్(31)ను అదుపులోకి తీసుకున్నారు.











# దేవదాయ ట్రైబ్యునల్‌కు దిక్కెవరు?

## ఏడాది కాలంగా చైర్మన్ కుర్చీ ఖాళీ

- 3 నెలల క్రితం సభ్యుని పదవీ విరమణ
- ఇన్‌చార్జి మెంబర్‌గా ఎండోమెంట్ ఏడీసీ-1 కమిషనర్ ఆఫీస్‌తో పాటు ఇక్కడా ఆయనే
- కమిషనర్ ఆర్డర్లను ఏడీసీ వ్యతిరేకించగలరా?
- ట్రైబ్యునల్ పనితీరు, సభ్యుని నియామకంపై అభ్యంతరాలు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నతాధికారి ఇచ్చిన ఆర్డర్లను.. కింద స్థాయి అధికారి వ్యతిరేకించే అవకాశం ఉందా? ఉన్నతాధికారి తిరస్కరించిన ఫైళ్లను.. ఆమోదించగలరా? ఇప్పుడు దేవదాయ శాఖ ట్రైబ్యునల్‌లో ఇది పెద్ద సమస్యగా మారింది. కూటమి ప్రభుత్వం కీలకమైన ఎండోమెంట్ ట్రైబ్యునల్‌ను గాలికి వదిలేసింది. ఏడాదిగా చైర్మన్ పోస్టు ఖాళీగా ఉంది. ట్రైబ్యునల్ సభ్యురాలిగా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి పద్మ మూడు నెలల క్రితం బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో ట్రైబ్యునల్ ఇప్పుడు దిక్కులేని విభాగంగా మారిపోయింది. నిబంధన ప్రకారం ఎండోమెంట్ ట్రైబ్యునల్‌కు జిల్లా జడ్జి హోదాలో రిటైర్డ్ అయిన వారిని చైర్మన్‌గా, రిటైర్డ్ ఐఏఎస్ లేదా దేవదాయ శాఖ అదనపు కమిషనర్లను సభ్యులుగా నియమిస్తారు. సభ్యుల నియామకం విషయంలో స్పష్టమైన నిబంధనలున్నాయి. దేవదాయ అదనపు కమిషనర్‌ని సభ్యునిగా నియమిస్తే.. వారు ఆ ఒక్క పోస్టులోనే విధులు నిర్వహించాలి. మరో చోట కనీసం ఇన్‌చార్జి విధులు నిర్వహించడానికి కూడా వీల్లేదు. అయితే ప్రస్తుతం ట్రైబ్యునల్ మెంబర్ విషయంలో నిబంధనలు పాటించడం లేదు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారిణి పద్మ విధుల నుంచి తప్పుకున్న తర్వాత నుంచి దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏడీసీ-1కు ట్రైబ్యునల్ సభ్యునిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనిపై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.

### రీసర్వేతో దేవదాయ రికార్డుల్లోకి సామాన్యుల భూములు

దేవదాయ శాఖ భూముల వ్యవహారం, వ్యవస్థాపకుని కుటుంబసభ్యుల విషయాల్లో వచ్చిన అభ్యంతరాలపై ట్రైబ్యునల్ నిర్ణయాలు తీసుకుంటుంది. భూముల వ్యవహారాల్లోకి వెళ్తే.. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీసర్వే సామాన్య ప్రజలకు కష్టాలు తీసుకొచ్చింది. ముఖ్యంగా దేవుడి భూముల విషయంలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. సామాన్యులకు చెందిన చాలా భూములను దేవదాయ శాఖ ఆస్తులుగా రికార్డుల్లోకి ఎక్కించేశారు. రీసర్వేకు ముందు ఇలాంటి సమస్యలున్నప్పటికీ, ఆ తర్వాత అధికమయ్యాయి. ముందు తరాల నుంచి ఆధీనంలో ఉన్న భూములు ఇప్పుడు ఆకస్మాత్తుగా దేవదాయ శాఖ భూములుగా రికార్డుల్లోకి వెళ్లిపోయాయి. ఇప్పటికే దేవదాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగి తమ భూములను దక్కించుకోలేక కష్టపడుతున్న వారు వేలల్లో ఉన్నారు. అలాంటి వారికి ఎండోమెంట్ ట్రైబ్యునలే దిక్కు.

### ఇలా ట్రైబ్యునల్ పనిచేయగలదా?

దేవదాయ శాఖ అధికారులు, కమిషనర్ సాధారణంగా భూములకు ఎన్‌వోసీలు ఇచ్చే పరిస్థితి ఉండదు. మెజార్టీ కేసుల్లో దేవదాయ శాఖ కమిషనర్ భూములకు సంబంధించిన ఎన్‌వోసీలను తిరస్కరిస్తారు. కమిషనర్ ఆర్డర్‌పై ట్రైబ్యునల్‌లో చాలెంజ్ చేసే అధికారం సంబంధిత భూ యజమానులకు ఉంటుంది. అక్కడ తీర్పు వ్యతిరేకంగా వస్తే హైకోర్టును ఆశ్రయించవచ్చు. మెజార్టీ కేసులు ఎండోమెంట్ ట్రైబ్యునల్‌లోనే పరిష్కారమవుతాయి. ఇప్పుడు ఇన్‌చార్జి మెంబర్ ఉండడంతో ట్రైబ్యునల్ పనితీరు సక్రమంగా లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ట్రైబ్యునల్ సభ్యునిగా ఏడీసీ-1 విధులు నిర్వహిస్తుండడంతో కొంత ఇబ్బందులు వస్తున్నాయి. భూముల ఎన్‌వోసీల విషయంలో కమిషనర్ ఇచ్చిన అర్డర్లకు వ్యతిరేకంగా ఆయన కింద పనిచేసే ఏడీసీ-1 ఎలా నిర్ణయం తీసుకుంటారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఏడీసీ-1 ట్రైబ్యునల్ సభ్యునిగా ఉన్నంత కాలం దాని పనితీరు సక్రమంగా ఉండదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన కమిషనర్ అర్డర్లకు వ్యతిరేకంగా తీర్పులిచ్చే పరిస్థితి ఉండదని, దీని వల్ల సామాన్య భూయాజమానులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. సామాన్యులకు న్యాయం జరగాలంటే ప్రభుత్వం వెంటనే స్పందించి.. ట్రైబ్యునల్ చైర్మన్‌తో పాటు సభ్యుని నియామకాలు వెంటనే చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

## 'లుపిన్ ఫార్మా'లో విష వాయువులు లీక్

- ఆరుగురికి అస్వస్థత.. ఒకరి పరిస్థితి విషమం


ప్రమాదం జరిగిన లుపిన్ ఫార్మా పరిశ్రమ

పరవాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలోని లుపిన్ మ్యానుఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం ప్రమాదం చోటుచేసుకుంది. విష వాయువులు లీక్ కావడంతో ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్‌లో తెల్లవారుజామున మూడు గంటలకు మూడు రకాల రసాయనాలను కలిపి పైపు ద్వారా పంపుతున్నారు. ఈ క్రమంలో విష వాయువులు లీక్ అయ్యాయి. దాంతో అక్కడ షిఫ్ట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న మాతా సాయికుమార్ (40) స్పృహ కోల్పోయి అపస్మారక స్థితికి చేరుకున్నారు. అక్కడే పనిచేస్తున్న కార్మికులు కె.గణేశ్ (28), పి.సూరినాయుడు (30) పి.రాఘవేంద్రకుమార్ (42), యు.నరేశ్‌కుమార్ (40), బి.రామునాయుడు (35) అస్వస్థతకు గురయ్యారు. వీరందరినీ కంపెనీ ప్రతినిధులు చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సాయికుమార్ పరిస్థితి విషమంగా ఉంది. విష వాయువులు పీల్చడం కారణంగానే కార్మికులు అస్వస్థతకు గురై ఉంటారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు, ఇన్‌చార్జి డీఎస్పీ బి.మోహన్‌రావు, ఇన్‌చార్జి సీఐ రామచంద్రరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నెల రోజుల్లో రెండో ప్రమాదం

లుపిన్ ఫార్మా పరిశ్రమలో నెల రోజుల వ్యవధిలో రెండో ప్రమాదం జరిగింది. జూలై 8న ప్రొడక్షన్ బ్లాక్‌లో విష వాయువులు లీకై లక్ష్మణకుమార్ అనే కార్మికుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు వాపోతున్నారు.

## నేడు సీమలో భారీ వర్షాలు

- 36 గంటల్లో ఉత్తర తమిళనాడు వద్ద అల్పపీడనం
- 8 వరకు రాష్ట్రంలో వానలు

విశాఖపట్నం, అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఉత్తర తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారమూ కొనసాగింది. దీనికితోడు ఉత్తర తమిళనాడు మీదుగా తూర్పున బంగాళాఖాతం నుంచి పడమర అరేబియా సముద్రం వరకూ ఉపరితలద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో వచ్చే 36 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో సోమవారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. అక్కడక్కడ భారీ వర్షాలు పడ్డాయి. కాళహస్తి సమీప రాచగున్నేరిలో 81.5, నెల్లూరు జిల్లా వెలగపాడులో 73, చిత్తూరు జిల్లా యడమర్రిలో 67, కాకినాడ జిల్లా కరపలో 51 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోస్తాలో ఎండ తీవ్రత కొనసాగింది. మంగళవారం కోస్తా, రాయలసీమల్లో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ, కోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. బుధవారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. శుక్రవారం వరకు రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మంగళవారం మన్యం, అల్లూరి జిల్లాలతో పాటు రాయలసీమలో పలు చోట్ల వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

### దక్షిణ భారతంలో పెరగనున్న వానలు

నైరుతి రుతుపవనాలు దేశ భూభాగంలోకి ప్రవేశించిన రెండు నెలల తర్వాత రుతుపవన ద్రోణి సోమవారం హిమాలయ పర్వత ప్రాంతాల వైపు వెళ్లింది. వాతావరణ పరిభాషలో రుతుపవనద్రోణి హిమాలయాల వైపు వెళితే దక్షిణ భారతం తప్ప మిగిలినచోట్ల వర్షాలు తగ్గుముఖం పట్టాలి. కానీ.. దక్షిణ, పడమర, ఉత్తర భారతంలో వర్షాలు కురుస్తున్నాయి. అందువల్ల ప్రస్తుత పరిస్థితులను 'అసాధారణమైన రుతుపవన విరామం' (టిపికల్ బ్రేక్‌మాన్‌సూన్)గా వాతావరణ నిపుణులు అభివర్ణిస్తున్నారు. దక్షిణ భారతంలో వర్షాలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

## 42 ఏపీపీ పోస్టులకు నోటిఫికేషన్

- సెప్టెంబరు 7 దాకా గడువు.. అక్టోబరు 5న రాత పరీక్ష

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రాసిక్యూషన్ విభాగంలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ నెల 11 నుంచి సెప్టెంబరు 7 దాకా slprb.ap.gov.in వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్ ద్వారా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత గల అభ్యర్థులు ఓసీ, బీసీలైతే రూ.600, ఎస్సీ, ఎస్టీలు రూ.300 రాత పరీక్షల కోసం ఫీజు చెల్లించాలని సూచించారు. నాన్ లోకల్ అభ్యర్థులను ఏ కులం వారైనా ఓసీలుగా పరిగణిస్తారని తెలిపారు. రాత పరీక్ష అక్టోబరు 5న ఉంటుందని, ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఆబ్జెక్టివ్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు డిస్క్రిప్టివ్ విధానంలో రెండు పేపర్లు ఉంటాయని తెలిపారు.


సేనాధిపతి వేంచేపులో పాల్గొన్న అధికారులు

## శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలకు సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. ముందుగా సాయంత్రం సేనాధిపతి విష్వక్సేనుడిని ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా వసంత మండపానికి వేంచేపు చేశారు. అంకురార్పణ సందర్భంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవను రద్దు చేశారు.


## నోరు జారితే బహిరంగ క్షమాపణ చెప్పాలి

- కేటీఆర్‌కు కమ్మ సంఘం అల్టిమేటం

విజయవాడ(గవర్నర్‌పేట), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'కమ్మ సామాజిక వర్గంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అనుచిత వ్యాఖ్యలు చేశారని వస్తున్న వార్తల్లో నిజం లేకుంటే వెంటనే ఆయన వాటిని ఖండించాలి. నోరు జారి ఉంటే బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య, రాష్ట్ర వ్యాప్త కమ్మవారి సేవా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమ్మ సామాజిక వర్గం నేతలు కేటీఆర్ వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు. ఏపీ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు మాట్లాడుతూ... 'సంఘటన వెలుగులోకి వచ్చి వారం రోజులు గడుస్తున్నా కేటీఆర్ మౌనంగా ఉంటే ఎంపీ సీఎం రమేశ్ చెప్పినట్లుగా కమ్మ సామాజిక వర్గాన్ని బూతులు తిడుతూ చేసిన అనుచిత వ్యాఖ్యలు నిజమని భావించాల్సి వస్తుంది. అనుచిత వ్యాఖ్యలు చేసి ఉంటే కేటీఆర్ క్షమాపణలు చెప్పేవరకు విడిచిపెట్టే ప్రసక్తి లేదు. చాలా రోజులుగా వివాదం నలుగుతున్నా కేటీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదు? కేటీఆర్ అన్నట్లుగా చెబుతున్న మాటలకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెబుతున్న సీఎం రమేశ్ కూడా వాటిని బహిర్గతం చేయాలి. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న కమ్మ సామాజిక వర్గం నేతలు కూడా నోళ్లు విప్పాలి. దీనిపై బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని నిలదీయాలి' అని విజ్ఞప్తి చేశారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొడాలి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ... 'మేం ఏ పార్టీకీ అనుకూలంగా వ్యవహరించడం లేదు. ఇటీవల మా సామాజిక వర్గంపై బురదజల్లే కార్యక్రమాలు కుట్ర పూరితంగా జరుగుతున్నాయి. కేటీఆర్ లాంటి నాయకుడు ఇలా మాట్లాడడం సరికాదు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం' అని పేర్కొన్నారు.

## కేకే రైలు మార్గంపై పడిన కొండ చరియ

- రైళ్ల రాకపోకలకు అంతరాయం


కేకే లైన్‌లో బొర్రా-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య పట్టాలపై పడిన భారీ బండరాయి

అనంతగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేకే (కొత్తవలస-కిరండూల్) రైలు మార్గంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం బొర్రా-చిమిడిపల్లి స్టేషన్ల మధ్య సోమవారం టన్నెల్ 32బీ సమీపంలో ఉన్న బ్రిడ్జిపై పక్కనున్న కొండ పైనుంచి భారీ బండరాయి ఒకటి జారిపడింది. దీంతో పట్టాలు, ఓహెచ్‌సీ కేబుల్ దెబ్బతిన్నాయి. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. యుద్ధప్రతిపాదికన రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఘటన నేపథ్యంలో కిరండూల్ నుంచి విశాఖపట్నం వెళుతున్న పాసింజర్ రైళ్లను అరకులోయ మండలం కరకవలస వద్ద నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

## అక్కా.. వచ్చి నన్ను తీసుకెళ్లు!

- అలిపిరిలో అనాథలా నెల్లిమర్ల వాసి


వెంకట్రావుకు సేవ చేస్తున్న సుజాత

తిరుపతి, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): 'అయ్యా.. మా అక్కకి నేనంటే చాలా ఇష్టం. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో బృందావన్ అపార్టుమెంట్‌లో ఉంటుంది. తిరుపతిలో ఇట్లా రోడ్డు పక్కన పడి ఉన్నానని చెప్పండి.. వచ్చి తీసుకువెళ్తుంది.. ఎట్లయినా నన్ను మా అక్క దగ్గరకి చేర్చండి' అని కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు తిరుపతిలోని అలిపిరి సమీపంలో పేవ్‌మెంట్ మీద ఎముకల పోగులా పడి ఉన్న 60 ఏళ్ల వ్యక్తి. నెలన్నరగా అతను ఎండకీ, వానకీ అక్కడే పడిఉన్నాడు. అలిపిరిలో అనాథలకు సేవ చేసే సుజాత అతని పరిస్థితి చూసి రోజూ అన్నం పెడుతున్నారు. అన్నీ ఒంట్లోనే పోతుండడంతో తన కుమారుడి సాయంతో ఆమె శుభ్రం చేస్తోంది. వారి సపర్యలతో కాస్త కోలుకున్న తర్వాత ఆ వ్యక్తి తన వివరాలు చెబుతున్నాడు. తన పేరు కోరుమెల్లి వెంకట్రావు అని, తానొక హార్డ్‌వేర్ ఇంజనీరునని, విశాఖపట్నంలో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేశానని చెప్పాడు. భార్యా పిల్లలు లేరని, నెల్లిమర్లలో తన అక్క అరుణ పాటక్ ఉంటుందని చెబుతున్నాడు. తిరుమలకు దర్శనం కోసం ఒక్కడినే వచ్చానని.. అన్నదాన సత్రం దగ్గర హఠాత్తుగా కళ్లు తిరిగి పడిపోయానని తెలిపాడు. అంబులెన్సులో తిరుపతి రుయా ఆసుపత్రికి పంపారని, తన వివరాలు చెప్పలేకపోవడంతో రెండ్రోజుల తర్వాత బయటకు పంపేశారన్నాడు. కదల్లేని స్థితిలో ఉన్న ఆయన్ను కుటుంబ సభ్యులెవరైనా గుర్తించి తీసుకువెళ్లాలని ఆయనకు సేవ చేస్తున్న సుజాత కోరుతున్నారు.

## నేను చేసిన నృత్యాల్లో వెకిలి చేష్టలు లేవు: వినీలరావు

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి ఆలయం ముందు నేను చేసిన నృత్యాల్లో ఎటువంటి వెకిలి చేష్టలుగానీ, అసభ్యతగానీ లేదు' అని హైదరాబాద్‌కు చెందిన నృత్య కళాకారిణి డాక్టర్ వినీలరావు స్పష్టం చేశారు. ఈమేరకు ఆమె వీడియో విడుదల చేశారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా రీల్స్ చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ జూలై 31న టీటీడీ విడుదల చేసిన ప్రకటన వార్తతో పాటు ఆగస్టు 1న 'ఆంధ్రజ్యోతి'లో తన ఫొటో ప్రచురించడంపై ఆమె స్పందించారు. టీటీడీ నియమాలను తాను ఉల్లంఘించబోనని పేర్కొన్నారు.

## నాటు తుపాకితో ప్రియురాలు, ఆమె భర్తపై కాల్పులు

- ఆస్పత్రికి తరలింపు.. పరారైన ప్రియుడు

శంఖవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం శృంగధారలో ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి ఇద్దరిని నాటు తుపాకితో కాల్చి పరారయ్యాడు. అన్నవరం పోలీసుల కథనం మేరకు.. కాకినాడ జిల్లా పెద మల్లాపురం పంచాయతీ పరిధి శృంగధారకు చెందిన కాకురు చంద్రరావుకు, అదే గ్రామానికి చెందిన కుమారికి ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. వారికి ముగ్గురు పిల్లలు. అయితే కుమారికి అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలం వంతంగి గ్రామానికి చెందిన సరమండ మణికుమార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొంతకాలం వారిద్దరూ సహజీవనం కూడా చేశారు. ఈ క్రమంలో 4 రోజుల క్రితం తనకు పిల్లలు, భర్త కావాలనుకుని కుమారి ప్రియుడిని వదిలి శృంగధార వచ్చేసింది. తనతో మూడేళ్లు సహజీవనం చేసి వదిలేసిందనే కోపంతో మణికుమార్ ఆదివారం అర్ధరాత్రి నాటు తుపాకితో కుమారి, ఆమె భర్త చంద్రరావుపై కాల్పులు జరిపాడు. దీంతో వారికి గాయాలయ్యాయి. తుపాకి శబ్దంతో ఉలిక్కిపడ్డ గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే మణికుమార్ పరారయ్యాడు. క్షతగాత్రులను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

## ఇజ్రాయెల్‌లో యుద్ధ వ్యతిరేకత!

హమాస్‌తో తమదేశం చేస్తున్న యుద్ధం నిలిచిపోవాలని ఇజ్రాయెల్‌కు చెందిన ఆరువందలమంది రిటైర్డ్ సీనియర్ భద్రతాధికారులు, సైనికాధికారులు కోరుకున్నారట. యుద్ధం ఆపేయమని మా బెంజమిన్ నెతన్యాహూకు చెప్పండి అంటూ అమెరికా అధ్యక్షుడికి 550 మంది మాజీ ఉన్నతాధికారులు ఓ లేఖ రాశారు. మాజీ ప్రధాని ఇహూద్ బరాక్, మాజీ సైన్యాధ్యక్షులు, మొసాద్ మాజీ అధినేతలు, రక్షణ మంత్రులు, పోలీస్ చీఫ్‌లు కలిసి విడుదల చేసిన వీడియో కూడా ఒకటి మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్నది. హమాస్ ఇక ఎంతమాత్రం ఇజ్రాయెల్ ఉనికికి ప్రమాదకరం కాదని, యుద్ధం కొనసాగించడం ద్వారా ఇజ్రాయెల్ తన గౌరవాన్ని కోల్పోతున్నదని వీరి వాదన. 23 నెలలుగా జరుగుతున్న యుద్ధం ఆగనిపక్షంలో దేశభద్రతకు మంచిదికాదని వారు అభిప్రాయపడుతున్నారు. మొసాద్ మాజీ అధినేత ఒకరు మనం ఓటమి అంచున ఉన్నామని కూడా వ్యాఖ్యానించారు.

ప్రపంచం మనల్ని తప్పుపడుతోంది, మన పాపాలను గమనిస్తోంది అంటూ గాజా మృత్యుఘోషపట్ల వీరు సానుభూతి వెలిబుచ్చారు. యుద్ధం ఎందుకు ఆరంభమైందో, ఆ లక్ష్యం పరిపూర్ణమైందని, ఇంకా ఎందుకు కొనసాగుతోందన్నది అర్థంలేని, అర్థంకాని అంశమని వారంటున్నారు. తన పదవిని కాపాడుకోవడానికి, తనమీద ఉన్న కేసులను కదలకుండా చేయడానికీ నెతన్యాహూ యుద్ధం కొనసాగిస్తున్నాడన్న విమర్శ ఎంతోకాలంగా ఉన్నదే. ఇప్పుడు వీరి వీడియోలు, లేఖలు మరింత ఒత్తిడిపెంచేందుకు ఉపకరిస్తాయి. సుదీర్ఘయుద్ధంతో ఐడీఎఫ్ బలగాలు నిరాశానిస్పృహల్లోకి జారిపోయాయని, విసుగుచెంది, డస్సిపోయి ఉన్న బలగాలు కూడా యుద్ధం ఆగిపోవాలని ఆకాంక్షిస్తున్నాయని వార్తలు వస్తున్నాయి.

హమాస్ దగ్గర బందీలుగా ఉన్న తమవారు ఎంతటి ఘోరమైన స్థితిలో ఉన్నారో ఇటీవలి వీడియోల్లో ఇజ్రాయెలీలు చూశారు. హమాస్‌ను దుంపనాశనం చేయడం, బందీలను విడిపించడం లక్ష్యంగా యుద్ధం కొనసాగిస్తున్నట్టు నెతన్యాహూ చెప్పుకుంటారు. కానీ, హమాస్ తీవ్రంగా దెబ్బతిన్నదేకానీ, తుడిచిపెట్టేయడం మాత్రం నెతన్యాహూ తరంకాలేదు. తన వద్ద ఉన్న బందీల్లో కొందరిని హమాస్ తనకుతానుగా అప్పగించడం వినా, ఇజ్రాయెల్ వారిని విడిపించిందేమీ లేదు. ఈ నేపథ్యంలో, అత్యంత దుర్భరమైన పరిస్థితుల మధ్య ఎముకలగూళ్ళుగా మారిన శరీరాలతో ఇజ్రాయెలీ బందీలున్న వీడియోలు, చిత్రాలు వెలుగుచూసి నెతన్యాహూను ఆత్మరక్షణలో పడేశాయి. తమవారిని హమాస్‌కు బలిపెడుతున్నాడన్న బంధుజనం విమర్శలు తీవ్రమైనాయి. తక్షణమే యుద్ధాన్ని ఆపివేసి, బందీలను విడిపించి తేవాలంటూ పలుచోట్ల ప్రదర్శనలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలోనే, అమెరికా అధ్యక్షుడికి లేఖలు, నెతన్యాహూ మీద విమర్శలు తిరిగి మొదలైనాయి.

గాజాలో సాగుతున్నది నరమేధం కాదంటున్నారు ట్రంప్. కాల్పుల విరమణ పకడ్బందీగా అమలు జరుగుతూ, బందీల అప్పగింతల ప్రక్రియ సాఫీగా సాగుతున్నదశలో, గాజాను ఒక అద్భుతమైన రిసార్టుగా మార్చేయాలన్న ట్రంప్ కలనెరవేర్చడంకోసం నెతన్యాహూ తిరిగి ఊచకోత ఆరంభించిన విషయం తెలిసిందే. చివరకు ఆకలిని కూడా ఆయుధంగా వాడి ఒక్కప్రాణికూడా అక్కడ ఉండకూడదన్న లక్ష్యంతో ఇద్దరూ పనిచేస్తున్నారు. పసికందులనుంచి వృద్ధులవరకూ అందరినీ ఆకలి మింగేస్తున్నది. అన్నంకోసం నిలబడినవారు క్యూలైన్లలోనే కన్నుమూస్తున్నారు. ఆహారంకోసం ఎదురుచూస్తున్నవారినీ, ఎగబడినవారినీ ఇజ్రాయెల్ నిర్దాక్షిణ్యంగా చంపుతోంది. ఆహారపంపిణీ కేంద్రాల వద్ద తొక్కిసలాటలు, కాల్పుల్లో వందలాదిమంది మరణిస్తున్నారు. ఒకపక్క ఆకలిచావులు, మరోవైపు బందీల విడుదల ఇజ్రాయెల్ మీద తీవ్రమైన ఒత్తిడిపెంచుతున్నాయి. హమాస్ వద్ద ఇంకా మిగిలివున్న యాభైమందిలో 20మంది సజీవంగా ఉండివుంటారని అంచనా. ఈ నేపథ్యంలో, ట్రంప్ ప్రతిపాదించిన 60 రోజుల కాల్పుల విరమణ, ఆయుధాల అప్పగింత, బందీల విడుదల ఇత్యాది అంశాలను హమాస్ పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఇజ్రాయెల్ సైన్యాలు వెనక్కుపోవడం నుంచి పాలస్తీనా రాజ్యం స్థాపన వరకూ అది చాలా డిమాండ్లు ముందుకు తెస్తోంది. ఒప్పందానికి సిద్ధమని అంటూనే ఇరుపక్షాలూ రాజీపడకపోవడంతో చర్చలు కదలడం లేదు. ఈ ప్రతిష్ఠంభన తొలగనంతవరకూ గాజాలో కరువు, ఆకలిచావులకు ముగింపు ఉండదు.

# 'గేమ్ చేంజర్స్'గా స్థానిక ప్రభుత్వాలు!

స్థానిక సంస్థలు స్వశక్తితో పైకి ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి మూడు అంశాలు కీలకం. ఒకటి ఫైనాన్సెస్ (నిధులు), రెండు ఫంక్షన్స్ (విధులు), మూడు ఫంక్షనరీస్ (ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు). ఈ మూడు సమకూరడానికి, సవ్యంగా ముందుకు సాగడం కోసమే చరిత్రాత్మకంగా పేర్కొనే 73, 74 రాజ్యాంగ సవరణలు జరిగాయి. ఇవి జరిగాక, స్థానిక సంస్థల పనితీరు కొంతమేర మెరుగైన మాట నిజం. కానీ ఆశించిన ప్రయోజనాలు ఒనగూడినట్లేనా అన్నది చర్చనీయాంశం.

ముందుగా స్థానిక సంస్థలకు అందుతున్న నిధులు, సొంతంగా అవి ఆర్జిస్తున్న ఆదాయం గురించి మాట్లాడుకోవాలి. మన రాజ్యాంగంలోని 243(జి) అధికరణ ప్రకారం స్థానిక సంస్థలకు మూడు మార్గాలలో నిధులు సమకూరుతాయి. కేంద్ర ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వాటికి నిధులు అందుతాయి. ఇవికాక సొంతంగా అవి ఆదాయం ఆర్జించాలి. 15వ కేంద్ర ఆర్థిక సంఘం 2021–2026 మధ్య కాలానికి స్థానిక సంస్థలకు రూ.4.36 లక్షల కోట్లు కేటాయించింది. దీనికి అదనంగా ఆయా రాష్ట్రాల ఆర్థిక సంఘాల సిఫార్సుల మేరకు ఆ రాష్ట్రాల పరిధిలో ఉన్న స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు అందుతున్నాయి. ఇక వాటి సొంత ఆదాయాన్ని పరిశీలిస్తే, ఇటీవల రిజర్వు బ్యాంకు నివేదిక ప్రకారం దేశంలోని స్థానిక సంస్థలు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)కి 60శాతం మేర సమకూరుస్తుండగా, అవి సొంతంగా ఆర్జిస్తున్న ఆదాయం జీడీపీలో కేవలం 0.6శాతం మాత్రమే ఉంది. అది కూడా దేశంలోని పెద్ద నగరాలు ఆర్జిస్తున్న ఆదాయం కారణంగానే. దేశంలోని అత్యధిక మున్సిపాలిటీలలో సిబ్బందికి సకాలంలో జీతాలు అందడం లేదు. ఇక వేలాది గ్రామాల్లో బ్లీచింగ్ పౌడరు కొనడానికి కూడా నిధులు లేవు.

స్థానిక సంస్థలు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నాయా? అని పరిశీలిస్తే– స్థానిక స్వపరిపాలనలో కీలకమైన ప్రణాళిక, అభివృద్ధి, కార్యనిర్వహణలకు సంబంధించి పనులు చేపట్టడంలో ఈ సంస్థలు చాలా వరకు విఫలం చెందాయి. కారణం రాష్ట్ర ప్రభుత్వాల వైఖరే. ఎందుకంటే, రాజ్యాంగం 11వ షెడ్యూల్‌లో పొందుపర్చిన 29 అంశాలను పలు రాష్ట్రాలు ఇప్పటి వరకు పూర్తిగా స్థానిక సంస్థలకు బదలాయించలేదు. రాజ్యాంగబద్ధంగా అందవలసిన నిధులు, విధులకు సంబంధించి దేశవ్యాప్తంగా ఆ సంస్థలు అనేక ఉద్యమాలు చేశాయి. ఇప్పటికీ చేస్తున్నాయి కూడా. ఆందోళనలు ఉధృతమైనప్పుడు తాత్కాలిక ఉపశమన చర్యలు తీసుకుంటున్నారే తప్ప, పూర్తి స్థాయిలో 29 అంశాలను బదలాయించి స్థానిక సంస్థలను 'ఎంపవర్' చేయడం లేదు. ఎవరు అధికారంలో ఉన్నా జరుగుతున్న తంతు మాత్రం ఇదే. కేంద్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధి ప్రణాళికలలో భాగంగా 'స్మార్ట్ సిటీస్ మిషన్' అనే పథకం చేపట్టి రూ.2.05 లక్షల కోట్లతో 100 నగరాల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. 74వ రాజ్యాంగ సవరణ ప్రకారం, 2011 జనాభా లెక్కల ఆధారంగా లక్ష జనాభా దాటిన ప్రాంతాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా గుర్తించాలి. ఆ లెక్కన దేశంలో 269 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. ప్రస్తుత జనాభాను పరిగణనలోకి తీసుకుంటే అవి 600 పైగానే ఉన్నాయి. అంటే మొత్తం నగరాలలో ఆరోవంతు నగరాలలోనే 'స్మార్ట్ సిటీస్' మిషన్ పథకం అమలవుతోంది. మరి మిగతా నగరాల పరిస్థితి ఏమిటి?




> స్థానిక స్వయంపాలన బలోపేతం అయితేనే, పట్టణ–గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి సాధిస్తాయి. అయితే స్వయంపాలనలో ఆ సంస్థల సొంత నిర్ణయాలు ఉండాలి. 2047 నాటికి ప్రధాని మోదీ చెబుతున్న 'వికసిత భారత్' రావాలన్నా, ఆ సమయానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్నట్లు వికసిత ఆంధ్రా సిద్ధించాలన్నా.. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి సాధికారతతో పనిచేయగలగాలి.

దేశంలో పట్టణీకరణ విపరీతంగా పెరిగిపోయాక– నగరాలలో, పట్టణాలలో మురికివాడలు పెరిగిపోయాయి. అడ్డదిడ్డంగా ఆక్రమణలు విస్తరించాయి. తాజా లెక్కల ప్రకారం పట్టణ జనాభాలో 17శాతం మంది మురికివాడలలో నివసిస్తున్నారు. అక్కడ ఉండేవారికి మౌలిక సదుపాయాలు సమకూర్చడం కార్పొరేషన్లకు తలకు మించిన భారమైంది. ఇక ఆక్రమణల విషయానికి వస్తే దేశంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, కలకత్తా, బెంగళూరు, చెన్నై మొదలుకొని దాదాపుగా అన్ని నగరాలు ఈ సమస్యతో సతమతమవుతున్నాయి. గత ఏడాది బెంగళూరులో కురిసిన వానలకు నీరు నిలిచిపోయి నగరం పూర్తిగా మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆక్రమణల తొలగింపులో ప్రభుత్వాల ఉదాసీనత, ప్రజల పాలిట శాపంగా మారింది. హైదరాబాదులో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'హైడ్రా' లాంటి వ్యవస్థను ఇప్పుడు దేశంలోని అన్ని నగరాలలో చేపట్టాలన్న డిమాండ్ పెరుగుతోంది. ప్రధాన నగరాలలో ఆక్రమణలు తొలగించి మురుగు నీరు, వాననీరు పోయేందుకు, డ్రైయిన్లు పూడిక తీయించేందుకు కూడా స్థానిక రాజకీయాల కారణంగా ప్రభుత్వాలు వెనుకాడుతున్నాయి.

ఇక స్థానిక సంస్థల అభివృద్ధిలో 3వ కీలక అంశం... ఫంక్షనరీస్ (ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు) విషయానికి వస్తే– పరిపాలనా సంబంధిత విధాన నిర్ణయాలు తీసుకొనే ప్రజాప్రతినిధుల మధ్య ఇటీవల కాలంలో రాజకీయంగా ఏకాభిప్రాయం లోపిస్తోందని, ఫలితంగా అభివృద్ధికి ఆటంకం కలుగుతున్నదని పలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. దేశంలో కేరళ రాష్ట్రం త్రికరణ శుద్ధిగా 73, 74 రాజ్యాంగ సవరణల స్ఫూర్తిని ఆచరణలో చూపిస్తున్నది. అక్కడి గ్రామ సచివాలయ వ్యవస్థ రాష్ట్ర సచివాలయ వ్యవస్థకు నమూనాగా నిలుస్తోంది. అదే విధంగా రాజ్యాంగబద్ధంగా బదిలీ కావలసిన 29 అంశాలను సంపూర్ణంగా స్థానిక ప్రభుత్వాలకు బదిలీ చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దేశ వ్యాప్తంగా 300 కోట్లకు పైగా పనిదినాలు చేపట్టగా, కేరళలో కేటాయించిన పని దినాల్లో 90 శాతం మేర ఉపయోగించుకోగలిగారు. అయితే, ఈ పథకం కింద ఉపాధి కూలీలకు పని కల్పించడంలో దేశ సగటు 55 శాతం మాత్రమే కావడం గమనార్హం. స్థానిక ప్రభుత్వాల్లో ప్రధాన సమస్యగా మారిన అవినీతిని నిరోధించడానికి, విచారించడానికి కేరళ ప్రభుత్వం 'అంబుడ్స్‌మన్' వ్యవస్థను ఏర్పాటు చేసింది. కేరళ తర్వాత పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో కూడా స్థానిక స్వయంపాలిత ప్రభుత్వాలు సమర్థంగా, ఆదర్శంగా పనిచేస్తున్నాయి. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు... ప్రజల భాగస్వామ్యంతో సేవలందించేవారుగా, సంక్షేమ ప్రతినిధులుగా, క్రమబద్ధీకరించేవారుగా, సహాయకారులుగా తమ బాధ్యతలను నిర్వహించడం వల్ల ఫలితాలు అందుతున్నట్లు అక్కడి ప్రభుత్వాలు పేర్కొంటున్నాయి.

స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలలో సామాజిక న్యాయం పాటించడం వల్ల పరిస్థితులు మెరుగయ్యే అవకాశం ఉన్నదా? అనేది పరిశీలనాంశం. ఇప్పటికే దేశంలోని అనేక రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థలలో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాయి. పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రస్తుతం మహిళల సగటు ప్రాతినిధ్యం 48శాతానికి పెరగడం గొప్ప ముందడుగు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదన్న నిబంధన ఉన్నా, కొన్ని రాష్ట్రాలు బీసీలకు 50 శాతం మించి రిజర్వేషన్లు అందిస్తున్నాయి. తాజాగా తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీచేసింది. తెలంగాణ రిజర్వేషన్ల మోడల్ విజయవంతమైతే, చాలా రాష్ట్రాలు అదే దారిలో పయనించే అవకాశం ఉంది.

స్థానిక సంస్థల రిజర్వేషన్ల పెంపుదలకు, వాటి అభివృద్ధికి సంబంధం ఉంటుందా? అన్న అంశాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలి. అయితే, రిజర్వేషన్ల పెంపుదల వల్ల కచ్చితంగా గ్రామీణ ప్రాంతాలలో సామాజిక నాయకత్వం బలపడుతుంది. స్థానిక సంస్థలు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే కార్యక్రమాల్లో ఇంతకుముందు కంటే ఎక్కువ మంది పాల్గొనే అవకాశం ఉంది. మహిళల భాగస్వామ్యం పెరిగాక స్థానిక సంస్థల పనితీరు మెరుగైంది. స్థానిక స్వయం పాలన బలోపేతం అయితేనే, పట్టణ–గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి సాధిస్తాయి. అయితే స్వయంపాలనలో సొంత నిర్ణయాలు ఉండాలి. స్థానిక సంస్థల ఆధ్వర్యంలో పనిచేసే వివిధ కమిటీలకు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగాలి. స్థానిక సంస్థల పరిధిలోని మట్టి, ఇసుక, గనులు వంటి సహజ వనరులపై వచ్చే ఆదాయం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్ళకుండా చూడాలి. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఉండే మురికివాడలను అభివృద్ధి చేసుకోవాలి. యుద్ధ ప్రాతిపదికన ఆక్రమణలను తొలగించాలి.

రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గని తెలంగాణ 'హైడ్రా' తరహా వ్యవస్థను అన్ని రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలి. 2047 నాటికి ప్రధాని మోదీ చెబుతున్న 'వికసిత భారత్' రావాలన్నా, ఆ సమయానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెబుతున్నట్లు వికసిత ఆంధ్రా సిద్ధించాలన్నా.. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో స్థానిక ప్రభుత్వాలు పూర్తి సాధికారతతో పనిచేయగలగాలి. అప్పుడే దేశాభివృద్ధిలో అవి 'గేమ్ చేంజర్స్' అవుతాయి.

• సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు

## వినమ్ర వ్యక్తిత్వం స్వేచ్ఛా కళాతత్త్వం

మాదిరాజు రంగారావు గారు తెలుగులో, సంస్కృతంలో గొప్ప పండితులు, కవితారాధకులు, కవి, సాహిత్య విమర్శకులు. పిన్న వయస్సులోనే డాక్టరేట్ తీసుకున్న ప్రజ్ఞాశాలి. అధ్యాపక వృత్తిలో వారు అధిరోహించని ఉన్నత శిఖరాలు లేవు. సీనియర్ ప్రొఫెసర్‌గా, డీన్‌గా ప్రసిద్ధులు. మృదుస్వభావి, వినయశీలి, పూర్వభాషి, బహుగ్రంథకర్త.

"Fame is the last infirmity of a noble mind," అన్నారు సుప్రసిద్ధ ఆంగ్లకవి మిల్టన్. రంగారావు గారి విషయంలో ఇది ప్రత్యక్షర సత్యం. నిజాయితీతో ఇచ్చే కాంప్లిమెంట్‌ను కూడా పట్టించుకోని వినయ భూషణులు ఆయన. మెచ్చుకోబోతే దారి మళ్ళిస్తారు! లైమ్‌లైట్‌లో ఉండడానికి ఏ మాత్రం ఇష్టపడని పెద్ద మనిషి.

కొన్ని రోజులు విశ్వనాథవారి ఇంట్లో ఉండి శిష్యుడిగా కవితా కళ రహస్యాలను ఆకళింపు చేసుకున్న భాగ్యశాలి మాదిరాజు రంగారావు. అయినా తన గ్రంథాన్నొక దాన్ని శ్రీశ్రీకి అంకితమిచ్చిన సమ్యక్‌దృష్టి కలిగినవారు. తన పని తాను చేసుకుంటూ పోయినవారు, రాసుకుంటూ పోయినవారు.. తపస్సు చేసుకుంటూ పోయినట్లు. అది ఆయన మనోధర్మం. లోకం పొగడుతుందో, తెగుడుతుందో పట్టించుకోని వైరాగ్యం కలిగిన మనిషి.


మాదిరాజు రంగారావు గారి ప్రతి పంక్తీ ఏదో ఒక విషయ నిర్వచనమే. ప్రతి పంక్తీ అందమైన నిర్వచన క్లుప్తతతో, ఆలోచనాంశాలతో మన మేధస్సును, హృదయాన్ని ఆకట్టుకునేదే. ఆయన పదాలలోని శబ్దం, అర్థం భవిష్యవాణిలా ప్రతిధ్వనిస్తుంది.

సాహిత్యం సమాజ హితం కోరేదై వుండాలన్నది రంగారావు నిశ్చితాభిప్రాయం. ఛందోబద్ధమైన పద్యం, గేయం ఉండనే ఉన్నవి. వాటి పట్ల వారికి గౌరవమూ ఉన్నది. కానీ వారు అభిమానించే కవితారూపం "స్వేచ్ఛా కవిత్వం". వచన కవిత్వమని బహుళ ప్రచారంలో ఉన్న దానిని వారు స్వేచ్ఛా కవిత్వమని సంభావిస్తారు. ప్రజాస్వామ్య సామ్యవాద యుగంలో ఉన్న మనకు తగినది ఈ స్వేచ్ఛా కవిత్వమేనని వారు గాఢంగా విశ్వసిస్తారు. కొన్ని పదుల సంవత్సరాల నుంచి నెలకు ఒక స్వేచ్ఛా కవిత్వ గ్రంథాన్ని రాస్తున్నారు, ప్రచురిస్తున్నారు. నన్ను అభిమానించి నాకు పంపుతున్నారు.

స్వేచ్ఛా కవిత్వాన్ని గురించి ఆయన ఇలా అంటారు: "ఎందరు కవులు వచ్చినా ఇంకా మరొకరికి చోటు లభిస్తూనే వుంటుంది. ఇదీ దీని మహనీయత." అంటే పుష్పక విమానం లాగ అన్నమాట. ఇంకా అంటారు– "జీవనయాన కవిత్వంలో ఒక పొర (లేయర్) భావమయం, ఊహానవం, కొంత కల్పన ఎక్కువగా యాదార్థ్యంతో కూడినది. రెండో పొర అనుభవ సుందరమైంది. అనుభవ స్పందనలతో ఆవిష్కృతమైంది. మూడోది దార్శనికత చేత ఆయువుపట్టుగా ఏర్పడింది. చివరిది నాల్గవది దివ్యత, భవ్యత చేత కళాత్మకతను కలిగింది." ఇలా కవిత్వతత్త్వాన్ని సిద్ధాంతీకరించగలిగిన గొప్ప మేధావి, విమర్శకులు రంగారావు. పగలనక, రాత్రనక వెల్లివిరిసే ప్రకృతి సౌందర్యాన్ని ఎంత చక్కగా కవిత్వీకరించారో చూడండి: "రాత్రి అయితే పదహారు చంద్రకళలు/ పగలయితేనో శతసహస్ర కిరణ పంక్తులు" – జీవన సౌందర్యాన్ని వారు ఆవిష్కరించే తీరే వేరు..

"ఆకుపచ్చని భాగ్యం సమృద్ధికి సంకేతం/ ఎరుపురంగు పరివర్తన తైజస చిహ్నం/ వివిధ వర్ణసమాహితం ఈ అనుభవం."

రంగారావు గారు John Donne వలె మెటాఫిజికల్ పొయెట్. జీవన సత్యాలను, లక్షణాలను సిద్ధాంతీకరిస్తున్నట్లు ఆయన కవిత సాగుతుంది.

"ఈ చరిత్ర నిర్మాణంలో మనిషిది ప్రధాన భాగస్వామ్యం/ భాగ్యస్థితకు సమాజ పరిణామంలో స్థాయి బహు ముఖ్యం".

వీటిని అర్థం చేసుకొని ఆనందించడానికి ఎంతటి పరిణతి కావాలి? అంచేతే నేను దీనిని 'మెటాఫిజికల్ పొయెట్రీ' అంటున్నాను. కవితలనిండా కాన్‌సెప్ట్స్. ఇన్సిడెంట్స్ తక్కువ. వాటిని అందంగా చెప్పడం వారి ప్రత్యేకత.

అక్కడక్కడ sensuous beautyని అందించే కవితలు కూడా చక్కగా రాస్తారు. "మనసులో బాధ, కనులలో నీరు/ తూకంలో దేని బరువు దానిదే" – జీవితాన్ని వీడని దుఃఖాన్ని ఎంత మన హృదయాలు ఆర్ద్రమయేట్లు చెప్పినారు! గుండెల్ని పిండే జీవన సత్యమిది.

మాదిరాజు రంగారావు గారి ప్రతి పంక్తీ ఏదో ఒక విషయ నిర్వచనమే. ప్రతి పంక్తీ అందమైన నిర్వచన క్లుప్తతతో, ఆలోచనాంశాలతో మన మేధస్సును, హృదయాన్ని ఆకట్టుకునేదే. ఆయన పదాలలోని శబ్దం, అర్థం భవిష్యవాణిలా ప్రతిధ్వనిస్తుంది. ఈ క్రింది పంక్తుల్లోని ప్రాఫెటింగ్ రింగ్ విందాం: "రవి చండతను వానను అదుపులో పెట్టేను మనిషి/ కవితకు నవత ప్రతీకమై కళాకృతి నిచ్చేను"/ "రాజకీయ క్రియాచరణపర్వంలో/ కలహ సమర చర్యలతో రోబోట్ ప్రవేశం" అయినా/ "ఇది నవయుగాలోకనం, సృజన జగం/ అక్షరతేజంతో వెలిగేను నవభవం./ ఆశారేఖలు శుభనవ యుగారంభానికి/ సూచికలై ఫలిస్తాయి".

రంగారావుగారు మంచి విమర్శకులు. సాహిత్య విమర్శను బయోగ్రాఫికల్, హిస్టారికల్ పరిశీలనకు పరిమితం చేయకుండా సూత్రబద్ధమైన సిద్ధాంతచర్చ చేయగలరు. మూలాలకు వెళ్లి విషయస్థితిని సిద్ధాంతీకరించగలరు. అది నిజమైన విమర్శ. దీనికి సునిశితమైన మేధస్సు కావాలి. కవితా రచనకు సౌందర్య విలసితమైన సృజనాత్మకశక్తిలాగా. ఈ రెండూ రావుగారికున్నవి.

కొద్దిరోజుల క్రితం వెల్చాల కొండలరావు నిర్వహించిన రంగారావుగారి సంస్మరణ సభలో వారి పిల్లలను చూశాను. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. అందరూ నాన్నగారి వినయాన్ని పుణికిపుచ్చుకున్నవారు, విద్యాధికులు. నాన్నగారి స్మృత్యర్థం ప్రతి ఏటా తెలుగు, సంస్కృతంలో విశిష్ట సేవలందించిన వారికి పెద్ద మొత్తంలో అవార్డులను కొండలరావుగారి విశ్వనాథ సాహిత్యపీఠం నిర్వహణ క్రింద ట్రస్టును ఏర్పాటు చేసి అందిస్తామని రంగారావుగారి పిల్లలు ఆ సమావేశంలో ప్రకటించారు. అంతటి తండ్రికి వారు పిల్లలవడం వారి అదృష్టం. అంతటి మంచి పిల్లలు కలగడం రంగారావుగారి అదృష్టం.

○ చేపూరు సుబ్బారావు

## అమృత కాలానికి అమెరికా అడ్డంకి!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ వాణిజ్యంపై విరుచుకుపడ్డారు. భారత్ నుంచి తమకు వస్తున్న దిగుమతులపై ఇరవై ఐదు శాతం పన్ను విధించడంతో బాటు అదనంగా పెనాల్టీ కూడా వేస్తానంటున్నారు. అది కూడా తక్షణమే అమలులోకి తీసుకువచ్చారు. అమెరికా ప్రయోజనాలకు, ఆకాంక్షలకు వ్యతిరేకంగా రష్యా, ఇరాన్‌లతో భారత్ వాణిజ్య సంబంధాలు కొనసాగించడం ఈ నిర్ణయాలకు కారణాలుగా చెప్తున్నా, అంతకు మించిన కడుపు మంట, కంటగింపు ఉన్నట్టున్నాయి. అందుకనే పన్నులు పెంచడంతో బాటు మన దేశ ఆర్థిక వ్యవస్థని ప్రాణం లేనిదిగా అభివర్ణించారు. ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్న పెద్ద ఆర్థిక వ్యవస్థ, జీడీపీ వృద్ధి ఆరు శాతం పైగా కొనసాగుతున్న వేళ అలా అభివర్ణించడం పిచ్చితనమే. వీటి వెనుక అసలు కారణం భారత్ తన దేశ ప్రయోజనాల కోణంలో స్వతంత్రంగా వ్యవహరించడమే.

అమెరికా కోరుకున్నట్లు వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతులకు సుంకాలు తగ్గిస్తే, అవి వెల్లువెత్తి మన దేశవాళీ పంటలు, పాలు నష్టపోతాయి. రక్షణ కొరవడుతుంది. అక్కడ ఆ దేశం వాటికి భారీ రాయితీలు సమకూర్చి ప్రోత్సహించడం వల్ల, అంత చౌకగా ఇక్కడ రైతు పోటీకి నిలువలేడు. ఒకసారి వాళ్ల మార్కెట్ ఆక్రమించుకున్నాక, గుత్తాధిపత్యం సాధించి తర్వాత తన ప్రతాపం చూపిస్తారు. అప్పటికి ఇక్కడి స్వయం సమృద్ధి ధ్వంసం అవుతుంది. అందుకనే ఈ విషయంలో బేరసారాలకు తావుండకూడదు. ఇక అమెరికా రెండో అభ్యంతరం.. రష్యా నుంచి ఆయుధాలు, ఇంధనం కొనుగోలు చెయ్యడం. అది భారత్ ఇష్టం. పైగా ఒకప్పటి కన్నా ఇప్పుడు ఆ దేశం నుంచి కొనుగోళ్లు కూడా తగ్గాయి. పోనీ అమెరికా చెప్పినట్టు మన లాభం వదులుకొని అమెరికాతోనే అంటకాగితే ఫలితం ఏమైనా ఉందా? నాస్తి. అమెరికాలో భారతీయుల ఉద్యోగాలతో సహా అన్నింట్లో కోత. పక్కన శత్రువుగా తయారైన పాకిస్తాన్‌ని పెంచి పోషించడం, దాని భారత వ్యతిరేక విధానాన్ని సమర్థించడం.

ఏదేమైనా అమెరికా సుంకాలు, ఆంక్షలు భారత్‌ని కలవరపెట్టరాదు. మరింత బలం పొందడానికి, ప్రపంచ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకోడానికి కారణం కావాలి. ఈ మధ్య బ్రిటన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రీతిలో మిగతా దేశాలతో ప్రయత్నించాలి. దేశంలోని వనరుల్ని సద్వినియోగం చేసుకోవాలి. స్వతంత్ర భారతానికి అమృత కాలం అని భావిస్తున్న 2047 లోగా అభివృద్ధి యాత్రలో, రాగల అడ్డంకుల్ని ఊహించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ముఖ్యంగా అమెరికాతో వాణిజ్యంలో సమాన స్థాయిలో బేరసారాలు సాగించాలి. బెదిరింపులకు, వడ్డింపులకు సై అంటే సై అనాలి. ఎందుకంటే ట్రంప్‌దంతా మేకపోతు గాంభీర్యమే. చైనాని ఇలాగే బెదిరించి వెనక్కు తగ్గలేదా! ఈ విధంగా ముందుకు పోతే అమెరికా ఆర్థిక వ్యవస్థకూ నష్టమే కదా!

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

# కులం – అహంకారం – అవినీతి

కులం, అహంకారం, అవినీతి... మన ప్రజాస్వామ్య వ్యవస్థలను, సమాజాన్ని పట్టి పీడిస్తున్న జాడ్యాలు. కులం రెండు వైపులా పదును ఉన్న కత్తిగా మారింది. అధికారంతో కూడిన అహంకారం వ్యవస్థల విధ్వంసానికి దారితీస్తున్నది. ఇక స్వార్థం డబ్బు రూపంలో జడలు విప్పుతున్నది. సమాజ ధర్మాన్నే సవాలు చేస్తున్నది. తిమ్మిని బమ్మిని చేసే సాధనంగా, అన్యాయాన్ని న్యాయంగా, అధర్మాన్ని ధర్మంగా చిత్రించే స్థాయికి అది ఎదిగింది. ధనమూల మిదం జగత్ అన్న సామెతను పరిపూర్ణంగా నిజం చేస్తున్నది. వీటన్నిటికీ మూలాధారం రాజకీయం. మంచీ చెడును వేరు చేయలేనంతగా రూపు మార్చుకుంది నేటి రాజకీయం.

కులం గురించి అడగడాన్ని, మాట్లాడడాన్ని ఒకప్పుడు చిన్నతనంగా చూసేవారు. కుల నిర్మూలన ఉద్యమాలు కూడ ఆంధ్రలో ఒకప్పుడు బలంగానే ఉండేవి. అందుకోసం కులాంతర వివాహాలను కూడ నాస్తికులు, హేతువాదులు, కమ్యూనిస్టులు ప్రోత్సహించేవారు. కాని క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. కుల ప్రాతిపదికన ఎక్కడికక్కడ సంఘాలు ఏర్పడడం, రాజకీయ డిమాండ్లను తెరపైకి తేవడం మొదలయింది. సామాజిక న్యాయం ప్రధాన విధానంగా, నినాదంగా మారిపోయింది. వర్గం బదులు వర్ణం / కులం వెనుకబడిన తనానికి ప్రమాణం అయింది. కమ్యూనిస్టులలో కూడ క్రమంగా ఈ విషయంలో కొంత మార్పు వచ్చింది. కులానికి – అది ఏ కులమైనా – గౌరవం పెరిగిపోయింది. ఆత్మన్యూనత స్థాయి నుంచి ఆత్మగౌరవ స్థాయికి చేరుకుంది. ఒకప్పుడు పత్రికలలో కులం గురించి రాస్తే చిరాకుపడేవారు. ఒకవేళ రాయవలసి వచ్చినా 'సామాజిక వర్గం' అనే మాటను కులానికి ప్రత్యామ్నాయంగా, తప్పించుకునే ఉపాయంగా వాడేవారు. కాని సమాజంలోను, రాజకీయాలలోను వచ్చిన మార్పులతో మీడియా కూడ ఇప్పుడు నేరుగా రంగంలోకి వచ్చేసింది. కులప్రాతిపదికన వివరాలు ఇవ్వడం, విశ్లేషణలు చేయడం ఎక్కువయింది. ఎవరయినా అదేమని ప్రశ్నిస్తే 'ఏమిటయ్యా ఎంతకాలం దాచిపెడతావు?' అని ఎదురు ప్రశ్నించే పరిస్థితి. ఆ విధంగా కులం వేసుకున్న ముసుగు తొలగిపోయింది. ఇంకా చెప్పాలంటే, కులాభిమానం ముదిరి పాకానపడి కులద్వేషంగా కూడ జడలు విప్పుతున్నది.

అధికారంలో ఉన్నవారికి అహంకారం కూడదంటారు. అదే పతనానికి దగ్గర దారి అని కూడా అంటారు. వ్యక్తులకే కాదు, మొత్తం సమాజానికి కూడా నష్టం జరుగుతుంది. కాని ఆచరణలో అహంకారం ఆవహించని ముఖ్యమంత్రులు తక్కువ. ఎంత ఎక్కువ అధికారం లభిస్తే, మరెంత ఎక్కువకాలం అధికారంలో కొనసాగితే అంత ఎక్కువగా అహంకారం ప్రదర్శించడం కద్దు! ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చెలాయించిన 16 మంది ముఖ్యమంత్రులలో ఎక్కువ భాగం ఎంతో కొంత ఈ ధోరణి ప్రదర్శించిన వారే! రెండవసారి ముఖ్యమంత్రి అయితే ఇక చెప్పనవసరం లేదు. అహంకారానికి తాము ఆమడదూరం అనుకునేవాళ్ళు, ఒకసారి ముఖ్యమంత్రి గద్దెనెక్కగానే, వారికి తెలియకుండానే అహంకారభూతం ఆవహిస్తుంది. జనానికి దూరం చేస్తుంది. ఇది అవరోహణకు నాంది.

అహంకారం తర్వాత ముఖ్యమంత్రులను, తద్వారా ప్రజాజీవితాన్ని భ్రష్టుపట్టించే మరో జాడ్యం డబ్బు పిచ్చి. అవినీతి అనే మాట దీనికి పర్యాయపదం. అధికారం అందించే అవకాశాలు అనేకం తన్నుకుంటూ వస్తాయి. ఒకసారి రుచి మరిగితే ఇక అంతే సంగతులు! అవినీతి విషయంలో మన ముఖ్యమంత్రులను అందరినీ ఒకే గాటన కట్టలేం! తొలితరం ముఖ్యమంత్రులది అదో తరహా! అవినీతి మకిలకు వీలయినంత దూరం! కాని మధ్యకాలం నాటికి మరికొంత మార్పు! చూసీచూడనట్టు నడిపించే మధ్యస్థ రకం. ఇక కొత్త మిలీనియం అయితే బిలియన్‌ల వ్యవహారంగా మారిపోయింది. ఎన్నికలలో వాడకం పెరిగేకొద్దీ, ఆర్జన కూడా అమాంతం పెరిగిపోయింది. అవసరాల హద్దులను కూడ దాటిపోయింది. కొందరికయితే ఆకాశమే హద్దు. వందల వేల కోట్ల మాటలు మూటలు – కాకపోతే కీర్తికాంక్ష ఉన్నవారు ఇందులో రవంత నయం. అభివృద్ధి – అవినీతి బొమ్మ బొరుసు కావడం ఈనాటి రాజకీయంలో ఒక విషాదపర్వం.

స్వాతంత్ర్యానంతర రాజకీయాలలో మత సమీకరణలు ప్రధానంగా ఉండేవి. హిందుత్వ పేరుతో బీజేపీ, సెక్యులరిజం పేరుతో కాంగ్రెస్ పని చేసేవి. ప్రయోజనం పొందేవి. ఇది దేశవ్యాప్త ధోరణి. ఇటీవలి కాలంలో ఇది బీజేపీకి అనుకూలంగా మారడంతో కాంగ్రెసు పార్టీ దానికి విరుగుడుగా కులం మంత్రాన్ని తెరపైకి తెచ్చింది. కులం ప్రాంతీయ రాజకీయ చదరంగంలో ఎప్పుడూ కదను తొక్కే అశ్వం లాంటిదే. కులం బలంతో ఏర్పడిన ప్రాంతీయ పార్టీలు కూడ చాలానే ఉన్నాయి. బలహీనవర్గాలు ఓకే. కానీ అగ్రకులాల చాటింపు కూడ ఇటీవల మరీ బహిరంగం అయిపోయింది.


> పాత్రికేయ ప్రముఖుడు ఇనగంటి వెంకట్రావు కొత్త పుస్తకం 'విలీనం–విభజన' స్వతంత్ర భారతదేశంలో తెలుగు ప్రజల రాజకీయ ప్రస్థానానికి అక్షర దర్పణం. ఆంధ్ర, తెలంగాణలు ఆంధ్రప్రదేశ్‌గా విలీనం కాక ముందు, సమైక్యమైన తరువాత, విడిపోయిన అనంతరం 22 మంది ముఖ్యమంత్రుల రాజకీయ వ్యక్తిత్వాలను ఆసక్తికరంగా వివరిస్తూ వారి పాలనా విజయాలు, వైఫల్యాలను విశ్లేషించిన పుస్తకమిది. ముఖ్యమంత్రులతో పాటు చరిత్ర నిర్మాతలైన పొట్టి శ్రీరాములు, ఆచార్య రంగా, పుచ్చలపల్లి సుందరయ్య, గౌతు లచ్చన్న తదితరులు, ఇంకా చిరంజీవి ప్రజారాజ్యం గురించి కూడా రచయిత రాశారు. గతాన్ని స్వగతంతో మేళవించి తేలికైన భాషలో వెంకట్రావు రాసిన ఈ పుస్తకం పాఠకుడిని ఏక బిగిన చదివిస్తుంది.




కాంగ్రెసు విధానాలకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెసు ప్రభుత్వం తెలంగాణలో కులగణన చేపట్టింది. దానినీ విపక్షాలు వివాదాస్పదం చేశాయి. అయితే కేంద్ర ప్రభుత్వం కూడ ఇటీవల కులగణనకు పచ్చజెండా ఊపింది. నిజానికి కులం విషయంలో ఉన్నంత భావోద్రేక అనుబంధం మతం విషయంలో ఉండదు. కులానికి పుట్టుకతోనే విడదీయరాని బంధం ఏర్పడుతుంది. (ఆంధ్ర రాష్ట్రంలో కులాన్ని బట్టి పార్టీ విధేయత యథాలాపంగా నిర్ణయమైపోతున్నది.) మతాన్ని మార్చుకోగలం కాని, కులాన్ని మార్చుకోలేం. కాని ఆచరణలో అలా లేదు. మతం మారిన కుటుంబాలు, తమతో పాటే కులాన్ని వెంట తీసుకువెడుతున్నాయి. ఆంధ్ర, రాయలసీమలలో కమ్మ, రెడ్డితో సహా అగ్రకులాలలో కూడ ఈ 'ద్వంద్వ పౌరసత్వం' బాగా కనబడుతుంది. వాళ్లంతా క్రిస్టియన్‌లకు క్రిస్టియన్‌లు, కులానికి తమ కులస్థులు. గుంటూరు మెట్ట ప్రాంతాలలో, ముఖ్యంగా పల్నాడులో ఈ పరిస్థితి కనిపిస్తుంది. మళ్లీ ఇస్లాంలోకి మారితే ఇది కుదరదు. ముస్లింలలో కులానికి తావు ఉండదు. అయితే ఇందులో కూడా బీసీ కులాలు / వర్గాలను గుర్తిస్తున్నారు. ఈ కులగణన లక్ష్యం మొత్తం – జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న డిమాండ్ నుంచి పుట్టుకువచ్చిందే!

*(ఇనగంటి వెంకట్రావు 'విలీనం–విభజన' గ్రంథంలోని భాగం ఇది.)*

*(నేడు ఉదయం 10 గంటలకు బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్, సురవరం ప్రతాపరెడ్డి హాలులో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు 'విలీనం–విభజన'ను ఆవిష్కరిస్తారు. తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహిస్తారు.)*



# భర్త వేధింపులు భరించలేక వధువు ఆత్మహత్య

## ఉయ్యూరులో విషాద ఘటన

- భర్త, అత్తమామలను వదలొద్దు
- లేఖ రాసి తనువుచాలించిన యువ అధ్యాపకురాలు



భర్త అరుణ్‌కుమార్‌తో శ్రీవిద్య(ఫైల్)

ఉయ్యూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోటి ఆశలతో మెట్టినింట అడుగు పెట్టిన వధువుకు అనుక్షణం అవమానాలే ఎదురయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగి అయిన భర్త విచక్షణ మరచి నువ్వు అందంగా లేవు, నాకు పరిచయం ఉన్న అమ్మాయి అందం ముందు నీవెందుకు పనికిరావు అంటూ కొట్టి దూషించడం, అడ్డు చెప్పాల్సిన అత్తామామ అతనికి అండగా నిలబడటం చూసి తట్టుకోలేకపోయింది. పెళ్లైన నాలుగు నెలలకే మెట్టినింటి వేధింపులు తాళలేక.. పుట్టింటికి వెళ్లలేక పదిమందికి మంచీచెడు చెప్పే యువ అధ్యాపకురాలు బలవన్మరణానికి పాల్పడింది. తన చావుకు కారణమైన వారిని వదలొద్దు అంటూ తల్లిదండ్రులకు లేఖ రాసింది. ఈ హృదయ విదారక ఘటన ఉయ్యూరులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... కలవపాముల గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్‌కు ఉయ్యూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన వర్రే శ్రీవిద్య (24)తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. ఎంఎస్సీ చదివిన శ్రీవిద్య స్థానిక శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తోంది. ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన చావుకు భర్త, అత్తమామలే కారణమని తన తల్లిదండ్రులు, తమ్ముడికి లేఖ రాసింది. భర్త మిగతా 6లో..



# అన్నదాత రుణ అవస్థలు!

ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రుణాలు అందక రైతులు అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 425 సంఘాలుంటే 117 సంఘాలకే ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. మిగిలిన చోట్ల పాలకవర్గాలు, త్రిసభ్య కమిటీలు లేక పర్సన్ ఇన్‌చార్జి(పీఐసీ)తో నడుస్తున్నాయి. ఆయా సంఘాల్లో రుణాల మంజూరులో జాప్యం జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అన్ని సంఘాలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## పాలకవర్గాలకు నోచుకోని పీఏసీఎస్‌లు

## ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం సంఘాలు 425

- 117 సంఘాలకే త్రిసభ్య కమిటీల నియామకం
- మిగిలిన చోట్ల పర్సన్ ఇన్‌చార్జులతో నెట్టుకొస్తున్న ప్రభుత్వం
- ఖరీఫ్ వేళ రుణాలు అందడంలేదని రైతుల ఆందోళన
- పూర్తిస్థాయిలో అన్ని సంఘాలకు త్రిసభ్య కమిటీలను వేయాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి-కంచికచర్ల): గ్రామాల్లో రైతులకు విరివిగా రుణాలు అందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు పాలకవర్గాలు లేవు. త్రిసభ్య కమిటీలతో సొసైటీలను పాలకులు నడిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిపైగా అయినప్పటికీ పీఏసీఎస్‌లకు మిగతా 6లో..




### సొసైటీలకు రాని పర్సన్ ఇన్‌చార్జులు

పీఐసీలుగా ఉన్న అధికారులు నిత్యం సొసైటీలకు రావటానికి వీలుపడటం లేదు. అధికారులు ఎక్కువగా విజయవాడ, ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఆయా సంఘాల కార్యదర్శులు, సిబ్బంది ఫైళ్లు తీసుకుని సంతకాల కోసం విజయవాడ వెళ్లాల్సి వస్తుంది. రోజూవారి విధులను పక్కన బెట్టి కార్యదర్శులు, సిబ్బంది విజయవాడ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అధిక వ్యవప్రయాసలకు గురికావల్సి వస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో రుణాలు సకాలంలో అందకపోవటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అదనులో రుణాలు లభిస్తే ప్రయోజనం ఉంటుందని రైతులు అంటున్నారు.



### ఆదర్శ నేత మండలి

6

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం జరిగిన దివిసీమ గాంధీ, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలకు హాజరై ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బొండా ఉమా, యార్లగడ్డ వెంకట్రావు, శ్రీరాం తాతయ్య తదితరులు

# పదేపదే ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!

## ట్రాఫిక్ ఉల్లంఘనులకు పోలీసుల ఝలక్

- ఎనిమిది మంది డీఎల్ రద్దుకు రవాణా శాఖకు సిఫార్సు
- భవిష్యత్తులో మరింతమంది లైసెన్స్‌లకు తప్పని ముప్పు

విజయవాడ నగరానికి చెందిన ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని లైసెన్స్ లేకపోయినా కుమారుడికి ఎక్కువగా ఇస్తున్నాడు. ట్రాఫిక్ పోలీసులు మూడు సార్లు ఈ వాహనంపై చలాన విధించారు. తండ్రిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా ఆ అబ్బాయి ద్విచక్ర వాహనంపై పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాడు. దీంతో తండ్రి లైసెన్స్‌ను రద్దు చేయాలని ట్రాఫిక్ పోలీసులు రవాణా శాఖ అధికారులకు ఇటీవల ప్రతిపాదనలు పంపారు. ఇలా పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఎనిమిది మంది డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దుకు సిఫార్సు చేశారు. ఈ సంఖ్య భవిష్యత్తులో మరింత పెరగనుంది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): విజయవాడలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి పోలీసులు విధిస్తున్న జరిమానాలను కొంతమంది వాహనదారులు తేలిగ్గా తీసుకుంటున్నారు. జరిమానాలు ఎన్నైనా చెల్లిస్తాం... ట్రాఫిక్ నిబంధనలను మాత్రం పాటించలేం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించి పోలీసులు నిత్యం నగరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. హెల్మెట్, డ్రంక్ అండ్ డ్రైవ్, రెడ్‌సిగ్నల్ జంపింగ్, డ్రైవింగ్ లేకుండా వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు. ఇది కాకుండా ధ్వని కాలుష్యానికి కారణమవుతున్న అధిక శబ్దం చేసే సైలెన్సర్లను అమర్చుకుంటున్న వాహనాలకు జరిమానాలు వేస్తున్నారు. అయినా తీరు మారకపోవడంతో డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతో సమాధానం చెప్పాలని ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించారు.



నిబంధనలు పాటించని వారికి చలానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

### వేలల్లో ఉల్లంఘనలు

విజయవాడ రహదారులపై మూడు రకాల ఉల్లంఘనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒక విధానం లేకుండా రహదారులపై వాహనాలను నడుపుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పక్క వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తూ వేగంగా ముందుకు దూసుకుపోతున్నారు. యువకులు స్నేక్ డ్రైవింగ్‌తో భయపెడుతున్నారు. వెనుక వైపు అమ్మాయిలు కూర్చుంటే మేఘాల్లో తేలుతున్నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఈ ర్యాష్ డ్రైవింగ్‌కు సంబంధించి ట్రాఫిక్ పోలీసులు ఈ ఏడాది ఇప్పటి వరకు 16,521 కేసులను నమోదు చేశారు. ఆ తర్వాత స్థానంలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకు 12,223 నో డీఎల్ కేసులు నమోదు చేశారు. మూడో స్థానంలో సైలెన్సర్ కేసులు ఉన్నాయి. షోరూంల నుంచి కొనుగోలు చేసిన వాహనాలకు తయారీలో అమర్చిన సైలెన్సర్లను పీకేస్తున్నారు. వాటి స్థానంలో అధిక శబ్దం చేసే సైలెన్సర్లను అమర్చుకుంటున్నారు. ప్రధాన ఈ అమరిక బుల్లెట్లకు జోరుగా సాగుతోంది. రహదారులపై ఎవరి మార్గంలో వారు వెళ్తున్నప్పుడు ఆకతాయిలు బుల్లెట్లపై వెళ్తూ పవర్ స్విచ్‌ను ఆఫ్‌చేసి ఆన్ చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా బాంబు పేలిన శబ్దం వస్తోంది. అప్పటి వరకు ఆదమరుపుగా ఉన్న పాదచారులు, వాహనదారులకు ఒక్కసారిగా గుండె జల్లుమంటోంది. ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో ఇటీవల డీజీపీ సమక్షంలో 500 బుల్లెట్లకు సంబంధించి సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఈ మూడు ఉల్లంఘనలతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పోలీసులకు కొంతమంది వాహనదారులు పదేపదే పట్టుబడుతున్నారు. జరిమానాలు చెల్లించేసి చేతులు దులుపుకుంటున్న ఉల్లంఘనులకు డ్రైవింగ్ లైసెన్స్ రద్దుతో గుణపాఠం చెప్పాలని ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఎనిమిది మంది వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేయాలని రవాణా శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపారు. త్వరలో మరికొంతమంది లైసెన్స్‌లను రద్దు చేయాలని ప్రతిపాదించనున్నట్టు ట్రాఫిక్ విభాగ వర్గాలు తెలిపాయి.

# దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు



## బంగారం, వెండి, వివిధ దేశాల కరెన్సీ కూడా.. 19 రోజుల కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో గత 19 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో సోమవారం లెక్కించారు. నగదు రూ.3,34,70,370, బంగారం 265 గ్రాములు, వెండి 7 కిలోల 110 గ్రాములు వచ్చింది. 2000 నోట్లు ఏడు, 707 యూఎస్ఏ డాలర్లు, 130 ఇంగ్లాండ్ పౌండ్లు, 60 సింగపూర్ డాలర్లు, 255 ఆస్ట్రేలియా డాలర్లు, 210 యూఏఈ దిర్హమ్‌లు, 11 సౌదీ రియాల్స్, 400 ఓమన్ బయసాస్, 340 నేపాల్ రూపాయలు, 12,010 మలేషియా రింగెట్లు, 30 యూరోలు, 13,1/3 కువైట్ దీనార్లు, ఒక ఒమన్ రియాల్, 100 కెనడా డాలర్లు లభించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇక వేగంగా..

## దసరా నాటికి పెండింగ్ పనులు పూర్తి చేయండి

### దుర్గగుడి అధికారులకు దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశం

- ఏయే పనులు ఎప్పుడు పూర్తి చేయాలో దిశానిర్దేశం
- ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం



ఇటీవల దుర్గగుడి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ/ఇంద్రకీలాద్రి): దసరా ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని దేవదాయ శాఖ కమిషనర్ విధించిన డెడ్‌లైన్ ఆలయ అధికారుల్లో చలనం తెచ్చింది. ఆలయ అధికారులు వెంటనే పనులు చేపట్టే కాంట్రాక్ట్ సంస్థలపై ఒత్తిడి పెంచారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలను కనీవినీ మిగతా 6లో..

### పెండింగ్ ప్రాజెక్టులతో పాటు దసరా పనులు వేగవంతం

పెండింగ్ ప్రాజెక్టులతో పాటు దసరా ఉత్సవాలకు సంబంధించిన ఇతర పనులను త్వరగా పూర్తి చేయడానికి అధికారులకు షెడ్యూల్ నిర్దేశించారు. ఘాట్ రోడ్డు ప్యాచ్ వర్క్‌లను చేపట్టాలని దీనికి త్వరగా టెండర్లు పిలవాలని సూచించారు. దేవాలయం వద్ద చేపట్టాల్సిన మరమ్మతులను నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్, అగ్నిమాపక శాఖలు చేయాల్సిన పనులు సైతం కమిషనర్ సూచించారు. ఉత్సవాల్లో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన అధికారులు, సిబ్బందికి వసతి కల్పించేందుకు జమ్మిదొడ్డి మాడపాటి సీవీఆర్ ట్రస్ట్ గృహాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. భక్తులకు తాగునీరు సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రవాణా సౌకర్యం కల్పించాలని, ఆలయ పరిసరాలను పచ్చదనంతో అందంగా తీర్చిదిద్దాలని అధికారులకు కమిషనర్ సూచించారు.

# విద్యాధరపురం బస్‌డిపో మాకొద్దు

- ఎలక్ట్రికల్ బస్సుల చార్జింగ్ స్టేషన్ కోసం గన్నవరం బస్‌డిపో కావాలి
- ఆర్టీసీ అధికారులకు ప్రతిపాదన చేసిన బస్సుల నిర్వహణ సంస్థ
- వరద ముంపునకు గురైన విద్యాధరపురంపై అనాసక్తి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ కోసం ఆర్టీసీ ఉన్నతాధికారులు కేటాయించిన విద్యాధరపురం బస్సు డిపోపై నిర్వహణ సంస్థ అభ్యంతరాలను వ్యక్తం చేసినట్టు తెలిసింది. విద్యాధరపురం బస్‌డిపో గత సెప్టెంబరులో వచ్చిన వరదలకు ముంపునకు గురైంది. అప్పట్లో 50కిపైగా ఆర్టీసీ బస్సులు వరదనీటిలో చిక్కుకున్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు కూడా విద్యాధరపురం బస్‌డిపో మోకాలిలోతు నీరు నిల్వ ఉంటుంది. ఈ విషయం ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ సంస్థకు కూడా తెలిసింది. దీంతో నిర్వహణ సంస్థ విద్యాధరపురం బస్‌డిపోలో చార్జింగ్ మెయింటినెన్స్ ఏర్పాటు చేయడంలేదు. విద్యాధరపురం బస్‌డిపోకు ప్రత్యామ్నాయంగా గన్నవరం బస్‌డిపోను కేటాయించాలని నిర్వహణ సంస్థ కోరుతోంది. గన్నవరం బస్ డిపోను ఇచ్చే విషయంలో ఆర్టీసీ అధికారులు విముఖత చూపుతున్నారని తెలుస్తోంది. దీంతో ఎలక్ట్రికల్ చార్జింగ్ స్టేషన్ మెయింటెనెన్స్ యూనిట్ ఏర్పాటు ఆలస్యం అవుతోంది.



8 వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీలు : కలెక్టర్

పెసరకు తెగులు! 6

నవ జంటల్లో సంతాన శూన్యత! 8


ఈవోకు వెండి వస్తువులు అందజేస్తున్న దాతలు

## దుర్గమ్మ సన్నిధిలో దాతల విరాళాలు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు వివిధ రూపాల్లో వివిధ పథకాలకు విరాళాలు, కానుకలను సోమవారం పలువురు భక్తులు అందజేశారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు పద్మశ్రీ యల్లా వెంకటేశ్వరరావు రెండు వెండి దీపపు కుందులు, పళ్లెం, చెంబును కానుకగా


దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో

సమర్పించారు. ఉచిత ప్రసాద వితరణకు హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన బి.నారాయణస్వామి నాయుడు, లక్ష్మీపున్నమ్మ దంపతులు మనవడు గోపాలకృష్ణ, మనవడి భార్య గిరిజ కుమార్ పేరిట రూ.1.50లక్షలు విరాళంగా అందజేశారు. అన్నప్రసాద వితరణకు తిరుపతి శాంతినగర్, లక్ష్మీనిలయానికి చెందిన సీఎంఆర్ ఇన్‌ఫ్రాటిక్ ఎండీ సి.నాగేశ్వరరావు రూ.5లక్షలు విరాళంగా అందజేశారు. ఈవో శీనానాయక్ దాతలకు ఆలయ లాంఛనాలను అందజేశారు.

## ఘాట్ రోడ్డులో ప్రసాదాల కౌంటర్ ప్రారంభం

ఇంద్రకీలాద్రి : భక్తుల సౌకర్యార్థం దుర్గగుడి ఘాట్ రోడ్డు మొదట్లో ఉన్న కామధేను అమ్మవారి మందిరం పక్కన ప్రసాదాలు, వాహనపూజ టిక్కెట్లు, కొబ్బరికాయల విక్రయాలకు కొత్తగా కౌంటర్‌ను ప్రారంభించారు. సోమవారం ఈవో శీనానాయక్ ప్రత్యేక పూజల అనంతరం కౌంటర్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మాట్లాడుతూ, మెరుగైన సౌకర్యాలను భక్తులు సద్వినియోగ పరచుకోవాలన్నారు. కొత్త కౌంటర్‌లో ప్రసాదాల విక్రయాలతో పాటు నియంత్రించిన ధరలతో కొబ్బరికాయల విక్రయాలు జరుగుతాయన్నారు. ఇదే కౌంటర్‌లో వాహనపూజల టిక్కెట్లను కూడా పొందవచ్చునని, ఆయా కౌంటర్ల దగ్గర భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా కొత్త కౌంటర్ ద్వారా కొబ్బరికాయలు, ప్రసాదాలను కొనుగోలు చేయవచ్చునని తెలిపారు.

## దసరాకు దర్శనం టిక్కెట్ ధర పెంచలేదు

» ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాల సందర్భంగా దర్శనాల టిక్కెట్ ధర పెంచారంటూ సోషల్‌మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేయటం సరికాదని ఈవో వీకే శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా మహోత్సవాలలో దుర్గమ్మ దర్శనం టిక్కెట్ ధర రూ.1000 నిర్ణయించారనటం వాస్తవం కాదన్నారు. అనధికార దర్శనాల కట్టడి, సామాన్య భక్తుల దర్శనాలకే తొలి ప్రాధాన్యంపై ఇటీవల సమన్వయ సమావేశంలో చర్చ జరిగిందన్నారు. కుంకుమార్చన విషయంలో గతేడాది ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై సమావేశంలో చర్చించామన్నారు. అర్చకస్వాములు, సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకుని ఆ మేరకు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. అసత్యప్రచారాలను నమ్మవద్దని భక్తులకు సూచించారు.


గంగానమ్మ తల్లి ప్రతిష్ఠ ఉత్సవాల్లో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

## కోలాహలంగా గంగానమ్మ ఆలయ ప్రతిష్ఠ

ముదినేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో పునర్నిర్మించిన గంగానమ్మ ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు, పంబలోళ్ల ఆచార సంప్రదాయాల మధ్య ఆలయంలో గంగానమ్మ, నాగబంధం, పోతురాజుస్వామి, సింహవాహన విగ్రహాలు, ఆలయ శిఖర ప్రతిష్ఠ జరిగింది. ఉదయం 8.13 గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠించి, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తోపాటు మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, కొత్త నాగేంద్ర కుమార్, బొర్రా చలమయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యెర్నేని వెంకట సుబ్బారావు, కోశాధికారి జాస్తి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో అన్నసమారాధన నిర్వహించారు.

## కేంద్ర విశ్వవిద్యాలయాలకు రూ. 529.14 కోట్లు

» ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం

వన్‌టౌన్ : ఏపీలోని కేంద్ర విశ్వవిద్యాలయాలకు 2019-2024 మధ్య రూ. 529.14 కోట్ల నిధులను విడుదల చేసినట్టు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ వెల్లడించారు. 2020-2021, 2024-2025 వరకుఏపీలోని కేంద్ర విశ్వవిద్యాలయానికి రూ. 404.05 కోట్లు విడుదల చేయగా, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి రూ 125.09 కోట్లు విడుదల చేసినట్టు మంత్రి వివరించారు. గిరిజన విశ్వవిద్యాలయంలో 18మంది అధ్యాపకులు, 12 మంది బోధనేతర సిబ్బంది పూర్తి స్థాయిలో పనిచేస్తున్నారని, కేంద్ర విశ్వవిద్యాలయంలో ఒక అధ్యాపకుడు, భోదనేతర సిబ్బంది మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషనకు బ్లాక్ గ్రాంట్ రూపంలో నిధులు విడుదలవుతాయని, యూజీసీ నుంచి ఆయా విశ్వవిద్యాలయాల అవసరాలమేరకు నిధులు కేటాయిస్తారని వివరించారు.

## ఎన్టీటీపీఎస్ ఆసుపత్రి ప్రయివేటు పరం!

» తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

» అవసరమైతే ధర్నాకు సిద్ధం

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీటీపీఎస్ యాజమాన్యం తీరుతో కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికే కారుచౌకగా యాష్ పాండ్‌లోని బూడిదను ప్రయివేటు వ్యక్తుల పరం చేసిన యాజమాన్యం తాజాగా ఎన్టీటీపీఎస్ ఆసుపత్రిని ధారాదత్తం చేసేందుకు సిద్ధపడుతోంది. ఇందుకు సంబంధించిన జీవో సైతం విడుదల చేసినట్టు కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో విలువైన అధునాతన వైద్య పరికరాలు ఉన్న వైద్యశాల ప్రయివేటుపరం చేయడం ఏమిటని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రయివేటు అప్పగిస్తే ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్య సేవలు దూరమవుతాయని ఆందోళన చెందుతున్నారు. యాజమాన్యం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

# ఆదర్శ నేత మండలి

### ఘనంగా మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలు


తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'మండలి' చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, బుద్ధప్రసాద్


అవనిగడ్డలోని గాంధీక్షేత్రంలో మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రఘురామ కృష్ణరాజు, కొనకళ్ల నారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, వసంత నాగేశ్వరరావు, నన్నపనేని, బుద్ధప్రసాద్ ప్రభృతులు

విజయవాడ/అవనిగడ్డ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజాజీవితం కోసం సేవే పరమావధిగా నిత్యం పరితపించిన మండలి వెంకట కృష్ణారావు చిరస్మరణీయులని వక్తలు కొనియాడారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకలు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవనిగడ్డలో సోమవారం జరిగాయి. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ప్రెస్ అకాడమి చైర్మన్ ఆలపాటి సురేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీమేయర్ జంధ్యాల శంకర్, మండలి వెంకటకృష్ణారావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### 175 నియోజకవర్గాల్లో అవతరించాలి

- గరికపాటి నరసింహారావు

ఆదర్శాలను ఆరాధించకుండా ఆచరించారు. మండలి వెంకట కృష్ణారావు ఒక వసుధ. ఏకగ్రీవంగా ఎన్నికున్న ప్రజలకు దివిసీమకు ఉప్పెన వచ్చినప్పుడు ఏమి చేయాలో అంతా చేశారు. మండలి వంటి త్యాగమూర్తులు రాష్ట్రంలో 175 మంది అవతరలించాలి. కృష్ణారావు ఉన్న ఆస్తులను కరిగించుకున్నారు. త్యాగం వల్లే అమృతానందం కలుగుతుంది. కృష్ణారావు అదే చేశారు. ఆయన భాషాభిమానే కాదు పండితుడు. గురువు దినం పదాన్ని గురుపూజా మహోత్సవంగా కృష్ణారావు మార్చారు. ఆయన ఆదర్శాలను స్వీకరించాలి.

### సనాతనధర్మాన్ని పాటించిన వ్యక్తి

- విశ్వంజి, విశ్వయోగి

ప్రపంచమంతా అస్తవ్యస్తంగా ఉంది. మండలి వెంకట కృష్ణారావు నాస్తికుడు కాదు. సనాతనధర్మాన్ని పాటించారు. సనాతనధర్మం భౌతికాన్ని గురించి ఎక్కువగా ఆలోచించింది. మండలి వెంకట కృష్ణారావు ప్రజలు, ప్రకృతి గురించి ఆలోచించారు. ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ఏంచేయాలో ఆలోచించారు. డబ్బులు పాపిష్టుల చేతుల్లోకి వెళ్తే పాపాలు చేస్తుంది. అదే మంచి వాళ్ల చేతిలోకి వెళ్తే మంచి చేస్తుంది. రాష్ట్రంలో ఒక ప్రాజెక్టుకు మండలి వెంకటకృష్ణారావు పేరు పెట్టాలని చంద్రబాబును కోరాను. దానికి ఆయన అంగీకరించారు.

### జాతికి మేలు చేసిన వారిని స్మరించుకోవాలి

- బొండా ఉమా, సెంట్రల్ ఎమ్మెల్యే

ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా కృష్ణారావు నిబద్ధత కలిగిన జీవితం గడిపారు. ఆయన జీవితం మాకు ఆదర్శనీయం. జాతికి మేలు చేసిన వారిని గుర్తించుకోవాలి. వారి గురించి రాబోయే తరాలకు తెలియజేయాలి. దివిసీమ గాంధీగా కృష్ణారావు నిలిచారు. ఆయన ఎప్పుడూ ప్రజల పక్షాన, తెలుగు భాష పక్షాన నిలబడ్డారు.

### 'పద్మా'లకు సత్కారం

కార్యక్రమం అనంతరం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాలు అందుకున్న ప్రముఖులను సీఎం చంద్రబాబు సత్కరించారు. గరికపాటి నరసింహరావు, దండముడి సుమతీరామ్మోహన్, అన్నవరపు రామస్వామి, ఎడ్లపల్లి వెంకటేశ్వరరావును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వారితో పాటు పశ్చిమ బెంగాల్‌లో దళిత బంధు కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా ఉన్న వీర్రాజును సీఎం సత్కరించారు.

### గాంధీ క్షేత్రంలో..

అవనిగడ్డలో సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో కృష్ణారావు శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రఘురామ కృష్ణంరాజు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారిలు వంతెన సెంటరులోని మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### అలుపెరుగని ప్రజా సేవకుడు

- డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

సేవే పరమావధిగా దివిసీమ పునర్నిర్మాణానికి అలుపెరగక శ్రమించిన మండలి వెంకట కృష్ణారావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారు. ప్రపంచ తెలుగుమహాసభల నిర్వహణ ద్వారా తెలుగు వారిని ఏకంచేసిన మండలి వెంకట కృష్ణారావు చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, తరాలు గడిచినా మండలి వెంకట కృష్ణారావు కీర్తి అజరామరమని కొనియాడారు. తెలుగుభాషాభివృద్ధికి తరతరాలుగా మండలి కుటుంబం పనిచేస్తున్నదన్నారు.

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు మండలి వెంకట కృష్ణారావు అన్నారు.

● పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల మనిషిగా కృష్ణారావు పేదలకు భూపంపిణీ చేయటమే కాకుండా మంత్రిగా ఎన్నో కార్యక్రమాలు అమలుచేసి ఆదర్శ రాజకీయవేత్తగా నిలిచారన్నారు.

● పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, మండలి వెంకట కృష్ణారావు దివి ప్రజల మనసుల్లో చిరంజీవిగా చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఆయన జీవితచరిత్రను పాఠ్యపుస్తకంగా తీసుకురావాలని కోరారు.

● మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, ఉప్పెన అనంతరం మండలి వెంకట కృష్ణారావు సహాయక చర్యల్లో అహోరాత్రాలు శ్రమించిన తీరు నేటికీ మరువలేమన్నారు.

● మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు మాట్లాడుతూ, దివిసీమ ఉప్పెన సహాయక చర్యల్లో నెత్తురోడుతున్నా బ్యాండేజీలు కట్టుకుని సహాయక చర్యలు కొనసాగించిన గొప్పసేవామూర్తి అని, తెలుగు భాష ఔన్నత్యానికి విశేష కృషిచేశారని కొనియాడారు.

● మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, విద్యుత్ నియంత్రణ మండలి మాజీ అధికారి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిఠాపురం ఆధ్యాత్మిక పీఠం అధినేత ఉమర్ అలీషా, వైకుంఠపురం భవిష్ని గురూజీ, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, నెల్లూరు క్లాసికల్ తెలుగుసెంటర్ మాజీ డైరెక్టర్ మునిరత్నం నాయుడు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్, వివిధ రంగాల ప్రముఖులు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. సభకు వచ్చిన అతిధులను మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్‌కుమార్, మండలి కుటుంబసభ్యులు ఆత్మీయ స్వాగతం పలికి సత్కరించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి, మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి అతిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## పెసరకు తెగులు!

» పంట దిగుబడిపై ప్రభావం.. ఆందోళనలో రైతన్న


తెగులు సోకటంతో పసుపుపచ్చగా మారుతున్న పెసర చేను, కాయల్లేని చెట్లు

కంచికచర్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెసర పంటకు తెగులు సోకింది. తెగులు ఉధృతంగా ఉండటంతో చేలు పసుపుపచ్చగా మారాయి. దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఈ ఏడాది తొలకరిలో ఆరేడు వేల ఎకరాల్లో రైతులు పెసర సాగు చేశారు. మే నెల చివర్లో సాగుచేసిన ముదురు తోటలు కోతకు రాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. రోజుల తరబడి నాన్పుడు వాన కావటం, తేమ ఆరకపోవటంతో గింజల నుంచి మొలకలు వచ్చాయి. పండిన పంట చేతికి దక్కకుండా పోయింది. జూన్ నెలలో సాగుచేసిన పెసర పైరు ప్రస్తుతం పిందె, కాయ దశలో ఉంది. పక్షం రోజుల్లో చేలు కోతకు రానున్నాయి. అలాంటిది ప్రస్తుతం పెసరకు తెగులు ఉధృతంగా సోకి అదుపులోకి రావటం లేదు. మందులు పిచికారి చేసినప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. చేలు తెగులు వల్ల పసుపుపచ్చగా మారుతున్నాయి. పిందెలు, కాయలు దెబ్బతింటున్నాయి. ఈ తెగులు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపనున్నది. సాధారణంగా పెసర పంట ఎకరానికి నాలుగు బస్తాల వరకు దిగుబడి వస్తుంది. ఈ తెగులు మహమ్మారి వల్ల సగానికి సగం దిగుబడి తగ్గనున్నది. విత్తనాలు, పురుగు మందులు, ఇతరత్రా కలిపి ఎకరానికి రూ.10 వేలకు పైగా పెట్టుబడి అయింది. ఎకరం కౌలు సగటున రూ. 15 వేలు. పెట్టుబడి సైతం చేతికి అందని దుస్థితి నెలకొన్నది. ముదురు తోటలు భారీ వర్షాల వల్ల, లేత తోటలు తెగులు వల్ల దెబ్బతినటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

## అన్నదాతల రుణ అవస్థలు!

(5వ పేజీ తరువాయి)

ఇంకా పూర్తిస్థాయిలో త్రిసభ్య కమిటీలను నియమించలేదు. గత నెలలో రెండు దఫాలుగా కొన్ని సంఘాలకు మాత్రం త్రిసభ్య కమిటీలను నియమించారు. ఎందువల్లనో మిగతా సంఘాలకు కమిటీలను వేయలేదు. పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ) ఆధ్వర్యంలో సంఘాలు నడుస్తున్నాయి. అయితే కమిటీలు లేకపోవటం వల్ల రైతులకు సకాలంలో రుణాలు అందటం లేదని అంటున్నారు. సంవత్సర కాలంగా అధికారుల పర్యవేక్షణలో రైతులకు రుణాలు మంజూరు చేయటంలో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శలు ఉన్నాయి.

**425 సంఘాలుంటే 117 సంఘాలకే త్రిసభ్య కమిటీలు**

కేడీసీసీ బ్యాంకు పరిధిలో ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 425 సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో కేవలం 117 సంఘాలకు మాత్రమే ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. ఎన్టీఆర్ జిల్లాలో 131 సంఘాలకు గాను 11 సంఘాలకు, కృష్ణాజిల్లాలో 213 సంఘాలకు గాను 68 సంఘాలకు, ఏలూరు జిల్లాలో 81 సంఘాలకు గాను 38 సంఘాలకు మాత్రమే కమిటీలను నియమించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మిగతా 308 సంఘాలకు ఇంకా త్రిసభ్య కమిటీలను నియమించలేదు. పైగా వచ్చే ఏడాది జనవరి 30 వరకు లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు సంఘాలకు పీఐసీలను నియమిస్తూ ప్రభుత్వం మూడు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంఘాలకు ఒకేసారి త్రిసభ్య కమిటీలను నియమించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సంవత్సరంపైగా గడిచినప్పటికీ త్రీసభ్య కమిటీలను నియమించటంలో ఎందుకు తాత్సారం చేస్తున్నదో అర్థం కావటం లేదు. కమిటీలు లేకపోవటం వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామంటూ రైతులు వాపోతున్నారు.

## ఇక వేగంగా..

(5వ పేజీ తరువాయి)

ఎరుగని రీతిలో నిర్వహించేందుకు దేవదాయ శాఖ ప్రింటింగ్ ప్రాజెక్ట్ పనులపై దృష్టి సారించింది. ఉత్సవాలకు మరో నెలన్నర సమయం ఉండటంతో ఈ లోపుగా పెండింగ్ పనులను పూర్తి చేయాలని కమిషనర్ భావిస్తున్నారు. దసరా ఉత్సవాలతో ముడిపడిన ఈ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఇటీవలే ఆలయ అధికారులకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

● మహా మండపం ఎదురుగా గోశాల పక్కన ఏర్పాటు చేస్తున్న లడ్డూ పోటు భవనాన్ని సెప్టెంబర్ పదో తేదీ లోపుగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ ఆదేశించారు. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అమ్మవారి ప్రసాదం లడ్డూకు డిమాండ్ ఉంది. లడ్డూ పోటు కేంద్రం అందుబాటులో లేకపోవడం వల్ల ప్రత్యామ్నాయంగా బయట ప్రాంతాల్లో చేయించాల్సి వస్తోంది. ఇది దూరభారం కావడం వల్ల సమస్యగా మారింది.

ప్రస్తుతం లడ్డూ పోటు భవన నిర్మాణం కొండ దిగువన మహా మండపం పక్కన ఉంది. ఈ భవనం అందుబాటులోకి వస్తే ఇక్కడ తయారు చేసే లడ్డూలను ప్రసాదాల కేంద్రాలకు చాలా తేలిగ్గా తరలించే అవకాశం ఉంది. దీంతో పాటు మహా మండపం అభిముఖంగా శివాలయం పక్కన జరుగుతున్న అన్న ప్రసాద భవనం త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

● అన్నదాన భవన నిర్మాణానికి సంబంధించి శ్లాబు పనులు పూర్తయ్యాయి. ఈ భవనం మొదటి అంతస్తు ఉయోగించాలని కమిషనర్ భావిస్తున్నారు. అన్న ప్రసాద భవనాన్ని సెప్టెంబర్ పదో తేదీ లోపు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు నిర్దేశించారు.

● కొండ మీద శివాలయం మార్గంలో యాగశాల నిర్మాణాన్ని ఇటీవల చేపట్టారు. దీనికి సంబంధించి ఫినీషింగ్ పనులు ఆగస్టు ఆరో తేదీ నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

● పూజా మండపం నిర్మాణ పనులు ఆగస్టు 15వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాని ఆదేశించారు.

● కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ క్యూట్ కాంప్లెక్స్ పనులను సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించారు. ఎలివేటెడ్ కాంప్లెక్స్ పనులు దాదాపు సగం పైబడి పూర్తయ్యాయి. ఈ క్యూ కాంప్లెక్స్ ద్వారా అమ్మవారిని దర్శనం చేసుకుని భక్తులు శివాలయం మార్గం నుంచి నేరుగా కనకదుర్గనగర్ ప్రాంగణంలోకి చేరుకుంటారు.

## భర్త వేధింపులు తాళలేక నవవధువు ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

అరుణ్‌కుమార్ రోజూ తాగి వచ్చి "నువ్వు అందంగా లేవు.. నీకంటే ముందు నాకు పరిచయం ఉన్న అమ్మాయి అందం ముందు నీవు ఎందుకు పనికిరావు" అంటూ కొట్టి హింసిస్తున్నాడు.. ఇలాంటి వాడి దగ్గర ఉండలేకపోతున్నాను.. మన ఇంటికి వచ్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేను.. నిన్ను, నాన్నను తిడుతున్నాడు. వీడిని, వీడి అమ్మ నాన్నలను వదలొద్దు.. ఇక ఈ బాధలు నేను తాళలేను.. నీకు ఈ సారి రాఖీ కట్టలేక పోతున్నాను తమ్ముడు.. అమ్మనాన్నలను జాగ్రత్తగా చూసుకో అంటూ లేఖలో పేర్కొంది. సమాచారం అందుకున్న పోలీసులు శ్రీవిద్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీవిద్య తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అరుణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ టీవీవీ రామారావు తెలిపారు.

## 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

» శాప్ చైర్మన్ రవినాయుడు


క్రీడా సంఘాల నిర్వాహకులతో సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈనెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాసంఘాల నిర్వాహకులకు సూచించారు. శాప్ కార్యాలయంలో సోమవారం క్రీడాసంఘాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించిన ఆయన ఈనెల 6 నుంచి 10 వరకు జిలా స్థాయి పోటీలు, 11 నుంచి 15 వరకు జోన్ స్థాయి పోటీలు, 16 నుంచి 20 వరకు రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్టు వివరించారు. స్పోర్ట్స్ డేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని, పోటీలను తూతూ మంత్రంగా కాకుండా క్రీడాకారులకు ప్రయోజనకరంగా ఉండేలా నిర్వహించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి కేటగిరిలవారీగా నగదు ప్రోత్సహకాలు అందిస్తామని, ఆయా క్రీడా అసోసియేషన్లు సహకారించాలని కోరారు. శాప్ ఏవో ఆర్ వెంకటరమణ నాయక్, స్పోర్ట్స్ ఆఫీసర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయండి

» ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవవేడుకలకు ఏర్పాట్లు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌ను స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్ కవాతు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం, తదితర అంశాలపై ముందస్తుగా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలో అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలం కావడంతో వాటర్‌ప్రూఫ్ షామియానాలను వేయాలన్నారు. వేడుకల విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, మెప్మా పీడీ సాయిబాబు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## మీ కోసం సమస్యలు త్వరితగతిన పరిష్కరించండి



» ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజలకు పోలీసు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి, ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిర్వచనంగా నిలుస్తామని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. సోమవారం 'మీ కోసం' కార్యక్రమంలో మొత్తం 30 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు.


తల్లికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఝాన్సీ రాణి

## తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె

» రెండువారాల క్రితమే తండ్రి మృతి

ఘంటసాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : దేవరకోట గ్రామానికి చెందిన అరిగెల ఆదినారాయణ (62), లక్ష్మి(59)లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆదినారాయణ రెండు వారాల క్రితం గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. దీంతో మనస్థాపానికి గురై లక్ష్మి సోమవారం ఉదయం మృతి చెందింది. కుమారులు లేకపోవటంతో హిందూ సాంప్రదాయం ప్రకారం తల్లికి చిన్నకుమార్తె ఝాన్సీరాణి తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది. నిరుపేద కుటుంబంలో వారాల వ్యవధిలోనే దంపతులు మృతి చెందటంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. నెలకొన్నాయి. గ్రామ సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, గ్రామస్థులు లక్ష్మి పార్థివదేహాన్ని సందర్శించి, కుమార్తెలను పరామర్శించారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 105,113, 124 |
| చికెన్ విత్ స్కిన్ | 200 |
| చికెన్ స్కిన్‌లెస్ | 210 |

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

## లయోలలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌పై సదస్సు

భారతీనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెమినార్ హాల్‌లో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ)పై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షై టిజన్ ఎడ్యుకేషనల్ సర్వీస్ ఫౌండర్, డైరెక్టర్ పల్లెపోగు రవీంద్ర మాట్లాడుతూ సెన్సార్‌లు, అప్లికేషన్లు, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అంశాలకు సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల పరిశ్రమల అవసరాలపై ప్రాక్టికల్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని విభాగ అధ్యాపకులు ఎల్.కన్యాకుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల అర్జీలను క్షేత్రస్థాయిలో పరిష్కరించండి

### అదనపు కమిషనర్(ప్రాజెక్ట్) డాక్టర్ చంద్రశేఖర్

కార్పొరేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. నగరంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను అర్జీలుగా అదనపు కమిషనర్‌కు అందజేశారు. మొత్తం 17 ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జీ. సృజన తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ ఉదయరాణి

### పోలీస్ కమిషనరేట్‌కు 84 ఫిర్యాదులు

విజయవాడ సిటీ:పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 84 అర్జీలను స్వీకరించినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఎ.బి.టి.ఎస్.ఉదయరాణి తెలిపారు. నగదు లావాదేవీలపై 45, కుటుంబ కలహాలపై ఏడు, కొట్లాటలపై రెండు, మోసాలపై మూడు, మహిళా సంబంధిత నేరాలపై ఐదు, చోరీలపై ఐదు, చిన్నచిన్న ఘటనలపై 17 మంది అర్జీలు ఇచ్చారని చెప్పారు. ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు.

## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

### ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను విద్యాశాఖ మంత్రి లోకేష్ తీర్చిదిద్దుతున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. 14వ డివిజన్ దర్శిపేట విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ మోడల్ స్కూల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నారని తెలిపారు. ప్రతిపక్షాలు సైతం ఉపాధ్యాయుల బదిలీలు సక్రమంగా జరిగాయనే విధంగా బదిలీలు జరిపారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజశేఖర్, హెచ్ఎం మైథిలి, పార్టీ నాయకులు బొప్పన భవకుమార్, సీహెచ్ సాంబయ్య, నాగేశ్వరరావు, జనసేన నాయకులు యడ్లపల్లి నాగరాజు, చెరుకూరు సాంబయ్య, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● 14వ డివిజన్‌లో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. ఆయన ప్రతి ఇంటికి వెళ్ళి ఏడాది కూటమి ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికి అందించారు. అనంతరం డివిజన్‌లోని నిరుపేద కుటుంబాలకు చెందిన అక్కిశెట్టి రాంబాబుకు ప్లాట్‌ఫాం రిక్షాను ఆయన అందజేశారు.



దర్శిపేట కార్పొరేషన్ మోడల్ స్కూల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

### రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన

మాచవరం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన ముందుడుగు వేస్తుందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 6వ డివిజన్‌లో గద్దె క్రాంతికుమార్ పర్యటించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో కూడా లేనివిధంగా పెద్దమొత్తంలో లక్షల మందికి సంక్షేమం అందిస్తున్న ఘనత చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇరువురు మహిళలకు వైద్యఖర్చులకు గద్దె క్రాంతికుమార్ ఆర్థికసాయం అందజేశారు. జాస్తి సాంబశివరావు, గంగాధర్, పల్లి దుర్గాప్రసాద్, గురునాథం, సుబ్బారావు, దుర్గారావు, అప్పారావు, రాఘవ, పాల్గొన్నారు.





## టిప్పర్ ఢీకొని యువకుడు మృతి

విద్యాధరపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి కుమ్మరిపాలెం వద్ద జరిగింది. పటమట దర్శిపేటకు చెందిన సిరివెళ్ల వెంకటేశ్వరమ్మ, కుమారుడు దేవరాజ్ (19), కుమార్తెతో ఉంటుంది. దేవరాజ్ ఆదివారం రాత్రి పది గంటలకు భవానీపురం కుమ్మరిపాలెం సెంటర్‌కు చెందిన స్నేహితుడు దినేష్ రెడ్డితో కలిసి బైక్‌పై బందరురోడ్డు ఫుడ్‌కోర్టుకు వచ్చి టిఫిన్ తిన్నారు. దినేష్ రెడ్డిని ఇంటి వద్ద దింపటానికి బయల్దేరారు. దినేష్ రెడ్డి బైక్ నడుపుతుండగా దేవరాజ్ వెనుక కూర్చొన్నాడు. కనకదుర్గమ్మ ఫ్లైఓవర్‌పై కుమ్మరిపాలెం వచ్చేసరికి వెనుక నుంచి టిప్పర్ లారీ ఢీకొంది. దినేష్ రెడ్డి బైక్‌తో కిందపడి గాయపడ్డాడు. దేవరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వెనుక తన కుమార్తె, ఫ్రెండ్ శివ ఇంకో బైక్‌పై ఉన్నారని, యాక్సిడెంట్ జరిగిన తీరు ఆమె చూసినట్లు ఫిర్యాదులో తల్లి పేర్కొంది.





తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, ఆశా వర్కర్లు

## తల్లిపాలు బిడ్డలకు శ్రేయస్కరం

రాణిగారితోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు ఇవ్వడం వలన బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని డాక్టర్ బి.సందీప్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా విజయవాడ రూరల్ ప్రాజెక్టు 3వ సెక్టార్ రాణిగారితోట 17వ డివిజన్‌లోని శాంపిల్ బిల్డింగ్‌లో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డలకు ఎంతో శ్రేయస్కరం అని బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే పాలు రోగనిరోధక శక్తిని కలిగి ఉంటాయని తెలిపారు. పలువురు మహిళలు అడిగిన ప్రశ్నలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సౌజన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సి.హెచ్.శ్యామలత పాల్గొన్నారు.

పటమట: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అయ్యప్పనగర్ అంగనవాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్‌మెంట్ సీవో అన్నా మేరీ, సచివాలయం ఎంఎస్ కె.భార్గవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మహిళల ఆత్మరక్షణకు శక్తి యాప్

### ● పటమట సీఐ పవన్‌కిషోర్



స్టెల్లా కళాశాలలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసిన విద్యార్థినులతో కానిస్టేబుల్

గుణదల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆత్మరక్షణకు శక్తి యాప్ ఎంతగానో దోహదపడుతుందని పటమట సీఐ పవన్‌కిషోర్ తెలిపారు. శక్తి యాప్ పట్ల బాలికలు, విద్యార్థినులు అవగాహన కల్గి ఉండాలన్న ఆలోచనతో పటమట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, బెంజిసర్కిల్ వద్దగల స్టెల్లా కళాశాలలో శక్తియాప్ పట్ల అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు సీఐ పవన్‌కిషోర్ చెప్పారు. స్టెల్లాకళాశాలలో విద్యార్థినులకు యాప్‌ను ఎలా వినియోగించాలి తద్వారా జరిగే ఉపయోగాలు ఏమిటన్నది సవివరంగా తెలియజేశారు. కళాశాలలోని విద్యార్థినుల వద్ద ఉన్న ఫోన్లలో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసి చూపించారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడేవారికి చెక్‌పెట్టడానికి ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి ఆటకట్టించేందుకు శక్తి యాప్ దోహదపడుతుందన్నారు. పటమట మహిళా కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.





## నన్‌ల అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ ర్యాలీ





ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు

లబ్బీపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్‌లో నన్‌లపై కొంతమంది మతోన్మాదులు కుట్రలు పన్ని తప్పుడు ఆరోపణలు చేస్తూ వారిని అక్రమంగా అరెస్టు చేయించడాన్ని దేశంలోని అన్ని సంఘాలు, సంస్థలు తీవ్రంగా ఖండిస్తున్నాయని విజయవాడ కేథలిక్ డయోసిస్ మోన్సిగ్నోర్ ఆఫ్ చర్చస్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ ఫాదర్ మువ్వల ప్రసాద్ తెలిపారు. చత్తీస్‌ఘడ్‌లో కేరళకు చెందిన ఇద్దరు నన్‌ల(సిస్టర్స్) ను అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ ఫెడరేషన్ ఆఫ్ చర్చస్ ఆధ్వర్యాన సోమవారం సాయంత్రం అన్ని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారికి బెయిల్ మంజూరైనప్పటికీ వారిపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ ర్యాలీ బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణం నుంచి పీడబ్ల్యూడీ గ్రౌండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఏలేటి విలియం జయరాజు, తోట సునీల్, పసల తోమస్, బేతేలు మినిస్ట్రీస్ చైర్మన్ పాస్టర్ సల్లూరి జయకుమార్ బాబు, సిస్టర్స్ సుగుణ, సుందరి తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నేడు

భారతీనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలి ఉన్న డిప్లొమో సీట్లకు మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమో ఇన్ ఆటోమొబైల్, సివిల్, మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్‌లలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పాలీసెట్ రాసినవారైనా, రాయనివారైనా, పదవతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పదవ తరగతి మార్కులిస్ట్, టీసీ, 4-10వ తరగతి స్టడీ సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ, ఈడబ్ల్యూఎస్ లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు ఒరిజనల్స్, అన్ని మూడు సెట్స్ జిరాక్స్ 6 పాస్‌పోర్టు ఫోటోలు తీసుకొని మంగళవారం ఉదయం 9.30కు కళాశాలలో హాజరుకావాలని తెలిపారు.

## రోడ్డు మీద వాహనాల పార్కింగ్ ...స్తంభిస్తున్న ట్రాఫిక్



పటమట,ఆంధ్రజ్యోతి: పటమట హైస్కూల్ రోడ్డు, అల్పా జంక్షన్‌లో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. జంక్షన్‌లో ఉన్న హోటల్‌లో టీ తాగడానికి వచ్చిన వినియోగదారులు తమ వాహనాలను రోడ్డు మీద వదిలివేయడంతో హైస్కూల్ రోడ్డు నుంచి గురునానక్ కాలనీ వెళ్లే రోడ్డు, అల్పా జంక్షన్ నుంచి ఆటోనగర్‌కు వెళ్లే దారిలో ట్రాఫిక్ స్తంభించిపోవడమే కాకుండా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత పోలీస్ అధికారులు రోడ్డు మీద వాహనాలు పార్కింగ్ చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## గంజాయి, బ్లేడ్‌బ్యాచ్‌కు అడ్డా...ఈ కంటైనర్

●ఐదేళ్లుగా ఈఎస్ఐ రోడ్డులో పార్కింగ్

● పట్టించుకోని అధికారులు



గుణదల, ఆంధ్రజ్యోతి: రోడ్డు పక్కన పార్క్‌చేసి ఉన్న కంటైనర్లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నా పట్టించుకునేవారు లేరు. గుణదల ఈఎస్ఐ రోడ్డులోని శ్మశాన వాటిక వద్ద రోడ్డు పక్కన కంటైనర్ పార్క్‌చేసి వదిలేసి దాదాపుగా ఐదేళ్ల పూర్తి కావస్తుంది. ఇక్కడ కంటైనర్ పార్క్‌చేసి వదిలేసింది ఎవరు ? ఇక్కడ ఎందుకు పార్క్ చేశారన్నది ఓ పెద్ద మిస్టరీ. ఇదిలా ఉంటే బ్లేడ్‌బ్యాచ్, గంజాయి బ్యాచ్ కంటైనర్‌ను అడ్డాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో అటుగా రాత్రివేళ ద్విచక్రవాహనాలపై ప్రయాణాలు చేసేవారు, పాదచారులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి పెట్టి కంటైనర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## శిథిలావస్థలో ఐలా కార్యాలయ భవనం

● 40 ఏళ్ల క్రితం నిర్మాణం ● శ్లాబ్ పెచ్చులు ఊడి కిందపడుతున్న వైనం ● ఆందోళనలో సిబ్బంది

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: విజయవాడ జవహర్ ఆటోనగర్ పాలనా వ్యవహారాలు చూసే ఐలా(ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ) కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలో ఐలా కార్యాలయం ఉంది. ఏపీఐఐసీ సిబ్బంది గృహసముదాయంగా ఉన్న భవనంలో ఐలా కార్యాలయం ఏర్పాటు చేశారు. దాని నిర్వహణలోపం వల్ల శిథిలావస్థకు చేరింది. ఈభవనంలో ఐలా కమిషనర్ కార్యాలయం, పాలక మండలి చైర్మన్ చాంబర్, సర్వీస్ సొసైటీ కార్యాలయం, పన్నులు చెల్లించే కార్యాలయం, కంప్యూటర్, అకౌంట్స్ సెక్షన్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఈభవనం శ్లాబ్ నుంచి సిమెంట్ పెచ్చులు కూడా ఊడిపడుతున్నాయి. పలు కిటికీల వద్ద గోడలు బీటలువారాయి. వర్షానికి గోడలు నాని చెమ్మవస్తుందని సిబ్బంది అంటున్నారు. ఇదే పరిస్థితి కొన్నాళ్లు సాగితే కార్యాలయ భవనం కూలే అవకాశం కూడా లేకపోలేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలావస్థకు చేరిన ఐలా కార్యాలయ భవనం

### నూతన భవనంలోకి ఐలా కార్యాలయం మార్చాలి



ఐలా కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చాలి. భవనం శ్లాబ్ నుంచి సిమెంట్ పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. అనుకోకుండా సిబ్బంది మీద ఆపెచ్చులు పడితే ఎవరు బాధ్యులు. సుమారు 40ఏళ్ల క్రితం నిర్మించిన ఏపీఐఐసీ సిబ్బంది క్వార్టర్స్‌ను ఐలా కార్యాలయం భవనంగా వాడుకుంటున్నారు.

ఎంఏ ఖాలీక్, మాజీ ప్రధాన కార్యదర్శి, ఆటోనగర్ టెక్నీషియన్స్ అసోసియేషన్

### ఆదాయం ఉన్నా...

జవహర్ ఆటోనగర్‌లోని ప్లాట్ ఓనర్స్ నుంచి ఏడాదికి సుమారు రూ. 4.5 కోట్ల వరకు ఆస్తి పన్ను వస్తోంది. ఐలాకు ఇంత ఆదాయం వస్తున్నా కార్యాలయానికి సరైన భవనం లేకపోవడం శోచనీయం. భవనానికి కార్యాలయం పేరు కూడా కనిపించకుండా ఉంది. వర్షాలకు, ఎండకు కార్యాలయం పేరు వెలిసిపోయింది.



## పీఎం, సీఎం, ఎంపీల చిత్రపటాలకు పాలాభిషేకం

వన్‌టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరి కృషి వల్ల ప్రభుత్వానికి హైవే ప్రాజెక్టులకు వేలకోట్ల రూపాయల నిధులు మంజూరు అవ్వడంపై గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. వారి ఆధ్వర్యంలో సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో సీఎం, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఉప ముఖ్యమంత్రి, ఎంపీల చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరు మధుసూదన్ రావు, జిల్లా బీసీ గౌడ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిటీ కాంగ్రెస్ నేతలు

## గాంధేయవాది మండలికి ఘననివాళి

గవర్నర్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాంధేయవాది, దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శత జయంతిని పురస్కరించుకుని సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఏపీసీసీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో నివాళి కార్యక్రమం జరిగింది. మండలి చిత్రపటానికి సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరహరిశెట్టి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటం సమయం నుంచి మండలి దేశానికి చేసిన సేవలు ఆదర్శనీయమన్నారు.

## ఈశ్వరరావు మృతి తీరని లోటు

మొగల్రాజపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి కేసనకుర్తి ఈశ్వరరావు మృతి తీరని లోటని టీడీపీ నాయీ బ్రాహ్మణ సంఘం సెంట్రల్ అధ్యక్షుడు పేకేటి సత్యనారాయణ, కార్యదర్శి శ్రీను అన్నారు. కేసనకుర్తి ఈశ్వరరావు అంతిమయాత్ర సోమవారం మొగల్రాజపురం నుంచి కృష్ణలంక స్వర్గపురి వరకు జరిగింది. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సురవరపు నాగరాజు, సంఘ నేతలు సందర్శించి నివాళులు అర్పించారు.









## జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశానికి గడువు పెంపు

● 9,11 తరగతుల లేటర్ ఎంట్రీలకు గడువు సెప్టెంబరు 23

**హనుమాన్‌జంక్షన్ రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశపరీక్షకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ డీ ఏదునందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన, ఆసక్తిగల విద్యార్థులు ఆగస్టు 13లోగా తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. నవోదయ విద్యాలయాల్లో 9, 11వ తరగతి లేటరల్ ప్రవేశానికి దరఖాస్తు గడువు సెప్టెంబరు 23 గాను, ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 7వ తేదీగా అధికారికంగా నిర్ణయించినట్టు ప్రకటనలో వివరించారు. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10వ తరగతి చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. అర్హులైన వారు జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జవహర్ నవోదయ వేలేరు ప్రిన్సిపాల్ డీ ఏదునందన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆర్టీసీ స్థలం కాపాడుకుంటాం

● రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధం: ఈయూ

**బస్‌స్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** విజయవాడలో ఆర్టీసీ స్థలాలను లులు మాల్‌కు కేటాయింపులను అడ్డుకునేందుకు రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సన్నద్ధం అవుతున్నట్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న అనంతపురం, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం, ఒంగోలు, ఏలూరు జిల్లాల్లో, 9న కడప, రాజమండ్రి, నెల్లూరు, శ్రీకాకుళం, గుంటూరు, కృష్ణాజిల్లాల్లో, 13న కర్నూలు, విజయనగరం, పల్నాడు, పార్వతీపురం, భీమవరం, సత్యసాయి జిల్లాల్లో, 17న నంద్యాల, అనకాపల్లి, చిత్తూరు, కోనసీమ, అన్నమయ్య, పాడేరు, బాపట్ల జిల్లాల్లో ఎంప్లాయీస్ యూనియన్ ముఖ్య నేతల సమావేశాలు, విలేకరుల సమావేశాలు, అనంతర కార్యాచరణ ప్రకటనలు ఉంటాయన్నారు. రాష్ట్రస్థాయిలో ఒక సమావేశం ఏర్పాటు చేసి ఆర్టీసీ స్థలాలను కాపాడుకునేందుకు ఒక కార్యాచరణను రూపొందిస్తామన్నారు. మరోవైపు ఆర్టీసీ ఆస్తుల రక్షణకు పోరాడేవారెవరికైనా మద్దతు ఉంటుందని ప్రకటించారు.

## చీటింగ్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

**విజయవాడ లీగల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగం ఇప్పిస్తానని ఓ వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసిన నిందితుడిపై నేరం రుజువుకావడంతో మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బీ రాధారాణి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాధితుడు మహబూబ్‌నగర్ జిల్లా బొల్లారం గ్రామంలో తన కుటుంబంతో కలిసి నివశిస్తున్నాడు. కంచికచర్లలోని కళాశాలలో చదువుతున్న సమయంలో వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్స్‌కు విజయవాడ ఐజీఎం స్టేడియంలో కోచింగ్ తీసుకొన్నాడు. భవానీపురం పాత ఎంబీజీ కాలనీకి చెందిన షేక్ మహబూబ్ సుభాని బాధితుడికి పరిచయమై తాను ఆర్మీలో జాబ్ చేస్తున్నానని, బాధితుడికి కూడా ఉద్యోగం ఇప్పిస్తానని కాకపోతే కొంచెం డబ్బులు ఖర్చవుతాయని నమ్మబలికాడు. దీంతో బాధితుడు 2013 నవంబరు 29 నుంచి పలు దఫాలుగా రూ.3.25 లక్షలు సుభానీకి ముట్టజెప్పాడు. ఎప్పటికీ జాబ్ రాకపోవడంతో బాధితుడు విజయవాడ వచ్చి సుభానీని నిలదీయగా డబ్బులివ్వను ఏం చేసుకొంటావో చేసుకోమని బెదిరించినట్టు బాధితుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సుభానీపై ఐపీసీ 420 కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితుడిపై నేరం రుజువుకావడంతో పై శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## రిటైర్డ్ అధికారిని అదే పదవిలో నియమించడం రాజ్యాంగ విరుద్ధం

● ఏపీ పశు సంవర్ధకశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం

**గాంధీనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** గతంలో రిటైర్డ్ అయిన పశు సంవర్ధకశాఖ రాష్ట్ర డైరెక్టర్ టీ దామోదరనాయుడును కాంట్రాక్ట్ పద్ధతిలో తిరిగి డైరెక్టర్‌గా నియమించాలనుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పశు సంవర్ధన శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎస్ కృష్ణారావు తెలిపారు. ఈ నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అతడిని కొనసాగిస్తే ఉద్యోగ సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. శాఖలో అర్హత కలిగిన అధికారులను డైరెక్టర్‌గా నియమించాలని కోరారు. ప్రధానకార్యదర్శి ఎస్ఎల్ గణేశ్వరరావు, కోశాధికారి ఎన్.సతీష్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఈ.రాజేష్ పాల్గొన్నారు.

# అవగాహన ర్యాలీలు నిర్వహించాలి

● ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

**కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** ప్రతినెల 5న అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్)పై అవగాహన ర్యాలీలను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం డిజిటల్ సేవల్లో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర యాప్) ప్రజల చేతిలో ప్రభుత్వం అనే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా మనరాష్ట్రంలో వాట్సాప్ గవర్నెన్స్‌ను తెచ్చామని, 26 శాఖలకు చెందిన 530కు పైగా సేవలు అందుబాటులో ఉంచామన్నారు. మనమిత్ర వాట్సాప్ 9552300009 అనే నెంబరుపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 5న మంగళవారం నుంచి ప్రతి నెల 5న జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ర్యాలీలను నిర్వహించాలని, వీఆర్వోలు, విలేజ్ సర్వే అసిస్టెంట్లు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు పాల్గొనాలని, సెరికల్చర్, ఫిషరీస్ అసిస్టెంట్లు వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ఏఎన్ఎంలు పాల్గొని అవగాహన కల్పించాలని, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ర్యాలీలపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పోస్టర్ విడుదలలో గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జీ జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ ఎఎన్‌వీ నాంచారరావు పాల్గొన్నారు.

### ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలి

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఒక్కరిలో దేశభక్తిని పెంపొందించేలా హర్ ఘర్ తిరంగా జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. హర్ ఘర్ తిరంగా 2025 సందర్భంగా ప్రచార పోస్టర్‌ను సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 8 వరకు పాఠశాల, అన్ని విద్యాసంస్థల్లో హర్ ఘర్ తిరంగా నిర్వహించాలన్నారు. 9 నుంచి 12 వరకు తిరంగా మహోత్సవ్ పేరుతో ప్రజాప్రతినిధులు, వీపీలు పాల్గొనేలా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని, స్థానిక ఉత్పత్తులతో డ్వాక్రా మహిళలతో తిరంగా కలర్ థీమ్‌తో ప్రత్యేక తిరంగా మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు తిరంగా యాత్ర 13 నుంచి 15 వరకు ప్రభుత్వ భవనాలను, పాఠశాలలను, హోటళ్లను, వంతెనలు, డ్యాంలను విద్యుద్దీకరించి, అలంకరించి జాతీయ జెండాలను ఎగుర వేయడానికి సిద్ధం చేయాలన్నారు.

### తల్లిపాల విశిష్టతను చాటిచెప్పండి

పుట్టినప్పటి నుంచి తల్లి పాలివ్వడం బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని, చనుబాలుకు మించి ఔషధం మరొకటి లేదనే విషయాన్ని ప్రజల్లో అవగాహన కల్పించేలా వారోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఈనెల 7 వరకు నిర్వహించనున్న తల్లిపాల వారోత్సవాల సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని రోగనిరోధక శక్తి అధికంగా ఉండే తల్లి పాలు బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. వైద్యుల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ర్యాలీలు, గృహ సందర్శనలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు, పౌష్టికాహార పంపిణీ, ఆరోగ్య పరీక్షలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

### నులిపురుగు నివారణ మాత్రలివ్వాలి

జిల్లావ్యాప్తంగా ప్రతి చిన్నారికి అల్బెండజోల్ నులి పురుగు నివారణ మాత్రను పంపిణీ చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలను తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈనెల 12దీన నిర్వహించనున్న నులిపురుగుల నివారణ దినోత్సవం (నేషనల్ డివార్మింగ్ డే) సందర్భంగా సోమవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగు నివారణకు జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ప్రతి ఏడాది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తాయన్నారు. దీనిలో భాగంగా ఏడాది నుంచి 19 ఏళ్ల వయసులోపు ప్రతి ఒక్కరికీ అల్బెండజోల్ నులిపురుగు నివారణ మాత్రను పంపిణీ చేసేందుకు వైద్యాధికారులు సిద్ధం చేశారన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, యువజన సంక్షేమ అధికారి కే శ్రీనివాసరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎస్‌కే రుక్సానా, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, గ్రామవార్డు సచివాలయాల జిల్లా అధికారి జి.జ్యోతి పాల్గొన్నారు.

# వైద్యంపై అవగాహన అవసరం

● రాజధాని అభివృద్ధిలో వైద్యులు భాగస్వామ్యం కావాలి ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



సిద్ధార్థ అకాడమి ప్రతినిధులతో కలసి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

**గన్నవరం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** దైవం మనిషికి ప్రాణం పోస్తే ఆ వ్యక్తి ప్రాణం పోకుండా కాపాడి మరో జీవితాన్ని ఇచ్చే శక్తి వైద్యులకు మాత్రమే ఉందని, అందుకే వైద్యులను దైవంగా భావిస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో వారం పాటు జరిగే ఆరోగ్య అవగాహన ప్రదర్శనను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ వైద్యులు కేవలం డబ్బు సంపాదన కోసమే కాకుండా మానసిక తృప్తి కోసం పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. ఎంతోమంది వైద్యులు పేద రోగులకు ఉచితంగా వైద్య సాయం చేస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఇక్కడ చదువుతున్న వైద్య విద్యార్థులు ప్రపంచంలో మేటి రాజధానిగా నిలవబోతున్న అమరావతి ప్రాంతంలో వైద్యశాలలు ఏర్పాటు చేసి అమరావతిని మెడికల్ హబ్‌గా మార్చే ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 50 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సిద్ధార్థ అకాడమీ లాభాపేక్ష లేకుండా నేడు 18 విద్యాసంస్థలతో, ఏటా 26వేల మంది విద్యార్థులకు విద్యను అందించటం అభినందనీయమన్నారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య మాట్లాడుతూ యార్లగడ్డను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కోశాధికారి సూర్నెడ్డి వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ బీ అనిల్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కే కల్యాణి, డాక్టర్ సూరపనేని రాజగోపాల్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి ఆసాంతం తిలకించిన యార్లగడ్డ ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### దంత వైద్య కళాశాలలో..

డాక్టర్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య అవగాహన ప్రదర్శన ప్రారంభించారు. దంత వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, హెచ్‌వోడీలు స్టాల్స్ గురించి వివరించారు. అకాడమిలో 50ఏళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్న వై మధుసూదనరావును దుశ్శాలువ, పూలబొకేతో ఘనంగా సత్కరించారు.

నగరంలోని ఓ జంటకు పెళ్లయి ఆరేళ్లు గడిచినా సంతానం కలగలేదు. వారు తిరగని గుడి, మొక్కని దేవుడు లేడు. అయినా ఫలితం లేకపోవడంతో చివరి ప్రయత్నంగా నగరంలోని ఓ ఫెర్టిలిటీ కేంద్రాన్ని ఆశ్రయించారు. ఏడాది కాలం పరీక్షలు, మందుల పేరుతో లక్షల్లో డబ్బు వసూలు చేసినా, పిల్లలు పుట్టే అవకాశం లేదని తేల్చడంతో ఆ జంట నిరాశలో మునిగారు.

మరో జంటకు పెళ్లయి 14 ఏళ్లు అవుతుంది. భర్త ఓ కంపెనీలో ఉద్యోగి, భార్య గృహిణి. మొదటి రెండేళ్లు సంతానం వద్దనుకున్నారు. తరువాత గుడులు, బాబాలు, ఆసుపత్రులు ఇలా అన్నీ ప్రయత్నించారు. చివరకు ఓ ఐవీఎఫ్ కేంద్రాన్ని సంప్రదించారు. 15 నెలలు జాగ్రత్తలు తీసుకుని, రూ.16 లక్షలు ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో, సంతానం కలిగే అవకాశం లేదని కేంద్రం తేల్చడంతో మోసపోయామని గ్రహించారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

# నవ జంటల్లో సంతాన శూన్యత..!

ఫెర్టిలిటీలకు పరుగులు పెడుతున్న జంటలు ● రూ.లక్షల్లో దోచుకుంటున్న కేంద్రాలు



నగరంలోని అనేక ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలు సంతానలేమి ఉన్న జంటల అవసరాన్ని ఆసరాగా తీసుకుని లక్షల్లో డబ్బు వసూలు చేస్తున్నాయి. 35 ఏళ్లు దాటాక పెళ్లి చేసుకున్నవారిలో సంతానలేమి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పురుషుల్లో ఒత్తిడి, అనారోగ్యం, వృషణ సమస్యలు, అధిక వేడి చేసే వృత్తుల వల్ల వీర్యం పలుచబడుతోంది. మహిళల్లో 35 ఏళ్ల తర్వాత అండం అభివృద్ధి తగ్గుతుంది, 40 ఏళ్లకు సంతానం కలిగే అవకాశం దాదాపు లేకుండా పోతుంది. జంక్‌ఫుడ్ వల్ల మహిళల్లో సంతానలేమి సమస్యలు పెరుగుతున్నాయి. ఒబెసిటీ, పాలిసెస్టిక్ ఒవేరియన్ డిసీజ్ వంటివి అండం విడుదలను అడ్డుకుంటాయి. వీధి ఆహారాలు హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తాయి. ఫెర్టిలిటీ కేంద్రాలు రెండు మూడు పరీక్షలతో సంతానం కలిగే అవకాశాన్ని తెలుసుకోగలవు, కానీ కొన్ని కేంద్రాలు ఈ విషయాన్ని దాచి, అనవసర పరీక్షలతో లక్షలు వసూలు చేస్తాయి. ఫెర్టిలిటీ కేంద్రాలు రెండు రకాలు. లెవెల్-1 కేంద్రాలు శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇంజక్షన్ ద్వారా గర్భం దాల్చేలా చేస్తాయి. ఇది తక్కువ ఖర్చుతో కూడుకున్నది. లెవెల్-2 కేంద్రాలు పిండాన్ని అభివృద్ధి చేసి, అద్దె గర్భాశయంలో ఉంచుతాయి. ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.

జీజీహెచ్‌లోని గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జీ కేశవచంద్ర మాట్లాడుతూ లేటు వయస్సు పెళ్లిళ్లు, జంక్‌ఫుడ్, శారీరక శ్రమ లేమి వల్ల హార్మోన్ల మార్పులు సంతానలేమికి కారణమవుతాయని చెబుతున్నారు. ఫెర్టిలిటీ కేంద్రాలను ఆశ్రయించేవారు ముందుగా వాటి చరిత్ర, ప్రక్రియ వ్యవధి తెలుసుకోవాలి. కొన్ని కేంద్రాలు పరీక్షల పేరుతో కాలయాపన చేస్తూ డబ్బు దోచుకుంటాయి. దీనివల్ల జంటలు నిరాశకు, ఆర్థిక నష్టానికి గురవుతారని ఆయన పేర్కొన్నారు.

## దొంగను పక్కన బెట్టి.. బాధితులపై అనుమానం

● చివరకు దొరికిన వింత దొంగ

● పోలీసుల తీరుతో బిత్తరబోయిన బాధితులు

**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** వీడో వింత దొంగ. వాడే ఇళ్లకు కన్నం వేస్తాడు. విచారణకు వచ్చిన పోలీసుల వెంట కలిసి తిరుగుతాడు. వారికి మంచి మర్యాదలు చూస్తాడు. పోలీసులు బాధితులనే అనుమానించేలా వారిని మభ్య పెడతాడు. ఈ వింత దొంగను చివరకు ఓ సీసీ కెమెరా పట్టించింది. ఈ వింత దొంగ వివరాలిలా ఉన్నాయి. కొండపల్లి శాంతినగర్‌కు చెందిన ఓ వ్యక్తి విలాసవంతమైన జీవితానికి అలవాడు పడి, చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు ప్రారంభించాడు. గత ఏడాది తనుండే ప్రాంతంలోనే దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదుతో విచారణకు వచ్చిన పోలీసులతో పరిచయాలు పెంచుకొని కలివిడిగా తిరగాడు. ఈ కేసులో దొరకపోవడంతో అదే రీతిలో దొంగతనాలు ప్రారంభించాడు. గత నెల 30న కోడె తేజ ఇంట్లో ప్రవేశించిన దొంగ ఆ ఇంట్లోని 65 కాసుల బంగారం, 1.5 కిలోల వెండి, రూ.80 వేల నగదును అపహరించాడు. తేజ ఇంటి వెనుకున్న సీసీ కెమెరాను చూసి పని చేయడం లేదనుకొని జారుకున్నాడు. షిరిడీ యాత్ర నుంచి వచ్చిన తేజ ఇంట్లో చోరీ విషయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణకు వచ్చిన పోలీసులతో ఎవరైతే దొంగతనం చేశాడో అతడే కలిసి తిరగడం, మంచి చెడ్డ చూడటం ప్రారంభించాడు. పైగా ఏం ఎరగనట్టు బాధితుల పైనే అనుమానం వచ్చేలా మాట్లాడి మభ్య పెట్టాడు. బాధితుడి స్వగ్రామం కవులూరు అని అతడే తమ బంధువుల ఇళ్లలో దాచిపెట్టి ఉంటాడని దొంగ పోలీసులకు చెప్పడంతో పోలీసులు నమ్మడం శోచనీయం. పోలీసులు సైతం దొంగకు వంత పాడుతూ బాధితుల కాల్ లిస్టు పరిశీలించడం వివాదాస్పదం అయింది. బాధితుడి ఇంటి వెనుక ఉన్న సీసీ కెమెరాను పరిశీలించిన పోలీసులకు దిమ్మ తిరిగిపోయింది. ఇప్పటి వరకు దొంగను పక్కన పెట్టుకొని బాధితులను అనుమానించామని నాలుక్కరుచుకొని దొంగను అతడికి సహకరించిన వారిని పట్టుకొని విజయవాడ కార్యాలయానికి తరలించారు. తమదైన శైలిలో విచారించిన పోలీసులకు వారి వద్ద నుంచి కొంత బంగారం, నగదు రికవరీ చేసినట్టు తెలిసింది.

# అర్జీదారులతో మర్యాదగా ప్రవర్తించండి: కలెక్టర్

**విజయవాడ సిటీ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను నిర్దిత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ లక్ష్మీశ ఉన్నతాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశపు మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటి పురోగతిపై ఆయా శాఖల అధికారుతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ పోర్టల్‌లో లాగిన్ అయి, ప్రజలిచ్చిన అర్జీలను చూడాలని, రీ ఓపెన్ కేసులపై పూర్తిగా విచారణ జరిపాలన్నారు. అర్జీదారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ, సవివరమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు.

విజయవాడ రూరల్ మండలంలోని నిడమానూరులో ఖాళీగా ఉండి బీడు పట్టిన 39.16 ఎకరాల వక్ఫ్ భూమికి వేలం నిర్వహించి ఉపయోగంలోకి తేవాలని 14 మంది ముస్లింలు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. కొత్తూరు తాడేపల్లిలోని అటవీ భూముల సాగుకు అనుమతివ్వాలని కోరుతూ 11 మంది ఎస్టీలు అర్జీ ఇచ్చారు. ఆశా వర్కర్లను సీనియారిటీ ప్రకారం సర్దుబాటు చేయాలని కోరుతూ ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ కార్యదర్శి ఏ కమల ఆధ్వర్యంలో పలువురు ఆశా వర్కర్లు అర్జీ ఇచ్చారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెం - గంగాదేవిపాడు గ్రామాల మధ్యలోని డొంక రోడ్డును ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 15 మంది రైతులు అర్జీ ఇచ్చారు. రెవెన్యూ శాఖకు 32, పోలీస్ 23, విద్య 21, ఎంఏయూడీకి 14, పంచాయతీ రాజ్‌కు 11, వైద్యారోగ్యకు 9, సోషల్ వెల్ఫేర్‌కు 6, ఏపీసీపీడీసీఎల్‌కు 3, డిజేబుల్డ్ వెల్ఫేర్‌కు 3, ఎంప్లాయిమెంట్‌కు 3, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌కు 3, సివిల్ సప్లైకి రెండు, ఇరిగేషన్‌కు రెండు, మార్కెటింగ్‌కు రెండు, ట్రైబల్‌కి రెండు, వ్యవసాయ, ఏపీఎస్ఆర్టీసీ, డీఆర్‌డీఏ, మైనార్టీ వెల్ఫేర్, ఆర్‌డబ్ల్యూఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సర్వే, నీటి పారుదల శాఖకు ఒక్కోటి చొప్పున అర్జీలు అందాయి. జేసీ ఇలక్కియా పాల్గొన్నారు.

రైల్వే అదనపు జీఎంగా

## సత్యప్రకాష్ బాధ్యతల స్వీకరణ



**రైల్వేస్టేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్‌గా సోమవారం సత్యప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. రైల్వేలో ఇంజనీరింగ్ సేవ విభాగానికి చెందిన సత్యప్రకాష్ సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇంతకుముందు ఆయన నిర్మాణపు పనుల ముఖ్య పరిపాలన అధికారిగా పనిచేశారు. సివిల్ ఇంజనీరింగ్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి పట్టా పొందిన ఆయన 35 ఏళ్లుగా రైల్వేలోని అనేక విభాగాల్లో ముఖ్యమైన పదవుల్లో పనిచేశారు. పశ్చిమ రైల్వే సురేంద్రనగర్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగాన్ని ప్రారంభించిన సత్యప్రకాష్ నార్త్ సెంట్రల్ రైల్వేలోనూ సేవలందించారు. అలహాబాద్‌లోని సెంట్రల్ ఆర్గనైజేషన్ ఫర్ రైల్వే ఎలక్ట్రిఫికేషన్ (కోర్)కు ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్‌గా, పూణేలోని ఇండియన్ రైల్వే ఇనిస్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్ డీన్‌గానూ సేవలందించారు. సింగపూర్, మలేషియాలో శిక్షణ పొందారు. అలహాబాద్‌లో పనిచేస్తున్నప్పుడు రైల్వే మంత్రి అవార్డును అందుకున్నారు. గడ్డర్ వంతెనలపై లాంగ్ వెల్డ్ రైళ్లు అనే అంశం పైన 3 పరిశోధన సాంకేతిక పత్రాలను ప్రచురించారు.



ఎమ్మెల్సీ ఆలపాటికి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నేతలు

## ప్రభుత్వ దృష్టికి ఉపాధ్యాయుల ఆందోళనలు

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**గవర్నర్‌పేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనలు, అశాంతి తప్పనిసరిగా ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళతానని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక డెమొక్రటిక్ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆలపాటి మాట్లాడుతూ ఉపాధ్యాయుల మనోభావాలకు ప్రాధాన్యత ఇచ్చి ఎస్‌జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్‌కు మంత్రిని ఒప్పించగలిగామన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీ శ్రీను మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు ఇప్పించేలా కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. ఈ సందర్భంగా సమస్యలపై తయారు చేసిన వినతిపత్రాన్ని ఎమ్మెల్సీకి అందజేశారు. నేతలు పెరుమాళ్లు, నున్న రాంబాబు, పీ నాగరాజు, కోట సుందరరావు, ఏ శ్రీనివాస్, ఈ వెంకటరెడ్డి, అక్బర్ పాషా, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

## మెప్మా-బెస్ట్ మార్ట్ మధ్య ఎంవోయూ


**గాంధీనగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), బెస్ట్ మార్ట్ ఆన్‌లైన్ సర్వీస్ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం గాంధీనగర్‌లోని ఓ ప్రముఖ హోటల్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ మాట్లాడుతూ పట్టణాల్లో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రైవేట్ సంస్థల పాత్ర కీలకమన్నారు. బెస్ట్ మార్ట్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్ వల్ల స్థానిక యువత, మహిళ సంఘాలు, చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఈ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణ ప్రాంతాల్లోని పేదలు, మహిళల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఈ ఒప్పందం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బెస్ట్‌మార్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ ఒప్పందంతో ఎస్‌హెచ్‌జీ ఉత్పతులకు ఉచిత డిజిటల్ ప్రొఫైల్, మార్కెటింగ్ మద్దతు, స్థానికంగా అమ్మకాలు జరిగేలా ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు.

## ప్రజాసమస్యలను పరిష్కరించండి: డీఆర్వో



ప్రజలనుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

**మచిలీపట్నం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీకోసం)లో వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను పరిశీలించి, పరిష్కరించాలని డీఆర్వో కే చంద్రశేఖరరావు అధికారులను ఆదేశించారు. మీకోసంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో అధికారులతో కలిసి ఆయన ప్రజల నుంచి 152 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇచ్చిన అర్జీలు ఎంతమేర పరిష్కారానికి నోచుకుంటున్నాయనే అంశంపై సీఎంవో నిత్యం ఆరా తీస్తోందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలిచ్చిన అర్జీల్లోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. డ్వామా, డీపీవో, ఆర్‌డీవో, వైద్యశాఖ కార్యాలయాలు ఈ ప్రక్రియలో ముందంజలో ఉన్నట్టు తెలిపారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలను కేంద్రప్రభుత్వం ప్రోత్సాహిస్తోందని, వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులు, అధికారులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను నిర్దేశించిన ఫార్మాట్‌లో నివేదికలు పంపాలన్నారు. ఈ సందర్భంగా ఈనెల 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలనకు సంబంధించి అవగాహన పోస్టర్ అధికారులు ఆవిష్కరించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాత్రి పూట రోడ్డు పక్కన మట్టి తొలగించిన ప్రదేశం, మట్టి తోలకానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

## నందివాడలో అక్రమంగా మట్టి తోలకాలు

**నందివాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):** సుమారు 10 ట్రాక్టర్లతో నందివాడలోని ఏలూరు డొంక రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో జేసీబీతో సుమారు 150 ట్రక్కుల వరకు నందివాడ తరలించినట్టు పెయ్యేల జోసఫ్, కళ్లెంపూడి పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఆదివారం రాత్రి 12 గంటలు దాటాక ఒక జేసీబీ, 10 ట్రాక్టర్లతో నందివాడ పరిధిలోని మా చెరువు పక్కన గొయ్యి పెట్టి మట్టి తోలికెళ్లారన్నారు. తమకు రాత్రి నిద్రపోతున్న సమయంలో తెలియలేదు. ఉదయం చెరువు వద్దకు వెళ్లి చూడగా, చెరువు బారు రోడ్డు పక్కనే మట్టి తోలికెళ్లినట్టు ఉంది. వెంటనే 112కు ఫోన్ చేశామన్నారు. అసలే మట్టి లేక నానా అవస్థలు పడుతుంటే చెరువుకు తన్నుడుగా పోసుకున్న మట్టిని అర్ధరాత్రులు తొలగించటం ఎంతవరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నందివాడ తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు కూడా చేశామన్నారు. రాత్రుల పూట అక్రమంగా మట్టి తోలకాలు జరిపిన వ్యక్తులను పట్టుకుని తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై ఆర్ఐ గణేష్‌ను వివరణ కోరగా, మాకు జోషఫ్ పద్మావతి ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనన్నారు. నేను మా సిబ్బందితో వెళ్లి మట్టి తోలకాలు ప్రదేశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇన్‌సొమ్నియా





# నిద్రలేమి వెంటాడుతోందా...

**కంటినిండా నిద్ర లోపిస్తే, మరుసటి రోజంతా హుషారు తగ్గుతుంది. ఆలోచనల్లో స్పష్టత లోపిస్తుంది. రోజంతా డీలాగా గడుస్తుంది. ఇదే పరిస్థితి దీర్ఘకాలం కొనసాగితే, అంతిమంగా ఆరోగ్యం కుంటుపడుతుంది. కాబట్టి ఈ సమస్య మూలాలను వెతికి వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలంటున్నారు వైద్యులు.**

కొందరికి నిద్ర పట్టడంలో ఇబ్బంది ఉంటుంది. ఇంకొందరికి పట్టిన నిద్రను కొనసాగించడంలో ఇబ్బంది ఉంటుంది. ఈ పరిస్థితి దైనందిన జీవితాన్ని ఇబ్బంది పెడుతుంటే, దాన్ని నిద్రలేమిగా భావించాలి. ఎప్పుడైనా అరుదుగా ఒకట్రెండు రోజుల పాటు ఈ సమస్య వేధిస్తే ఫరవాలేదు. కానీ వారాలు, నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగితే పరిస్థితిని తీవ్రంగానే పరిగణించాలి. అయితే ఆత్మీయుల మరణం, తరచూ చేసే ప్రయాణాల మూలంగా నిద్రవేళలు మారడం వల్ల కొంత కాలం పాటు నిద్రలేమి వేధిస్తే, పరిస్థితులు అనుకూలించిన తర్వాత పరిస్థితి కూడా సర్దుకుంటుంది. కొందరికి స్వల్పకాలిక మాత్రలు అవసరవుతాయి. ఇలా కాకుండా వారాలు, నెలల తరబడి నిద్రలేమి వేధిస్తున్నా, దాన్ని సాధారణమైన విషయంగానే భావిస్తూ, రాత్రంతా మేలుకుంటూ ఉండిపోయే వాళ్లుంటారు. ఫలితంగా కుటుంబ అనుబంధాలు, పని నైపుణ్యాలు దెబ్బతిని అంతిమంగా వైద్యులను కలుస్తూ ఉంటారు. తీవ్రమైన నిద్రలేమి కలిగిన ఈ కోవకు చెందిన వాళ్లలో సమస్యను సరిదిద్దడం కొంత క్లిష్టం. వీళ్లలో నిద్రలేమిని ట్రిగ్గర్ చేసిన అంశాన్ని కనిపెట్టి, ఆ అంశం ఇప్పటికీ ప్రభావం కనబరుస్తూనే ఉందా? అన్నది గమనించాలి. ఉదాహరణకు కొందరు, ధూమపానం లేదా మద్యపానం అలవాటు చేసుకుంటారు. దాంతో మొదలయ్యే నిద్రలేమి, ఆ అలవాట్లతో పాటు అంతకంతకూ కొనసాగుతూనే ఉంటుంది. ఇలాంటి అంశాలను కనిపెట్టి, క్రమేపీ వాటిని దూరం చేయవలసి ఉంటుంది.

### కారణాలను సరిదిద్ది...

సాధారణంగా నిద్రలేమిని ఎవరూ అంత తీవ్రంగా పరిగణించరు. కానీ ఈ సమస్యతో తీవ్రమైన పరిణామాలు ఎదురవుతాయి. చికాకు, వ్యక్తిత్వ సమస్యలు, సామర్థ్యం, జ్ఞాపకశక్తి తగ్గడం లాంటి సమస్యలు పెరుగుతాయి. నిద్రలేమితో బాధపడేవారు అతి త్వరగా అల్జీమర్స్‌కు లోనయ్యే అవకాశాలు కూడా ఎక్కువే! నిద్రలేమితో పెరిగే రక్తపోటు, అదుపు తప్పే మధుమేహం ఫలితంగా గుండెజబ్బుల బారిన పడే సమస్య కూడా పెరుగుతుంది. కాబట్టి నిద్రలేమి సమస్యను గుర్తించినప్పుడు, సరిదిద్దే వీలున్న కారణాలను కనిపెట్టే ప్రయత్నాలు మొదలుపెట్టాలి. శ్వాసనాళాన్ని ఇరుకుగా మార్చే అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా ఉంటే, ఆ సమస్యను సరిదిద్దుకోవాలి. అలాగే రక్తపరీక్షతో



శరీరంలోని పోషక లోపాలు, హార్మోన్ అవకతవకలను కనిపెట్టి, వాటిని సరిదిద్దుకోవాలి. అలాగే మానసిక సమస్యలతో నిద్రలేమికి గురవుతూ ఉంటే, మానసిక వైద్యుల సహాయంతో వాటి నుంచి బయటపడాలి. నొప్పుల వల్ల నిద్రలేమి వేధిస్తుంటే, వాటిని చికిత్సతో తగ్గించుకోవాలి. కొన్ని సందర్భాల్లో నిద్రలేమికి ఇవేమీ కారణం కాకపోవచ్చు. కొందరు నిద్రలేమికి గురయ్యే తత్వాన్ని కూడా కలిగి ఉండొచ్చు.

### స్లీప్ డైరీతో...

నిద్రలేమి సమస్యను కచ్చితంగా అంచనా వేయడం కోసం, నిద్ర నాణ్యతను కనిపెట్టడం కోసం స్లీప్ డైరీ రాసుకోవాలి. ఏ సమయానికి నిద్రకు ఉపక్రమించారు? పడక మీద పడుకున్న తర్వాత ఎంత సేపటికి నిద్రలోకి జారుకుంటున్నారు? ఎన్నిసార్లు నిద్రాభంగం కలుగుతోంది? అనే వివరాలతో పాటు రోజులో తాగే కాఫీ, సిగరెట్ల వివరాలు, మద్యం వివరాలు కూడా డైరీలో రాసుకుని వైద్యులకు చూపించాలి. వీటి ఆధారంగా నిద్రలేమి తీవ్రత, కారణాలను వైద్యులు గ్రహించి నిద్రకు అడ్డుపడే అంశాలను కనిపెట్టి వాటికి దూరంగా ఉండమని సూచిస్తారు. ఆ అంశాలు ఏవంటే...

- నిద్రకు ముందు కాఫీ తాగే అలవాటు మానుకోవాలి
- మద్యం, ధూమపానాలు మానేయాలి
- వ్యాయామానికీ నిద్రకు మధ్య మూడు నుంచి నాలుగు గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి
- నిద్రకు మూడు నుంచి నాలుగు గంటల ముందే భోజనం ముగించాలి
- నిద్రకు రెండు గంటల ముందు నుంచే మొబైల్, టివి స్క్రీన్స్‌కు దూరం పాటించాలి
- కొన్నిసార్లు ఒక గదిలో నిద్ర పట్టకుండా, మరొక గదిలో నిద్ర పడుతూ ఉండొచ్చు. అలాంటప్పుడు నిద్ర పట్టే గదినే నిద్రకు కేటాయించాలి
- పడకను నిద్రకు తప్ప ఆఫీసు పనులకు ఉపయోగించకూడదు
- నిద్ర పట్టనప్పుడు బలవంతంగా నిద్రపోయే ప్రయత్నం చేయకుండా, హాల్‌లో కూర్చుని పుస్తకం చదవాలి
- గది ఉష్ణోగ్రత, 24 నుంచి 25 డిగ్రీల మధ్య ఉండాలి
- నిద్రవేళలు క్రమం తప్పకుండా పాటించాలి

> **ఆధునిక ఔషధాలున్నాయి**
>
> నిద్రకు తోడ్పడే మెలటోనిన్ హార్మోన్ ఆధారిత మాత్రలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. వీటితో పాటు అలవాటు పడే వీల్లేని, లెంబారెక్సెంట్ అనే నిద్ర మాత్రలు కూడా ఇప్పుడు దొరుకుతున్నాయి. అలాగే నిద్ర రావడం కోసం 'స్లీప్ ఆన్‌సెట్ ఇన్‌సోమ్నియా' మందులున్నాయి. పట్టిన నిద్ర కొనసాగడం కోసం 'స్లీప్ మెయింటెనెన్స్ ఇన్‌సోమ్నియా', తెల్లవారుఝామున మూడు గంటలకు మెలకువ వచ్చే వారికి 'ఎర్లీ మార్నింగ్ అవేకెనింగ్ ప్రివెన్షన్' మందులు అందుబాటులో ఉన్నాయి.

### థెరపీ ప్రయోజనం

కొందర్లో చిన్ననాటి చేదు జ్ఞాపకాల వల్ల, ఆత్మీయుల మరణం వల్ల నిద్రలేమి వేధించవచ్చు. ఇలాంటి వారికి కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ ఎంతో బాగా తోడ్పడుతుంది. కౌన్సెలింగ్ ఆధారంగా సాగే ఈ థెరపీలో ప్రతికూల పరిస్థితుల వ్యవహరించే నైపుణ్యాలను నేర్పిస్తారు. గతంలో కూరుకుపోయి, దిగులు పడుతూ కూర్చోవడం వల్ల ప్రయోజనం లేదనీ, సమస్యను పరిష్కరించుకుని ముందుకు సాగాలనీ మానసిక వైద్యులు సూచిస్తారు. అలాగే జీవగడియారాన్ని గాడిలో పెట్టడం ద్వారా నిద్రలేమిని తొలగించడానికి లైట్ థెరపీని కూడా అనుసరించవచ్చు.

### నిద్రమాత్రలు చివరి ప్రత్యామ్నాయం

నిద్రలేమిని పరిష్కరించే అన్ని ప్రయత్నాలు విఫలమైనప్పుడు, వైద్యులు అంతిమంగా నిద్ర మాత్రలు సూచిస్తారు. ఇలాంటి నిద్రమాత్రలను ఇష్టారాజ్యంగా కొనుక్కుని వాడుకోవడం వల్ల వాటికి అలవాటుపడే ప్రమాదం ఉంటుంది. ఒక స్థాయికి చేరుకున్న తర్వాత ఎంత మోతాదు మాత్రలు తీసుకున్నా నిద్రరాని పరిస్థితి తలెత్తుతుంది. ఈ స్థితికి చేరుకున్న వ్యక్తి నిద్రలేమి సమస్యను పరిష్కరించడం వైద్యులకు ఎంతో క్లిష్టంగా మారుతుంది. కాబట్టి ఎవరికి వారు నిద్రమాత్రలు కొనుక్కుని వాడుకోకూడదు. నిజానికి నిద్రమాత్రలతో నిద్రపోయే సమయం పెరుగుతుందే తప్ప నిద్ర నాణ్యత పెరగదు. కాబట్టి వైద్యులు సూచించే దుష్ప్రభావాలు లేని సమర్థమైన నిద్రమాత్రలనే వాడుకోవాలి.


**డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్**
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మొనాలజిస్ట్ అండ్ స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ,
హైదరాబాద్




**తల్లి పాలు బిడ్డ ఆకలి తీర్చడమే కాదు, అంతకు మించిన ప్రయోజనాలను కూడా కలిగి ఉంటాయి. బిడ్డ ఆరోగ్యానికి రక్షణ కల్పించడంతో పాటు, పోషక అవసరతలకు తగినట్టు మార్పులకు గురవుతూ ఉంటాయి. బిడ్డకు తల్లి నుంచి అందే అమూల్యమైన ఆ పాలామృతం గురించీ, వాటిని నిల్వ చేసుకునే మెలకువల గురించీ వైద్యులు ఏమంటున్నారో తెలుసుకుందాం!**

# తల్లి పాలామృతం

కొందరు పిల్లలు నెలలు నిండకుండా పుడతారు. ఇంకొందరు పిల్లలు నలతను వెంట తెచ్చుకుంటారు. ఈ రెండు కోవలకు చెందిన పిల్లల పోషక అవసరతలు భిన్నంగా ఉంటాయి. ఈ అవసరతలకు తగినట్టే తల్లుల్లో పాలు ఉత్పత్తి అవుతూ ఉంటాయి. ఏ ఇద్దరు తల్లుల పాలూ ఒకేలా ఉండవు. అలాగే ఒకే తల్లి పాలు కూడా ఎప్పుడూ ఒకేలా ఉండవు. బిడ్డకు ఎప్పుడు ఎలాంటి పోషకాలు అవసరమో వాటిని సమయానికి అందించేలా చనుబాలు తయారవుతూ ఉంటాయి. వినడానికి వింతగా అనిపించినా ఇదే నిజం. అలాగే పిల్లలకు పాలిచ్చే ప్రతిసారీ, వారికి పాల పట్ల ఇష్టం పెరగడం కోసం, మొదట నీరు, చక్కెర ఎక్కువగా కలిగి ఉండే తీయని పాలు, ఆ తర్వాత కొవ్వుతో కూడిన బలవర్థకమైన పాలు రొమ్ములు నుంచి వెలువడతాయి. ఇలా తల్లిపాలు అద్భుతమైన స్వభావాలు, ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కాబట్టి అమూల్యమైన తల్లిపాలను బిడ్డకు పరిపూర్ణంగా అందించడం తల్లులు బాధ్యతగా భావించాలి. మరీ ముఖ్యంగా పాలు పట్టించే విధానం, నిల్వ చేసుకునే తీరుల పట్ల అవగాహన పెంచుకోవాలి.

**ఆగష్టు 1 - 7, తల్లి పాల వారోత్సవం**

### ఇలా సేకరించాలి

పాలు సేకరించడానికి మ్యాన్యువల్, మెషీన్ పంప్‌లు, ఎలక్ట్రిక్ పంపులు లాంటివి అందుబాటులో ఉన్నప్పటికీ, చేతులతోనే పాలను సేకరించడం అత్యుత్తమం. అలాగే పాలు సేకరించే పాత్రను సబ్బు నీళ్లతో కడిగి, కొన్ని నిమిషాల పాటు మరిగించిన నీళ్లు నింపి ఉంచి, తర్వాత వాటిని పారేసి, తడి ఆరే వరకూ పాత్రను బోర్లా ఉండి, ఆ తర్వాతే వాడుకోవాలి. పాల సేకరణకు వెడల్పాటి గిన్నె ఉపయోగించాలి. బ్రెస్ట్ మిల్క్ స్టోరేజీ బ్యాగ్స్, లేదా పాలీప్రొపిలీన్ ప్లాస్టిక్, గాజు పాత్రలు పాల నిల్వకు సురక్షితమైనవి. స్వల్ప కాలిక నిల్వ కోసం స్టీలు పాత్రలు కూడా వాడుకోవచ్చు. గది ఉష్ణోగ్రత దగ్గర 6 నుంచి 8 గంటల పాటు పాలు నిల్వ ఉంటాయి. అంతకు మించి ఎక్కువ కాలం నిల్వ చేసుకోవాలనుకుంటే అందుకోసం ఫ్రిజ్ వాడుకోవాలి.



- మైనస్ 4 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగి ఉండే రెఫ్రిజిరేటర్ డోర్‌లో 72 గంటల పాటు నిల్వ చేసుకోవచ్చు
- ఫ్రీజర్ కంపార్ట్‌మెంట్‌లో నిల్వ చేసుకున్న పాలు, మరుసటి రోజుకు ఉపయోగించుకోవాలనుకుంటే రెఫ్రిజిరేటర్ డోర్‌లోకి మార్చుకోవాలి. ఆ తర్వాత అవసరమైనప్పుడు బయటకు తీసి గది ఉష్ణోగ్రతకు చేరుకున్న తర్వాత బిడ్డకు పట్టించాలి
- వృథాను అరికట్టడం కోసం 60 నుంచి 120 మిల్లీలీటర్ల స్టోరేజీ బ్యాగులనే ఎంచుకోవాలి
- తల్లి పాలను స్టవ్ మీద వేడి చేయకూడదు, మైక్రోవేవ్‌లో వేడి చేయకూడదు
- ఫ్రిజ్ నుంచి బయటకు తీసిన పాలు సహజసిద్ధంగానే ఆగాలి. లేదా గది ఉష్ణోగ్రతకు చేరుకునే వరకూ పాల సీసా, లేదా పాల బ్యాగ్‌ను ధారగా కారే నీళ్ల కింద ఉంచాలి.

> **అపోహలు - వాస్తవాలు**
>
> - రొమ్ములు చిన్నవిగా ఉంటే పాలు రావు అన్నది పూర్తిగా అపోహే! రొమ్ముల పరిమాణం దాన్లోని కొవ్వు కణజాలం మీదే ఆధారపడి ఉంటుంది. పాలకూ కొవ్వుకూ సంబంధం ఉండదు. ప్రతి రొమ్ములో పాల ఉత్పత్తి కణాలు ఒకే మోతాదులో ఉంటా యి. కాబట్టి తల్లి ఎత్తుగా ఉన్నా, కురచగా ఉన్నా, రొమ్ములు చిన్నవిగా ఉన్నా, పెద్దవిగా ఉన్నా పాల ఉత్పత్తికి ఢోకా ఉండదు.
> - రొమ్ము పాలతో రొమ్ములు సాగిపోతాయన్నది కూడా అపోహే! గర్భం, బరువు పెరగడం, వయసు.. ఇవన్నీ రొమ్ముల ఆకారం, బిగుతుల మీద ప్రభావం చూపిస్తాయి. కేవలం బ్రెస్ట్ ఫీడింగ్ వల్ల రొమ్ములు సాగిపోతాయని అనుకోవడం అపోహ. పాలిచ్చేటప్పుడు సరైన బ్రెస్ట్ సపోర్ట్ బ్రా వేసుకుంటే, రొమ్ములకు అదనపు ఆసరా దక్కుతుంది.
> - పాలు తాగించే ప్రతిసారీ చనుమొనలను కడుక్కోవలసిన అవసరం లేదు. స్నానం చేసే సమయంలో శుభ్రపరుచుకుంటే సరిపోతుంది.
> - పాలతో తల్లి తీసుకునే మందుల ప్రభావం బిడ్డకు చేరదు. కాబట్టి వైద్యులు సూచించినప్పుడు మినహా దగ్గు, జలుబు, జ్వరం లాంటి సాధారణ మందులు వేసుకున్నప్పటికీ నిశ్చింతగా బిడ్డకు పాలివ్వవచ్చు.


**డాక్టర్ సింధూర మునుకుంట్ల**
పిడియాట్రీషియన్,
బిపిఎన్ఐ సర్టిఫైడ్ లాక్టేషన్ స్పెషలిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్,
హైదరాబాద్




తెలుసుకుందాం

# మెగ్నీషియం మతలబు ఇదే

కండరాల పటుత్వాన్ని పెంచే పోషకంగా మెగ్నీషియంను పరిగణిస్తూ ఉంటాం. అయితే ఈ మూలకానికి మానసిక కుంగుబాటును దూరం చేసే ప్రభావం కూడా ఉంటుందని తాజా అధ్యయనాల్లో వెల్లడైంది.


సాధారణంగా మానసిక కుంగుబాటుకు గురైన వారు చికిత్స కోసం మానసిక వైద్యులను ఆశ్రయిస్తూ ఉంటారు. అయితే కొందరికి ఇలాంటి సంప్రదాయ చికిత్సలు ఫలితాన్ని ఇవ్వకపోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో గ్లైసినేట్ లేదా థ్రియోనేట్ రూపాల్లోని మెగ్నీషియం ఎంతో అక్కరకొస్తుందని వైద్యపరమైన ప్రయోగాల్లో వెల్లడైంది. ఆందోళన, ఒత్తిడులను తగ్గించి, నిద్ర నాణ్యతను పెంచే శక్తి మెగ్నీషియంకు ఉంటుందనీ, సంప్రదాయ యాంటీడిప్రెసెంట్లు పని చేయని సందర్భాల్లో, మెగ్నీషియంను ఆశ్రయించవచ్చనీ పరిశోధకులు సూచిస్తున్నారు. మానసిక కుంగుబాటుకు మెదడులోని రసాయన మార్పులు కూడా ఒక కారణమే! ఇలాంటి సందర్భాల్లో మెదడులోని రిసెప్టార్లు ఎక్సైటోటాక్సిసిటీ అనే ప్రక్రియలో భాగంగా ప్రమాదకరమైన స్థాయిలో అతిగా స్పందిస్తూ ఉంటాయి. ఇలాంటి రోగులు మెగ్నీషియం తీసుకున్నప్పుడు, అది నాడీకణాలకు రక్షణ కవచంగా మారి రసాయన ప్రభావాలను అడ్డుకుని నాడీ కణాలు అతిగా స్పందించే ప్రక్రియ నెమ్మదిస్తుంది. అయితే మన శరీరాల్లో సహజసిద్ధంగా మెగ్నీషియం ఉంటున్నప్పుడు, ఇలాంటి పరిస్థితి ఎందుకు తలెత్తుతోంది? అనే అనుమానం రావచ్చు. నిజానికి మన ఆధునిక ఆహారపుటలవాట్లే మెగ్నీషియం లోపానికి ప్రధాన కారణమని వైద్యులంటున్నారు. ప్రాసెస్ చేసిన పదార్థాలు, ఫిల్టర్ చేసిన నీళ్లు మనలో మెగ్నీషియం లోపానికి దోహద పడుతున్నాయి. ఫలితంగా మెదడు ప్రభావితమవుతూ మానసిక కుంగుబాటు, నాడీకణాల క్షీణత లాంటి రుగ్మతలు పెరుగుతున్నాయి. కాబట్టి సమతులాహారం ద్వారా ఈ పోషక లోపాన్ని నివారించుకుని, మానసిక కుంగుబాటుకు అడ్డుకట్ట వేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.




# కాలుష్యంతో క్యాన్సర్

ధూమపానానికీ ఊపిరితిత్తుల క్యాన్సర్‌కూ దగ్గరి సంబంధం ఉందని మనందరికీ తెలుసు. అయితే ఆ అలవాటు లేనివాళ్లకు కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకుతున్న సంఘటనలు తాజాగా వెలుగులోకొస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే...

బెంగుళూరుకు చెందిన మారథాన్ ఔత్సాహికవేత్త, ఐటి ఉద్యోగి, 34 ఏళ్ల ప్రియకు ధూమపానం అలవాటు లేదు. క్రమం తప్పక వ్యాయాం చేస్తుంది. అలా అన్ని విధాలా ఆరోగ్యంగా ఉన్న ప్రియను దగ్గు, అలసట వేధించడం మొదలుపెట్టాయి. మొదట్లో వాతావరణ మార్పుల ప్రభావమని సరిపెట్టుకున్న ప్రియ, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వైద్యులను కలిసింది. ఎక్స్‌రే, సిటి స్కాన్‌లో ఆమె కుడి ఊపిరితిత్తిలో కనిపించిన కణితి, మూడో దశ నాన్ స్మాల్ సెల్ లంగ్ క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. హర్యాణా, పానిపట్‌కు చెందిన 43 ఏళ్ల పూనమ్ శర్మ, స్కూల్ టీచర్. దగ్గుతో పాటు రక్తం పడుతూ ఉండడంతో వైద్యులను కలిసిందామె. పరీక్షల్లో ఆమెకు కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకినట్టు నిర్ధారణ అయింది. ధూమపానం ఎరుగని పూనమ్, ప్రియలు ఇద్దరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని గడపడంతో పాటు ఇంటి భోజనానికే పరిమితమయ్యే మహిళలు. అయినప్పటికీ వీళ్లిద్దరికీ లంగ్ క్యాన్సర్ సోకింది. నిజానికి ఇలాంటి సందర్భాలు ఇటీవలి కాలంలో పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో ధూమపానం ఎరుగని మహిళల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ 15 నుంచి 20 శాతం పెరిగినట్టు ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చేపట్టిన అధ్యయనాల్లో వెల్లడైంది.



అప్రమత్తం

### కాలుష్యమే కారణం

పట్టణ వాయు కాలుష్యంలో వాహనాలు, పరిశ్రమల నుంచి వెలువడే సూక్ష్మ అణువులు, క్యాన్సర్ కారకాలను కలిగి ఉంటాయి. అతి సూక్ష్మ శ్వాస నాళికల్లోకి చేరుకునే ఈ క్యాన్సర్ కారకాలు క్రమేపీ ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. మరీ ముఖ్యంగా బయోమాస్ ఫ్యూయల్ స్మోక్, గృహ రసాయనాలు, రాడాన్ లేదా పొగాకు లాంటి కలుషితాలు కూడా ఈ సమస్యను తీవ్రతరం చేస్తాయని బెంగుళూరులోని గ్లెనిగేల్స్ హాస్పిటల్ మెడికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ రాజీవ్ విజయకుమార్ అంటున్నారు. ఇళ్లలో వంటకు ఉపయోగించే సంప్రదాయ ఇంధనం గత దశాబ్దకాలంలో ఎన్నో మార్పులకు లోనైందనీ, ఇది కూడా క్యాన్సర్ పెరుగుదలకు దోహదపడిందనీ, దీర్ఘకాలిక పర్యావరణ కాలుష్యం కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ప్రేరేపిస్తోందనీ అంటున్నారాయన. అయితే కొందరు మహిళల్లో జన్యు ఉత్పరివర్తన వల్ల కణ పెరుగుదల నియంత్రణ కోల్పోతుందనీ, ఈ పరిస్థితి ధూమపానం అలవాటు లేని ఆసియా వాసుల్లో కనిపిస్తూ ఉంటుందనీ ఈ మార్పు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారి తీస్తోందనీ ఇంకొందరు వైద్యులు అంటున్నారు.

### ఎలాంటి చికిత్స?

ధూమపానంతో సంబంధం లేని ఊపిరితిత్తుల క్యాన్సర్, టార్గెటెడ్ థెరపీకి భిన్నంగా, మెరుగ్గా స్పందిస్తుంది. క్యాన్సర్ పెరుగుదలను ప్రేరేపించే ఉత్పరివర్తన ప్రొటీన్ ప్రభావాన్ని అడ్డుకునే నోటి మాత్రలు మెరుగైన ఫలితాన్ని అందిస్తాయని వైద్యులు వివరిస్తున్నారు. సంప్రదాయ కీమోథెరపీకి భిన్నమైన టార్గెటెడ్ చికిత్స, తక్కువ దుష్ప్రభావాలను కలిగి ఉండడమే కాకుండా, అంతకు మించిన ప్రభావాన్ని కనబరుస్తుందని కూడా వైద్యులు భరోసా ఇస్తున్నారు. అయితే ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ఎంత త్వరగా గుర్తించి, చికిత్స మొదలుపెడితే ఫలితం అంత మెరుగ్గా ఉంటుంది కాబట్టి ఎంతకూ తగ్గని దగ్గు, ఛాతీ బిగదీయడం, వెన్ను నొప్పి, శ్వాసలో ఇబ్బంది, అకారణంగా బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

ఆవిష్కరణ

# అల్జీమర్స్‌కు టీకా మందు



పైబడే వయసులో వేధించే ఆరోగ్య సమస్య అల్జీమర్స్ ఇప్పటివరకూ ఈ రుగ్మతకు అడ్డుకట్ట వేసే చికిత్సలు రూపొందలేదు. అయితే తాజాగా అల్జీమర్స్‌ను అడ్డుకునే ఒక టీకాను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆ వివరాలు...

మతిమరుపు, నాడీకణాల క్షీణతతో సంబంధమున్న 'టౌ' అనే విషపూరిత ప్రొటీన్ లక్ష్యంగా పని చేసే ఒక టీకాను న్యూ మెక్సికోలోని శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. ఇప్పటివరకూ అల్జీమర్స్‌కు కేవలం లక్షణాలను నియంత్రించే చికిత్స మాత్రమే కొనసాగుతూ ఉంది. దీనికి భిన్నంగా, తాజాగా అభివృద్ధి చేసిన టీకా, శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ, టౌ ప్రొటీన్‌ను గుర్తించి, దాన్ని హతం చేసేలా రోగనిరోధక వ్యవస్థకు శిక్షణనిస్తుంది. ఈ దిశగా ఎలుకల మీద చేపట్టిన ప్రయోగాల్లో, టీకా అందించిన ఎలుకల్లో టౌ ప్రొటీన్ ఉత్పత్తి క్షీణించినట్టు, ఫలితంగా అల్జీమర్స్ వ్యాధి ఉధృతి కూడా గణనీయంగా కుంటుపడినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ఫలితాల ఆధారంగా ప్రస్తుతం ఇవే ప్రయోగాలను మనుషుల మీద చేపట్టే ప్రయత్నాల్లో ఉన్న శాస్త్రవేత్తలు, ఈ ప్రయోగాలు విజయవంతమైతే, ఈ టీకా అతి త్వరలో అందరికీ అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# స్పోర్ట్స్





## సిరాజ్‌లాంటి బౌలర్ ఉంటే..

సిరాజ్, ప్రసిద్ధ్‌లాంటి బౌలర్లుంటే కెప్టెన్సీ చేయడం తేలికవుతుంది. ఆఖరి రోజు మా ప్రదర్శపై పూర్తి సంతృప్తిగా ఉన్నా. నిజానికి ఇరు జట్లు గ్రేడ్ 'ఏ' క్రికెట్ ఆడాయి. మేం గెలుస్తామన్న నమ్మకం నాలుగో రోజే కలిగింది. ఎందుకంటే ఒత్తిడి ఉన్నది వారిపైనే. - కెప్టెన్ గిల్

## 'సుయ్' సెలబ్రేషన్స్



ఇంగ్లండ్‌తో టెస్టులో చివరి వికెట్ తీసిన అనంతరం సిరాజ్.. రెండు చేతులూ వెనక్కినెట్టి గట్టిగా అరుస్తూ సింహనాదం చేశాడు. దీన్ని 'సుయ్' సెలబ్రేషన్స్ అంటారు. సాకర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఇదే రీతిన సెలబ్రేట్ చేసుకుంటాడు. 2013లో ఓ మ్యాచ్‌లో గోల్ కొట్టినప్పుడు రొనాల్డో తొలిసారిగా ఈ విన్యాసాన్ని ప్రదర్శించాడు. సుయ్ అనేది పోర్చుగీసు పదం. దీనికి అవును అనే అర్థం. 'అవును.. నేను ప్రత్యర్థిని పడగొట్టా' అనే అర్థం వచ్చేలా ఈ విన్యాసాన్ని ఆటగాళ్లు ప్రదర్శిస్తుంటారు.

### పదికి పది: సచిన్

టెస్టు క్రికెట్.. ఎప్పుడూ ఉత్కంఠ రేపుతుంది. సిరీస్ 2-2తో సమం చేసిన కుర్రాళ్ల ప్రదర్శనకు పదికి పది మార్కులు.

### పోరాటం అద్భుతం: కోహ్లీ

టీమిండియాకు గొప్ప విజయం. సిరాజ్, ప్రసిద్ధ్ పోరాటం, పట్టుదల జట్టుకు చిరస్మరణీయ గెలుపును అందించింది. సిరాజ్ జట్టు కోసం సర్వశక్తులూ ఒడ్డాడు.

## సెమీస్‌కు ఆరుగురు బాక్సర్లు

బ్యాంకాక్: అండర్-22 ఆసియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు సెమీస్ చేరి ఆరు పతకాలు ఖాయం చేశారు. వీరిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారు. సోమవారం జరిగిన క్వార్టర్స్ బౌట్‌లో ప్రియ (60 కిలోలు), పరంజల్ యాదవ్ (70 కి)తోపాటు హర్ష్ (60 కి), నీరజ్ (75 కి), రాకీ చౌదరి (85 కి), ఇషాన్ (90+ కి) గెలిచి సెమీస్‌కు చేరుకొన్నారు.

# అపూర్వం.. అద్భుతం

నిస్సందేహంగా ఇది అద్భుత విజయమే.. 374 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ స్కోరు ఓ దశలో 301/3. క్రీజులో ఉన్న హ్యారీ బ్రూక్ ధనాధన్ ఆటతో బెంబేలెత్తిస్తున్నాడు.. మరో ఎండ్‌లో నిలకడకు మారుపేరు జో రూట్ ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో ఎవరైనా ఊహిస్తారా.. మ్యాచ్‌లో భారత్ గెలుస్తుందని? కానీ అదే జరిగింది. నాలుగో రోజు ఆఖరి సెషన్‌లో టపటపా వికెట్లు తీసి మన పేసర్లు విజయంపై ఆశలు రేపారు. ఇక సోమవారం ఇంగ్లండ్‌కు 35 రన్స్, భారత్‌కు 4 వికెట్లు అవసరమవగా.. మ్యాచ్ ఏ వైపునకో అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఓ దశలో ఇంగ్లండ్ వైపే మొగ్గు కనిపించినా.. మహ్మద్ సిరాజ్ గేమ్ చేంజర్‌గా మారాడు. పాత బంతితోనే సూపర్ స్వింగ్‌ను రాబడుతూ.. బుల్లెట్‌లాంటి యార్కర్లతో వికెట్లు తీసి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. అంతే.. చేయి దాటిందనుకున్న మ్యాచ్ భారత్ ఖాతాలో చేరింది. సిరీస్ 2-2తో సమమైంది.

## సిరాజ్ సూపర్ షో

ఐదో టెస్టులో 6 పరుగులతో భారత్ ఉత్కంఠ విజయం





- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 367
- 2-2తో సిరీస్ సమం

లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌కు అదిరే ముగింపు. సిరీస్ కోసం ఆతిథ్య జట్టు.. సమం కోసం గిల్ సేన నువ్వా నేనా అనే రీతిలో తలపడిన ఐదో టెస్టులో సోమవారం అద్భుతమే జరిగింది. 374 పరుగుల ఛేదనలో మరో 35 పరుగుల కోసం చివరి రోజు బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు పేసర్ సిరాజ్ (5/104) దిమ్మతిరిగేలా చేశాడు. ప్రసిద్ధ్ (4/126) కూడా రాణించడంతో ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 85.1 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. అటు ఆరు పరుగుల తేడాతో గట్టెక్కిన భారత్.. అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీని 2-2తో సమం చేసింది. అట్కిన్సన్ (17) పోరాటం ఇంగ్లండ్‌కు ఫలితాన్నివ్వలేదు. అంతకుముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 224, ఇంగ్లండ్ 247 పరుగులు చేయగా.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 396 రన్స్ చేసింది. ఈ టెస్టులో 9 వికెట్లు తీసిన సిరాజ్ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా.. గిల్, బ్రూక్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు.

### 53 బంతుల్లోనే..

339/6 ఓవర్‌నైట్ స్కోరుతో ఉన్న ఇంగ్లండ్ చివరి రోజు విజయం కోసం పక్కా వ్యూహంతోనే బరిలోకి దిగింది. తొలి అర్ధగంటపాటు బ్యాటింగ్‌కు అనుకూలించేలా ఆ జట్టు కోరిక మేరకు పిచ్‌పై భారీ రోలర్‌ను ఉపయోగించి సిద్ధం చేశారు. మరో 35 పరుగులు సులువుగా రాబట్టాలని ఇంగ్లండ్ ఆలోచించింది. కానీ బరిలోకి దిగాక సీన్ మారింది.

**తొలి ఓవర్:** ఆదివారం ఆటలో మిగిలిన నాలుగు బంతులను ప్రసిద్ధ్ కొనసాగించాడు. అయితే తొలి రెండు బంతులనే ఒవర్టన్ (9) ఫోర్లుగా మలిచి షాకిచ్చాడు. దీంతో 8 రన్స్ రావడంతో సమీకరణం ఇంగ్లండ్‌కు మరింత అనుకూలంగా మారింది.



**రెండో ఓవర్:** సిరాజ్ ఈ ఓవర్‌లో చక్కటి లెంగ్త్‌తో బంతులు విసిరాడు. అలాగే ఆఫ్‌సైడ్ ఆవల వేసిన బంతిని ఆడిన జేమీ స్మిత్ (2) కీపర్ జురెల్‌కు దొరికిపోవడంతో భారత్ అవకాశాలు మరింత పెరిగాయి.

**మూడో ఓవర్:** ప్రసిద్ధ్ వేసిన ఈ ఓవర్‌లో నాలుగు పరుగులు రాగా.. సమీకరణం 20 రన్స్‌కి మారడంతో ఉత్కంఠ నెలకొంది.

**నాలుగో ఓవర్:** సిరాజ్ ఐదో బంతికి ఒవర్టన్‌ను ఎల్బీ చేసి సంబరాలను రెట్టింపు చేశాడు. అయితే బ్యాటర్ రివ్యూకు వెళ్లినా అంపైర్ కాల్ కావడంతో భారత్‌కు అనుకూలంగా నిర్ణయం వచ్చింది.

**ఐదో ఓవర్:** కొత్త బంతి తీసుకునే అవకాశం వచ్చినా భారత్ వద్దనుకుంది. ప్రసిద్ధ్ నాలుగో బంతికి టంగ్‌ను అంపైర్ ఎల్బీగా ప్రకటించాడు. అయితే రివ్యూలో నాటౌట్‌గా తేలింది.

**ఆరో ఓవర్:** ఈ సమయంలో చిరు జల్లులు ఆరంభమయ్యాయి. స్టేడియంలో లైట్లను కూడా వేశారు. ఈ ఓవర్‌లో సిరాజ్ వేసిన ప్రతీ బంతి కూడా వికెట్ పడగొట్టేలా కనిపించింది.

**ఏడో ఓవర్:** ప్రసిద్ధ్ 141 కి.మీ వేగంతో విసిరిన అద్భుత యార్కర్‌కు టంగ్ బౌల్డయ్యాడు. ఈ దశలో ఆఖరి వికెట్‌గా భుజానికి పట్టీతోనే వోక్స్ బరిలోకి దిగాడు.

**ఎనిమిదో ఓవర్:** సిరాజ్ వేసిన రెండో బంతిని అట్కిన్సన్ లాంగాన్‌లో సిక్సర్‌గా మలిచి భారత్‌పై ఒత్తిడి పెంచాడు. వోక్స్‌కు బ్యాటింగ్ రాకూడదని ఆఖరి బంతికి బ్యాట్ టచ్ కాకున్నా పరుగు తీశాడు.

**తొమ్మిదో ఓవర్:** ప్రసిద్ధ్ వేసిన ఈ ఓవర్ తొలి బంతికి రెండు పరుగులు తీసిన అట్కిన్సన్, ఆఖరి బంతికి కూడా సింగిల్ తీశాడు.

**పదో ఓవర్:** విజయానికి మరో ఏడు పరుగులే కావాల్సిరావడంతో ఉత్కంఠ తారస్థాయికి చేరింది. కానీ ఇంగ్లండ్ ఆశలకు సిరాజ్ తొలి బంతికే తెర దించాడు. 143 కి.మీ వేగంతో విసిరిన సూపర్ యార్కర్‌కు అట్కిన్సన్ బౌల్డ్ కావడంతో భారత్‌కు చిరస్మరణీయ విజయం దక్కింది.

**స్కోరుబోర్డు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 224; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 247; భారత్ రెండో ఇన్నింగ్స్: 396; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** క్రాలే (బి) సిరాజ్ 14, డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 54, పోప్ (ఎల్బీ) సిరాజ్ 27, రూట్ (సి) జురెల్ (బి) ప్రసిద్ధ్ 105, బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్ 111, బెథెల్ (బి) ప్రసిద్ధ్ 5, స్మిత్ (సి) జురెల్ (బి) సిరాజ్ 2, ఒవర్టన్ (ఎల్బీ) సిరాజ్ 9, అట్కిన్సన్ (బి) సిరాజ్ 17; టంగ్ (బి) ప్రసిద్ధ్ 0; వోక్స్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 23; మొత్తం: 85.1 ఓవర్లలో 367 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337, 7-347, 8-354, 9-357, 10-367. **బౌలింగ్:** ఆకాశ్ దీప్ 20-4-85-1, ప్రసిద్ధ్ కృష్ణ 27-3-126-4, సిరాజ్ 30.1-6-104-5, సుందర్ 4-0-19-0, జడేజా 4-0-22-0.

**2** ఇంగ్లండ్‌లో ఎక్కువ వికెట్లు తీసిన రెండో భారత బౌలర్‌గా కపిల్ దేవ్ (43)ను దాటేసిన సిరాజ్ (46). బుమ్రా, ఇషాంత్ (51) టాప్‌లో ఉన్నారు.

### స్టెయిన్ చెప్పినట్టుగా..

ఐదో టెస్టులో సిరాజ్ ఐదు వికెట్లు తీస్తాడని సౌతాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ గత నెల 30న ఎక్స్‌లో పేర్కొన్నాడు. అతడు చెప్పినట్టుగానే రెండో ఇన్నింగ్స్‌లో సిరాజ్ 5 వికెట్లతో జట్టును గెలిపించాడు. మ్యాచ్ ముగిశాక సిరాజ్.. 'నువ్వు అడిగావు. నేను చేశాను' అంటూ స్టెయిన్‌కు సమాధానమిచ్చాడు.

## గ్రేటెస్ట్ విన్!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

నవ యువ భారత జట్టు అద్భుతం చేసింది. అసాధ్యమనుకున్న విజయాన్ని సుసాధ్యం చేసింది. దిగ్గజ ఆటగాళ్లు కోహ్లీ, రోహిత్, అశ్విన్ లేని లోటును పూరించింది. ప్రపంచ క్రికెట్‌లో భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలిపే సత్తా తమకుందని నిరూపించింది. చారిత్రక ఐదో టెస్టు విజయానికి..మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టును అమోఘ రీతిలో డ్రా చేసుకోవడం స్ఫూర్తిగా నిలిచింది. ఆ టెస్టు స్ఫూర్తితో 'ఓవల్‌లో గెలుపు సాధించగలమన్న ధీమా గిల్ సేనలో ఏర్పడింది. అయితే ఆఖరి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు తడబాటుకులోనైనా..పేసర్లు సిరాజ్, ప్రసిద్ధ్ తడాఖా చూపడంతో భారీ స్కోరు చేయకుండా ఇంగ్లండ్‌ను నిలువరించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు చెలరేగడంతో మనోళ్లు దాదాపు 400కు చేరువగా వచ్చారు. కానీ బ్యాటింగ్‌కు అనుకూలించిన వికెట్‌పై 374 పరుగుల లక్ష్యం ఆతిథ్య జట్టుకు సులువేనని అనిపించింది. పైగా రూట్, బ్రూక్ శతకాలతో కదం తొక్కడంతో భారత్ విజయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మన యువకుల పట్టు సడలుతుందేమోనని అనిపించింది. బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను సిరాజ్ జారవిడవడంతో మ్యాచ్ చేజారినట్టేనని అభిమానులు డీలా పడ్డారు. కానీ టీమిండియా మాంచెస్టర్‌లో కంటే మిన్నగా పోరాడింది.ఈ ఊపులో బ్రూక్, రూట్‌ను పెవిలియన్ చేర్చి మ్యాచ్‌పై పట్టు సాధించారు. కానీ స్మిత్ క్రీజులో ఉండడంతోపాటు ఇంగ్లండ్ లోయరార్డర్ ఆటగాళ్లు కీలక సమయాల్లో బ్యాట్ ఝుళిపించే నైపుణ్యం ఉండడంతో విజయంపై సందేహాలు ఏర్పడ్డాయి. కానీ ఆఖరి రోజు హైదరాబాద్ పేసర్ సిరాజ్ విజృంభణకు ఇంగ్లండ్ కుదేలైంది. చారిత్రక విజయం మన సొంతమైంది.

> నాలుగో రోజు బ్రూక్ క్యాచ్‌ను వదిలేయడం బాధనిపించింది. దీంతో ఐదోరోజు ఉదయం లేవగానే నేనే గేమ్ ఛేంజర్ అవ్వాలని అనుకున్నా. అనుకున్నట్లే ఆరంభంలోనే రెండు వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను ఒత్తిడిలో పడేశాం. చివరకు ఫలితాన్ని రాబట్టాం. - సిరాజ్

### భుజం పట్టీతోనే బరిలోకి..



ఐదో టెస్టు తొలిరోజే బౌండరీ లైన్ దగ్గర గాయపడిన ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ ఆఖరి రోజు భుజానికి పట్టీతోనే బరిలోకి దిగాడు. తొమ్మిదో వికెట్ పడిన వేళ ఆ జట్టు విజయానికి 17 రన్స్ అవసరమయ్యాయి. దీంతో వోక్స్‌ను ఆడించారు. గాయమైన ఎడమచేతిని స్వెట్టర్‌లో దాచుకుని మరో చేత్తో బ్యాట్ పట్టుకున్న అతడిని ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతించారు. గతంలో కూడా కొందరు క్రికెటర్లు ఇలా బరిలోకి దిగారు. 2009లో సౌతాఫ్రికా కెప్టెన్ గ్రేమ్ స్మిత్ ఎడమ చేతికి పట్టీతోనే ఆడి 17 బంతులను ఎదుర్కొన్నాడు. విండీస్ గ్రేట్ మాల్కం మార్షల్ 1984లో ఎడమచేతి బొటనవేలు ఫ్రాక్చర్ అయినా.. కుడి చేత్తోనే బ్యాటింగ్ చేశాడు.

# బిజినెస్

## రూపాయికి సుంకాల పోటు

- క్రమంగా కరుగుతున్న విలువ
- రూ.87.66కి మారకం రేటు
- త్వరలో రూ.88.50కి చేరిక?



ముంబై: గడిచిన కొన్ని రోజుల్లో భారత కరెన్సీ విలువ తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతోంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం మరో 48 పైసలు పతనమై రూ.87.66 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల పోటు, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. గతవారంలోనూ రూపాయి మారకం విలువ 1.2 శాతం పతనమైంది. 2022 డిసెంబరు తర్వాత మన కరెన్సీకిదే అతిపెద్ద వారం రోజుల క్షీణత. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితితోపాటు విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటంతో రాబోయే కాలంలో కూడా రూపాయి బలహీనంగానే ఉండవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్, కరెన్సీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అభిప్రాయపడ్డారు. రాబోయే సెషన్లలో డాలర్-రూపీ మారకం రేటు రూ.88.50కి చేరుకోవచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నివేదిక అంచనా వేసింది. అయితే, బలహీనపడుతున్న డాలర్, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటి అంశాలు కనిష్ఠ స్థాయిల్లో రూపాయికి మద్దతుగా నిలవవచ్చని ఫారెక్స్ వర్గాలు భావిస్తున్నాయి.

### యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం ఎప్పుడో.. ?

ట్రంప్ భారత్‌పై విధించిన 25 శాతం సుంకాలు ఈ నెల నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ దెబ్బతో ఎగుమతులపై 30% మేర ప్రభావం పడవచ్చని జీటీఆర్ఐ అంచనా వేసింది. ఈనేపథ్యంలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే సుంకాల పోటు నుంచి కాస్త ఊరట లభించవచ్చని ఎగుమతిదారులు ఎదురుచూస్తున్నారు. కానీ, యూఎస్‌తో ట్రేడ్ డీల్ ఎప్పటి లోగా కుదురుతుందన్న విషయంలో అనిశ్చితి పెరుగుతోంది. ఇదిలా ఉండగా.. గత నెలలో ఎఫ్ఐఐలు మొత్తం రూ.17,400 కోట్లకు పైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఈనెల 1న రూ.5,588.91 కోట్లు, 2న రూ.3,366.40 కోట్లు, సోమవారం మరో రూ.2,566.51 కోట్ల నికర అమ్మకాలు జరిపారు.

### ఆసియా కరెన్సీల్లోకెల్లా అత్యంత కనిష్ఠ పనితీరు

ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే, ఈ ఏడాది ద్వితీయార్థంలో మన రూపాయి ఆసియాలోకెల్లా అత్యంత కనిష్ఠ పనితీరు కనబరిచిన కరెన్సీగా మిగిలిపోవచ్చని డాయిష్ బ్యాంక్ భావిస్తోంది. ఈ ఏడాది చివరికల్లా డాలర్‌తో రూపాయి మారకం విలువ సరికొత్త జీవనకాల కనిష్ఠానికి జారుకోవచ్చని అంచనా వేసింది. అమెరికా సుంకాల సంబంధిత ప్రతికూలతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణే రూపాయిపై ప్రధానంగా ఒత్తిడి పెంచుతున్నాయని ఫారెక్స్ విశ్లేషకులు పేర్కొన్నారు.

### సెన్సెక్స్ మళ్లీ 81,000 పైకి..

ముంబై: స్టాక్ మార్కెట్లో రెండ్రోజుల వరుస నష్టాలకు తెరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు మెటల్, ఆటో, కమోడిటీ రంగాల షేర్లలో కొనుగోళ్లు పెంచడంతో సూచీలు సోమవారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 418.81 పాయింట్ల లాభంతో 81,018.72 వద్ద ముగిసింది. నిఫ్టీ 157.40 పాయింట్ల వృద్ధితో 24,722.75 వద్ద స్థిరపడింది.

**7న ఆల్ టైం ప్లాస్టిక్స్ ఐపీఓ**

కన్స్యూమర్‌వేర్ ఉత్పత్తుల తయారీదారు ఆల్ టైం ప్లాస్టిక్స్ రూ.401 కోట్ల ఐపీఓ ఈనెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.260-275గా నిర్ణయించింది.

- డిజిటల్ హెల్త్ టెక్ ప్లాట్‌ఫామ్ ప్రాక్టో.. త్వరలో ఐపీఓకు రావాలనుకుంటోంది. ఇప్పటివకే అంతర్జాతీయం గా 5 కోట్ల మంది పేషెంట్లకు సేవలందించిన ఈ వేదికకు 5 లక్షలకు పైగా వైద్యులు అనుసంధానితమై ఉన్నారు.

### విన్‌ఫాస్ట్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం



చెన్నై (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా సిప్కాట్ సిలానత్తం ఇండస్ట్రియల్ పార్కులో రూ.1300 కోట్లతో నెలకొల్పిన ఎలక్ట్రిక్ కార్ల కర్మాగారంలో విన్‌ఫాస్ట్ కంపెనీ సోమవారం ఉత్పత్తిని ప్రారంభించింది. 17 మాసాలకు ముందు తమిళనాడు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న ఆ సంస్థ స్వల్ప కాలంలోనే నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆ కర్మాగారాన్ని ప్రారంభించడంతో పాటు ఆ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన తొలి కారుపై సంతకం చేశారు. విన్‌ఫాస్ట్ విస్తరణకు కూడా సహాయపడతామని హామీ ఇచ్చారు.

### అరబిందో ఫార్మా లాభం రూ.824 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికానికి అరబిందో ఫార్మా లాభం 10% తగ్గి రూ.824 కోట్లకు పడిపోయింది. అమెరికా మార్కెట్లోను, ఏపీఐ విభాగంలోను అమ్మకాలు తగ్గడం ఇందుకు కారణం. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే కంపెనీ లాభం రూ.918 కోట్లుంది. ఆదాయం మాత్రం రూ.7,567 కోట్ల నుంచి రూ.7,868 కోట్లకు పెరిగింది. సోమవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో రూపాయి ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.4 మధ్యంతర డివిడెండుకు (400%) ఆమోదం తెలిపారు. డివిడెండు చెల్లింపునకు రికార్డు తేదీని ఆగస్టు 8గా నిర్ణయించారు. తమ యూరోపియన్ వ్యాపారాల్లో బలమైన వృద్ధి నమోదవుతోందని, అమెరికా వ్యాపారాలు మాత్రం ఆటుపోట్లను తట్టుకుంటూ నిలదొక్కుకున్నాయని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కే.నిత్యానంద రెడ్డి తెలిపారు.

## జీఎస్‌టీ ఎగవేతలు

# ఐదేళ్లలో రూ.7.08 లక్షల కోట్లు

### ఐటీసీ పేరుతోనూ బురిడీ



న్యూఢిల్లీ: జీఎస్‌టీ కాలంలోనూ పన్ను ఎగవేతలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత ఐదేళ్లలో (2020-25) 91,370 కేసుల్లో రూ.7.08 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతలను కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని క్షేత్ర స్థాయి జీఎస్‌టీ అధికారులు గుర్తించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ విషయం వెల్లడించారు. గత ఐదేళ్లలో వ్యాపారులు, వ్యాపార సంస్థలు, కంపెనీలు ఎగవేసిన రూ.7.08 లక్షల కోట్ల జీఎస్‌టీ కేసుల్లో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వాటానే రూ.2.79 లక్షల కోట్ల వరకు ఉందని మంత్రి చెప్పారు. ఐతే గత ఐదేళ్లలో స్వచ్ఛంద డిపాజిట్ పథకం ద్వారా రూ.1.29 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతల సొమ్మును అధికారులు రాబట్టగలిగారు.

**ఎగవేతల తీరు**

2024-25 ఆర్థిక సంవత్సరంలో 33,056 కేసుల్లో రూ.2.23 లక్షల కోట్ల జీఎస్‌టీ ఎగవేతలను అధికారులు గుర్తించారు. ఇందులో 15,283 కేసులు ఐటీసీ ఎగవేతలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ ఎగవేతల ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.58,772 కోట్ల వరకు గండి పడింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ రూ.2.30 లక్షల జీఎస్‌టీ ఎగవేతలకు సంబంధించిన కేసులను సీజీఎస్‌టీ అధికారులు గుర్తించారు. ఇందులో ఐటీసీ స్వాహా రూ.36,374 కోట్ల వరకు ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.32 లక్షల కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.73,238 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.49,384 కోట్ల జీఎస్‌టీ ఎగవేత కేసులను అధికారులు గుర్తించారు.

**కట్టడి చర్యలు**

జీఎస్‌టీ ఎగవేతలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇ-ఇన్వాయిసింగ్, జీఎస్‌టీ అనలిటిక్స్ వంటి డిజిటైజేషన్ చర్యలతో పాటు నిఘాను పటిష్ఠం చేయడం, రిటర్న్‌ల స్ర్కూటినీ చేపట్టినట్టు పంకజ్ చౌదరి చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో సీజీఎస్‌టీ రూపంలో కేంద్ర ప్రభుత్వ ఖజానాకు నికరంగా రూ.10.26 లక్షల కోట్లు చేరింది. సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం ఇది (రూ.10.62 లక్షల కోట్లు) 96.7 శాతానికి సమానమని మంత్రి తెలిపారు.

### రూ.47.12 కోట్ల ఎగవేతల గుట్టు రట్టు

ఐరన్, స్టీలు వ్యాపారంలో ఉన్న ఒక ఢిల్లీ వ్యాపారి బోగస్ ఇన్‌వాయిస్‌లతో రూ.47.12 కోట్ల ఐటీసీ స్వాహా చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ ఘరానా పెద్దమనిషి అసలు వస్తువులే సరఫరా చేయకుండా బోగస్ ఇన్వాయిస్‌లతో ఈ మొత్తాన్ని స్వాహా చేసినట్టు అధికారులు చెప్పారు. పక్కా సమాచారంతో దర్యాప్తు చేసి అధికారులు ఇతడిని అరెస్టు చేశారు.

### స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ రూ.21 కోట్ల లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (ఎస్‌జీఎల్‌టీఎల్) జూన్ త్రైమాసికంలో రూ.178 కోట్ల ఆదాయంపై రూ.35 కోట్ల స్థూల లాభం, రూ.21 నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 23.6%, స్థూల లాభం 31.9%, నికర లాభం 37.6% పెరిగాయి. వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు కంపెనీ మరిన్ని చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అమెరికాలో స్టాండర్డ్ ఇంజినీరింగ్ ఇంక్ పేరుతో పూర్తి అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**

| 5వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 435 | విజయవాడ | 475 |
| వరంగల్ | 437 | గోదావరి | 470 |
| చిత్తూరు | 513 | విశాఖపట్నం | 470 |
| | | దజను గుడ్లు రూ. | 72 |



**ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 90 | విజయవాడ | 99 |
| వరంగల్ | 90 | గుంటూరు | 104 |
| కరీంనగర్ | 90 | ఒంగోలు | 107 |
| మహబూబ్‌నగర్ | 90 | చిత్తూరు | 82 |
| కర్నూలు | 90 | నెల్లూరు | 87 |
| విశాఖపట్నం | 94 | అనంతపురం | 87 |
| గోదావరి | 99 | | |



### ఐదో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా భారత్

న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో ఐదో అతి పెద్ద విమానయాన సేవల మార్కెట్‌గా అవతరించిందని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) వెల్లడించింది. గత ఏడాది భారత్‌లో 21.1 కోట్ల మంది (జాతీయ, అంతర్జాతీయ) విమాన ప్రయాణం చేశారని, 2023తో పోలిస్తే విమాన ప్రయాణికుల సంఖ్య 11.1 శాతం పెరిగిందని తాజా నివేదికలో వెల్లడించింది. అలాగే, ముంబై-ఢిల్లీ అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటల్లో ఒకటని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 350 ఎయిర్‌లైన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఐఏటీఏ రిపోర్టులోని మరిన్ని విషయాలు..

- గత ఏడాదికి గాను 87.6 కోట్ల మంది ప్రయాణికులతో అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా అమెరికా తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. 74.1 కోట్ల ప్రయాణికులతో చైనా రెండో స్థానంలో ఉంది.
- ప్రపంచంలోని అత్యంత రద్దీ విమానాశ్రయాల జంటలో ముంబై-ఢిల్లీ 7వ స్థానంలో ఉన్నాయి. గత ఏడాది ఈ ఎయిర్‌పోర్టుల మధ్య 59 లక్షల మంది ప్రయాణించారు. ఈ విషయంలో ఆసియా పసిఫిక్ విమానాశ్రయాల జంటలే అధికం. జెజు-సియోల్ ప్రపంచంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయ జంటగా నిలిచింది. గత ఏడాది ఈ రెండు ఎయిర్‌పోర్ట్‌ల మధ్య 1.32 కోట్ల మంది ప్రయాణించారు.
- గత ఏడాది అంతర్జాతీయ విమాన సర్వీసుల్లో బిజినెస్, ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించిన వారి సంఖ్య 11.8 శాతం పెరగగా.. ఎకానమీ క్లాస్ ప్రయాణికుల వృద్ధి 11.5 శాతంగా నమోదైంది. 2024లో అంతర్జాతీయ బిజినెస్, ఫస్ట్ క్లాస్ ప్రయాణికుల మొత్తం సంఖ్య 11.69 కోట్లకు పెరిగింది. ఇది మొత్తం అంతర్జాతీయ ప్రయాణికుల్లో 6 శాతానికి సమానం.

### ధ్రువ స్పేస్ 'లీప్-1' ప్రయోగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే స్టార్టప్ కంపెనీ ధ్రువ స్పేస్ ఈ సంవత్సరం మూడో త్రైమాసికంలో లీప్-1 ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. స్పేస్ ఎక్స్ కంపెనీకి చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ప్రయోగం జరపనున్నట్టు ధ్రువ స్పేస్ తెలిపింది. కంపెనీకి ఇదే తొలి వాణిజ్య ఉపగ్రహ ప్రయోగం. రక్షణ, విపత్తుల నిర్వహణ, పర్యావరణ నిర్వహణకు అవసరమైన ఏఐ ఆధారిత సేవలను ఈ లీప్-1 ఉపగ్రహం అందించనుంది.

**బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)**



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,01,400 ▲ | 92,950 ▲ | 1,23,000 ▼ |
| విజయవాడ | 1,03,550 ▲ | 97,000 ▲ | 1,14,300 ▲ |
| విశాఖపట్నం | 1,03,170 ▲ | 92,950 ▲ | 1,23,000 ▲ |
| రాజమండ్రి | 1,01,400 ▲ | 92,950 ▲ | 1,14,800 ▲ |
| ప్రొద్దుటూరు | 1,00,200 ▼ | 92,180 ▼ | 1,14,800 ▲ |
| ముంబై | 1,00,170 ▲ | 91,750 ▲ | 1,11,900 ▲ |



హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా ప్రమాణం స్వీకారం చేసిన జస్టిస్ తుహిన్ కుమార్‌ను అభినందిస్తున్న సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్

## హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా తుహిన్‌కుమార్ ప్రమాణం

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జి.తుహిన్ కుమార్ సోమవారం ప్రమాణం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్.. ఆయనతో ప్రమాణం చేయించారు. కాగా, ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, తుహిన్‌కుమార్ కుటుంబ సభ్యులు, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారథి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, రిజిస్ట్రార్‌లు పాల్గొన్నారు.

## 3కి.మీ. దాటినా ఆర్టీఈ అడ్మిషన్లు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు పొందేందుకు పాఠశాల విద్యాశాఖ మరింత వెసులుబాటు కల్పించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం పాఠశాల 3కిలోమీటర్ల లోపు ఉంటేనే ఆర్టీఈ కింద అడ్మిషన్ ఇస్తున్నారు. ఈ పరిధిని 5కిలోమీటర్ల వరకు పెంచుతూ పాఠశాల విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. కొత్త నోటిఫికేషన్ జారీచేసేందుకు సమగ్రశిక్షకు అనుమతిచ్చింది. పాఠశాలకు 3 నుంచి 5కిలోమీటర్ల దూరంలో ఇళ్లు ఉన్న విద్యార్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు కల్పించాలని స్పష్టం చేసింది. అయితే ఈ విద్యార్థుల తల్లుల్లో ఎవరికైనా ఇప్పటికే 'తల్లికి వందనం' డబ్బులు వచ్చి ఉంటే దాని నుంచే ఈ విద్యా సంవత్సరం ఫీజులు చెల్లించాలనే నిబంధన పెట్టింది.

## 86 కాలేజీలకు డిగ్రీ ఫీజులు ఖరారు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 86 కాలేజీల్లో డిగ్రీ కోర్సులకు ఫీజులు ఖరారు చేస్తూ ఉన్నత విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. 2023-26 వరకు ఈ ఫీజులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. వాస్తవానికి అన్ని కాలేజీలకూ 2003లోనే ఫీజులు ఖరారయ్యాయి. ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించకపోవడంతో ఈ కాలేజీలకు ఫీజులు ఖరారు చేయలేదు. దీనిపై కాలేజీ యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఫీజులు నిర్ణయిస్తూ ఉన్నత విద్యాశాఖ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపుగా అన్ని కాలేజీలకూ బీఎస్సీకి రూ.15వేలు, బీకామ్‌కు రూ.12వేలు, బీఏకి రూ.11వేలు, బీసీఏకి రూ.18వేల చొప్పున ఫీజులు నిర్ణయించింది.

## విదేశాల్లో డ్రైవర్ ఉద్యోగాలు

- యూఏఈ రిటర్నీలకు అవకాశం

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): యూఏఈలో పనిచేసి తిరిగొచ్చిన వారికి దుబాయ్‌లో డ్రైవర్ ఉద్యోగాలు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం పంజాబ్‌కు చెందిన జలంధర్ నైపుణ్యాభివృద్ధి సంస్థతో కలిసి పనిచేస్తున్నామన్నారు. దుబాయ్‌లోని ట్రిస్టార్ గ్రూప్, వియోలీయ, అలైడ్ ట్రాన్స్‌పోర్ట్, దుబాయ్ పోర్ట్‌లలో ఉద్యోగావకాశాలు ఉన్నట్లు వివరించారు. కడప, తూర్పుగోదావరి, విశాఖ జిల్లాల్లో యూఏఈ నుంచి తిరిగొచ్చిన డ్రైవర్లు ఎక్కువ ఉన్నట్లు తెలిపారు. ట్రైలర్ డ్రైవర్, ట్రక్ డ్రైవర్, ఐటీవీ డ్రైవర్ ఉద్యోగాలకు ఆసక్తి ఉన్నవారు ఏపీ నైపుణ్యం వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9988853335ను సంప్రదించాలన్నారు.

# కువైత్ సంస్కరణలతో కొత్త కష్టాలు

### మన ఎన్ఆర్ఐల్లో కడపవారే అక్కడ అత్యధికం

- విజన్ 2035 ప్రకారం విదేశీ వీసా, నివాస నిబంధనలను కఠినతరం చేసిన కువైత్
- తెలుగుప్రాంతాల్లో విస్తృత తనిఖీలు
- అరెస్టులు భారంగా మారిన రెసిడెన్సీ వీసా
- నెల సంపాదన అద్దెకే చాలడం లేదు
- వాపోతున్న తెలుగు ప్రవాసీయులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)




కువైత్‌లో గడపగడపకు కడపతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధం ఉంది. కువైత్‌లోని విదేశీయుల్లో అత్యధికంగా 10లక్షలమంది భారతీయులు ఉన్నారు. వీరిలో మలయాళీల తర్వాత ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాలకు చెందిన వారే అత్యధికం. దీంతో కువైత్ ప్రభుత్వం తీసుకునే కీలక నిర్ణయాలు మనవాళ్లను అమితంగా ప్రభావితం చేస్తుంటాయి. తాజాగా ఉద్యోగ, ఉపాధి రంగాల్లో సమూల మార్పులను ప్రతిపాదిస్తూ కువైత్ ప్రభుత్వం విజన్ 2035ను రూపొందించింది. ఈ విజన్ తమ అవకాశాలకు గొడ్డలిపెట్టుగా మారనుందని తెలుగు ఎన్ఆర్ఐల్లో ఆందోళన నెలకొంది. వీసా, ఉపాధి నిబంధనల ఉల్లంఘనల విషయంలో కువైత్ కఠినంగా ఉంటోంది. విజన్ డాక్యుమెంట్‌లో కూడా దీనిపై గట్టి చర్యలను ప్రతిపాదించారు. ఇందులోభాగంగా డిజిటల్ విధానాన్ని అనుసరిస్తూ విదేశీయుల ఉపాధి, నివాస, ఆర్థిక, నేర వివరాలు తెలుసుకునేందుకు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. కారణం ఏమైనా కువైత్‌లో నివసిస్తున్న తెలుగు ఎన్ఆర్ఐలు వీసా, ఉపాధి నిబంధనలకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటున్నారు. తాజా తనిఖీలు వారిలో అత్యధికులకు ఇబ్బందిగా మారాయి. విదేశీయులు తమ చిరునామా సహా నివాస వివరాలన్నీ సమర్పించాలని ప్రభుత్వం షరతు పెట్టింది. ఈ షరతు గతంలో లేదు. గత ఏడాది జరిగిన ఒక అగ్ని ప్రమాదంలో ముగ్గురు ప్రవాసాంధ్రులతో పాటు 50 మంది భారతీయులు మరణించారు. ఈ ఘటన తర్వాతే కొత్త ఆంక్షలను కువైత్ తెరపైకి తెచ్చింది. ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోని వ్యక్తులు అత్యధికంగా ఉంటూ, వారి వివరాలు లేకపోవడంతో నీటి సరఫరా, విద్యుత్ పంపిణీ నిర్వహణ కష్టమవుతోంది. పవర్ లోడింగ్ సమస్య చాలా సార్లు భారీ అగ్ని ప్రమాదాలకు దారి తీస్తోంది. దీంతో కువైత్ ప్రభుత్వం విదేశీయులు నివసించే ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేసింది.

### పెనంపై నుంచి పొయ్యిలోకి...

కువైత్‌లోని సాల్మీయా, జహెరా, హావల్లీ, ఖైతాన్, ఫర్వానీయా, జ్లీబ్ షయూఖ్ ప్రాంతాల్లో ప్రవాసాంధ్రులు ఎక్కువగా నివసిస్తున్నారు. అత్యధికులు నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నారు. కొత్త విజన్‌లో భాగంగా పోలీసులు ఈ ప్రాంతాలను ప్రక్షాళన చేస్తున్నారు. నివాస వివరాలు లేని విదేశీయులను ప్రభుత్వం పంపించివేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే అనేక మంది తెలుగువారిని స్వదేశానికి బలవంతంగా తిప్పి పంపించగా, మరికొందరు జైళ్లలో ఉన్నారు. విదేశీయులు ఉండటానికి తప్పుడు విధానంలో నివాస ఏర్పాట్లు చేసి పెడుతున్న ఓ దళారీని పోలీసులు విచారించారు. అతని వద్ద లభించిన బతఖా మదనీ(రెసిడెన్సీ వీసా) ఆధారంగా చిత్తూరు జిల్లా పీలేరుకు చెందిన ఒక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్త విజన్‌లో భాగంగా ఈ తరహా వీసాల జారీకి నివాస వసతి వివరాలను సమర్పించడాన్ని తప్పనిసరి చేశారు. నిజానికి, ఈ నిబంధన ప్రవాసీయులకు రక్షణ కలిస్తుంది. ఇల్లు అద్దెకు తీసుకునే ముందు విదేశీయులు 120-150 దినార్లు చెల్లించి యజమానితో ఒప్పందం చేసుకుంటారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఆ ఒప్పందాన్ని యజమాని ఎప్పుడైనా రద్దు చేసుకొని, అద్దెకు ఉంటున్నవారిని పంపించివేయవచ్చు. దీంతో చాలామంది నెలకు 25 దినార్లకు (సుమారు రూ.7 వేలు) ఒక మంచం తీసుకొని కాలం గడుపుతున్నారు. కొత్త నిబంధనల ప్రకారం, నెలకు కనీసం 250 దినార్ల(సుమారు 71 వేల రూపాయలు) అద్దె చెల్లించి బతఖాను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇంత నగదు చెల్లించడం తమ వల్ల కాదని తెలుగు ప్రవాసీయులు వాపోతున్నారు. ఈ నిబంధన తమను పెనంపైనుంచి పొయ్యిలోకి నెట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కువైత్‌లో పని చేస్తున్న అనేక మంది తెలుగు ప్రవాసీయుల వేతనాలు నెలకు 200-300 దినార్ల (57 నుండి 85 వేల రూపాయలు) లోపు ఉన్నాయి.

# పీజీ వైద్య విద్యలో రిజర్వేషన్లు

### ప్రభుత్వ డాక్టర్లకు క్లినికల్‌లో 15 శాతం

- నాన్ క్లినికల్‌లో 30% చొప్పున వర్తింపు
- స్పెషలిస్టుల అవసరాల మేరకు ఖరారు
- ఆమోదం తెలిపిన సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య విద్య ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యుల రిజర్వేషన్ కోటా ను సర్కారు నిర్ధారించింది. దీనికి సంబంధించి ఆరోగ్య శాఖ చేసిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు ఆమోదించారు. 2028-29 సంవత్సరానికిగాను ప్రభుత్వాసుపత్రుల్లో క్లినికల్, నాన్ క్లినికల్ స్పెషలిస్టుల అవసరాన్ని మదింపు చేసిన ప్రభుత్వం.. రిజర్వేషన్‌పై నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే వైద్యుల ఆకాంక్షలను కూడా పరిగణనలోకి తీసుకుంది. 7 క్లినికల్ కోర్సుల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు 9 నాన్‌క్లినికల్ కోర్సుల్లో 30 శాతం రిజర్వేషన్ కల్పించారు. 1,144 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న 2,288 మంది వైద్యుల ఆకాంక్షను దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్‌పై నిర్ణయం తీసుకున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల కమిటీ మదింపు చేసి వివిధ విభాగాల్లో అవసరాలను గుర్తిస్తూ నివేదిక ఇచ్చిందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనే ప్రభుత్వ వైద్యుల ఆశలు, ఆకాంక్షలను కూడా పరిగణనలోకి తీసుకుని పీజీ కోర్సుల్లో రిజర్వేషన్లు కల్పించామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద లభించే 50 శాతం కోర్సుల్లో ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్ మేరకు వైద్యులకు ప్రవేశాలు లభించనున్నాయని తెలిపారు. 15 శాతం రిజర్వేషన్ ప్రకారం 7 క్లినికల్ విభాగాల్లో 154 సీట్లు, 9 నాన్ క్లినికల్ విభాగాల్లో 30 శాతం రిజర్వేషన్ మేరకు 118 సీట్లు ఉంటాయి.

## ఈఏపీసెట్ సీట్ల కేటాయింపు వాయిదా

### 'స్థానికత'పై హైకోర్టు ఆదేశంతో నిర్ణయం

- నేడు వెకేట్ పిటిషన్లు వేయాలని నిర్ణయం

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈఏపీసెట్ తుది విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు వాయిదా పడింది. స్థానికతపై హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. షెడ్యూలు ప్రకారం తుది విడత సీట్లు సోమవారం కేటాయించాలి. కాగా, హైకోర్టు ఆదేశాలపై మంగళవారం వెకేట్ పిటిషన్ వేయాలని సాంకేతిక విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయినందున స్థానికత అంశంపై ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. వీటి ప్రకారం ఇంజనీరింగ్ సీటు పొందాలంటే అంతకుముందు నాలుగేళ్లు.. అంటే ఇంటర్మీడియట్, 10, 9 తరగతులు కచ్చితంగా రాష్ట్రంలోనే చదివి ఉండాలి. ఒకవేళ ఈ 4 తరగతుల్లో ఒక్క ఏడాది బయటి రాష్ట్రంలో చదివినా.. తమ తల్లిదండ్రులు ఏపీలో పదేళ్లు నివసించినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఆ సర్టిఫికెట్ సమర్పిస్తే వారిని అన్ రిజర్వ్‌డ్ కోటాలో పరిగణిస్తారు. అయితే వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదు. ఈ తరహాలో తెలంగాణలో ఇంటర్ చదివిన ఏపీ విద్యార్థులు కొందరు తమను లోకల్‌గా పరిగణించాలంటూ హైకోర్టులో పిటిషన్లు వేశారు. వాటిపై విచారణ చేసిన న్యాయస్థానం వారిని స్థానికులుగా గుర్తించాలని ఆదేశించింది.

## ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదల చేసిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీపీఎస్సీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 17 అర్ధరాత్రి వరకూ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అలాగే అంతకముందు జారీచేసిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తుల గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్లు మరో ప్రకటనలో తెలిపింది.

## ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు

- రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణకు డీజీపీ ఆదేశాలు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను కాపాడేందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లు చేపట్టాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ డ్రైవ్‌లు వారానికి ఒకసారి చొప్పున నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం అమల్లోకి వస్తాయని పోలీసుశాఖ ప్రకటించింది. ఆగస్టు 4 నుంచి 10 వరకు 'మద్యం సేవించి వాహనం నడపొద్దని హెచ్చరికతో డ్రైవ్', ఆగస్టు 11 నుంచి 17 వరకు.. వేగం మితిమీరిన వాహనాలపై చర్యలు, ఆగస్టు 18నుంచి 24 వరకు హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారు, అలాగే పిలియన్ రైడర్లపై చర్యలు ఉంటాయన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

# 'సైమన్' హీరో లాంటివాడు

- అక్కినేని నాగార్జున

'ఈ సినిమాలో నేను చేసిన పాత్ర పేరు సైమన్. దాదాపు హీరోలాంటిదీ క్యారెక్టర్. మొదటిసారి విలన్‌గా నటించడం అద్భుతమైన అనుభవం. దర్శకుడు లోకేశ్ తెరపై హీరో, విలన్‌ని సమానంగా చూపిస్తాడు. రజనీకాంత్‌తో కలసి పనిచేయడం మరువలేని జ్ఞాపకం' అని అన్నారు హీరో అక్కినేని నాగార్జున. రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. సన్ పిక్చర్స్ బేనర్‌పై కళానిధి మారన్ నిర్మించారు. ఈ సినిమాలో నాగార్జున కీలకపాత్రలో నటించారు. ఈనెల 14న సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్, ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో నాగార్జున మాట్లాడుతూ 'నాకు కొత్తదనం ఇష్టం. సెట్‌కు వెళ్లాక బోర్ కొట్టకూడదంటే భిన్నమైన పాత్రలు చేయాలి. నా కెరీర్‌లో మొదటిసారి లోకేశ్ కథ చెబుతుంటే రికార్డు చేసుకున్నా.. ఇంటికి వెళ్లాక మళ్లీ మళ్లీ విన్నా. నాకు అనిపించిన కొన్ని మార్పులు సూచించా. నేను చెప్పిన విషయాలు పరిగణనలోకి తీసుకొని 'సైమన్' పాత్రను తీర్చిదిద్దిన విధానం నాకు నచ్చింది' అని అన్నారు. నిర్మాత సురేశ్ బాబు మాట్లాడుతూ 'బ్యాడ్ బాయ్ క్యారెక్టర్‌లో నాగార్జునని చూడటం చాలా ఆసక్తికరంగా అనిపిస్తోంది' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'నాగార్జున', 'అన్నమయ్య'తో ఒక కొత్త ట్రెండ్ ఎలా సెట్ చేశారో.. ఇప్పుడు 'కూలీ' సినిమాలో నెగెటివ్ రోల్‌లో అలాంటి కొత్త ట్రెండ్ చేయబోతున్నారు' అని అన్నారు. కాగా, ఈ సినిమాను తెలుగు రాష్ట్రాల్లో డి.సురేశ్ బాబు, దిల్‌రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్ యాజమాన్యంలోని ఏషియన్ మల్టీప్లెక్స్ సంస్థ విడుదల చేస్తోంది.





'భగవంత్ కేసరి' చిత్రానికి జాతీయ అవార్డ్ లభించిన సందర్భంగా శ్రీలీలకు కేక్ తినిపిస్తున్న బాలకృష్ణ

### నాగార్జున ఇంకా యువకుడే

- రజనీకాంత్



హైదరాబాద్‌లో నిర్వహించిన 'కూలీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రత్యేక వీడియో ద్వారా రజనీకాంత్ తెలుగు ప్రేక్షకులను పలకరించారు. 'నేను ఇండస్ట్రీకి వచ్చి 50 ఏళ్లు అవుతోంది. 'కూలీ' నా డైమండ్ జూబ్లీ పిక్చర్. నాగార్జున ఇందులో విలన్‌గా చేస్తున్నారు. దర్శకుడు లోకేశ్ సైమన్ పాత్రకు నాగార్జున పేరు చెప్పగానే షాక్ అయ్యాను. ఆ తర్వాత ఆయన ఒప్పుకొన్నారని తెలిసి సంతోషం కలిగింది. మేమిద్దరం 33 ఏళ్ల కిందట ఒక సినిమా చేశాం. అప్పుడు ఎలా ఉన్నారో, ఇప్పుడూ అలాగే ఉన్నారు. నాకు జుట్టు కూడా ఊడిపోయింది. ఆయన ఇంకా యువకుడిగానే కనిపిస్తున్నారు. సైమన్ పాత్రలో ఆయన నటన చూస్తుంటే నాకే ఆశ్చర్యం వేసింది. సినిమా గొప్పగా ఆడాలని, మీరందరూ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని రజనీకాంత్ అన్నారు.



### ఫన్ డ్రామా

వినయ్ రత్నం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'శ్రీ చిదంబరం'. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణారెడ్డి నిర్మిస్తున్నారు. వంశీ తుమ్మల, సంధ్య వశిష్ఠ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం టైటిల్ గ్లింప్స్‌ను హీరో కార్తికేయ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఫన్ డ్రామాగా సినిమా ఉంటుంది. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు పూర్తి సంతృప్తినిచ్చే సినిమా ఇది' అని చెప్పారు.






### నాకు ప్రత్యేకమైన చిత్రం

- బ్రహ్మానందం

నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తోన్న సినిమా 'గుర్రం పాపిరెడ్డి'. తమిళ హాస్యనటుడు యోగిబాబు కీలకపాత్రలో నటించారు. మురళీ మనోహర్ దర్శకత్వంలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్(బాబి) నిర్మిస్తున్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సినిమా టీజర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ 'ఇది నాకు ప్రత్యేకమైన చిత్రమవుతుంది. ఇందులో జడ్జి పాత్రలో నటించాను. మంచి కామెడీతో సాగే థ్రిల్లర్ మూవీ ఇది. కొత్త వాళ్లు ఇండస్ట్రీకి రావాలి. అప్పుడే మన సినిమా అభివృద్ధి చెందుతుంది' అని అన్నారు. యోగిబాబు మాట్లాడుతూ 'ఈ సినిమా ద్వారా నేరుగా తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడం సంతోషంగా ఉంది' అని అన్నారు. హీరో నరేశ్ అగస్త్య మాట్లాడుతూ 'సినిమాలో నేనే హీరో అంటున్నారు. కానీ ఇందులో నటించిన ప్రతీ పాత్రకూ ప్రాధాన్యం ఉంటుంది' అని అన్నారు. మురళీ మనోహర్ మాట్లాడుతూ 'బ్రహ్మానందం క్యారెక్టర్ ద్వారానే కథ నెరేట్ అవుతుంది. ఆయన ద్వారానే పాత్రలన్నీ పరిచయం అవుతాయి' అని చెప్పారు. నిర్మాతలు జయకాంత్, అమర్ బురా మాట్లాడుతూ 'ఈ సినిమా నరేశ్ అగస్త్యకు టర్నింగ్ పాయింట్ అవుతుంది' అని అన్నారు.

# యూనియన్‌తో పనిలేదు.. నైపుణ్యం ఉంటే చాలు

- ఫిల్మ్ ఛాంబర్ కీలక నిర్ణయం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

వేతనాలు పెంచాలంటూ సినీ కార్మికులు చేస్తున్న సమ్మె వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సినీ కార్మికుల సమ్మె డిమాండ్లకు ఏ మాత్రం తలొగ్గకూడదని నిర్మాతలంతా ఏకాభిప్రాయంతో ఓ గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఇకపై యూనియన్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రతిభ ఉన్న వారికి అవకాశం ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. రేపోమాపో తమ డిమాండ్లకు నిర్మాతలు అంగీకరించి తమ దారికి రాక తప్పదని ధీమాతో ఉన్న ఫెడరేషన్‌కు ఈ నిర్ణయం ఊహించని షాక్‌లాంటిది. తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ఓ అడుగు ముందుకు వేసి అనుభవం, ప్రతిభ కలిగిన వారికి మంచి అవకాశాలు కల్పిస్తామంటూ.. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆహ్వానిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనకు అధికారిక వెబ్‌సైటును, మెయిల్ ఐడీని జతచేసింది.

### మోయలేని భారం... అందుకే ఈ నిర్ణయం

ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సభ్యులు సోమవారం నుంచి సమ్మె చేపట్టిన సంగతి తెలిసిందే. వర్కర్లకు 30శాతం వేతనం పెంచిన నిర్మాతల సినిమాలకు పనిచేసి, ఇవ్వని వారి సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని వారు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ సోమవారం ఓ సంచలన నిర్ణయం తీసుకుంది. 'తెలుగు చిత్రపరిశ్రమ ఇప్పటికే చాలా ఇబ్బందికర పరిస్థితుల్లో ఉంది. ఇలాంటి సమయంలో వేతనాలు పెంచాలనడం, కార్మిక శాఖ కమిషనర్ మార్గదర్శకత్వంలో సామరస్యపూర్వక పరిష్కారం కోసం చర్చలు జరుగుతున్న సందర్భంలో ఫిల్మ్ ఫెడరేషన్ ఈ నిర్ణయం తీసుకోవడం సమంజసం కాదు. లేబర్ కమిషనర్ మాటను ధిక్కరిస్తూ, ఈ రోజు (సోమవారం) నుంచి 30శాతం వేతనం పెంపు ఇస్తామన్న ప్రొడ్యూసర్ నుంచి ఒప్పంద పత్రం తీసుకుని, సంబంధిత పత్రాన్ని ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేశాకే విధులకు వెళ్లాలని వారు నిర్ణయించడం బాధాకరం. ఇది నిజాయితీతో కూడిన చర్చల స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. వేతనాలు పెంపుదల చిన్న నిర్మాతలకు ఆమోదయోగ్యం కాదు. దానిని వారు భరించే స్థాయిలో లేరు. అందుకే ఈ వేతనాల పెంపును నిర్మాతలందరూ ఏకగ్రీవంగా వ్యతిరేకించారు. కనీస వేతనాల చట్టం ప్రకారం ఏ కార్మికుడినైనా నియమించుకునే హక్కు నిర్మాతలకు ఉందని కార్మిక శాఖ కమిషనర్ స్పష్టం చేశారు. అదనంగా, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కూడా నిర్మాతల స్వయంప్రతిపత్తిని సమర్థిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేసింది. ఫెడరేషన్ల ఒత్తిడి, పోటీని నిరోధించే పద్ధతులను ఖండిస్తూ, అలాంటి నిబంధనలను అమలు చేయకుండా నిరోధించింది. అన్ని యూనియన్ల వారికి ఇతర రాష్ట్రాల్లో కంటే మనమే ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నామనేది గమనించాలి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ ఏకగ్రీవంగా ఒక తీర్మానం తీసుకుంది. దీని ప్రకారం ఎవరికైతే మంచి నైపుణ్యం ఉండి, తగిన వేతనానికి పనిచేస్తారో.. వారు యూనియన్లో ఉన్నా లేకున్నా వాళ్ళతో పని చేయించుకోవడానికి నిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. నిర్మాత లేనిదే సినిమా పరిశ్రమ లేదు. మన చలనచిత్ర మనుగడ కోసం నిర్మాత శ్రేయస్సు అతి ముఖ్యమైన విషయం అని కార్మిక సంఘాలు మరొక్కసారి గుర్తించాలి" అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

### సమ్మె నిర్ణయం.. సినిమాలపై, నిర్మాతలపై ప్రభావం

సినీ కార్మికుల సమ్మె ప్రభావం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సినిమాలపై పడనుంది. షూట్ ఆగిపోవడంతో ఖర్చులు మరింత పెరుగుతాయి. సంబంధిత నటుల కాల్షీట్లు వృథా అవుతాయి, సినిమా సామాగ్రితో పాటు తదితర పనులకు అద్దెలు కూడా అదనపు భారంగా మారుతాయి. సోమవారం ఉదయం పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో జరుగుతోంది. సోమవారం నుంచి పవన్‌కల్యాణ్ ఇందులో పాల్గొనాల్సి ఉంది. సమ్మెకారణంగా ముంబై నుంచి కార్మికులను తెప్పించి చిత్రీకరణ రిహార్సల్స్‌ను మొదలుపెట్టారు మేకర్స్. అయితే, బంద్‌కు పిలుపునిచ్చిన తరుణంలో బయటినుంచి కార్మికులను రప్పించి షూట్ చేయడమేంటంటూ మేకర్స్‌పై మండిపడి వారి ప్రయత్నాలకు సినీ కార్మికులు అడ్డుపడి నిలిపివేశారు ఇటువంటి నేపథ్యంలో యూనియన్ సభ్యులు కాని వారిని నిర్మాతలు ప్రోత్సహించాలని నిర్ణయించుకోవడంతో ఏం జరుగుతుందో, ఫెడరేషన్ ఎలా స్పందిస్తుందో ఎదురు చూద్దాం.

## ప్రతి సమస్యకూ చర్చలతో పరిష్కారం

» ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులతో లోకేశ్

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాన్ని దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ సంఘ ప్రతినిధులు సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రిని కలిశారు. ఎంఈవో పోస్టుల్లో జిల్లా పరిషత్ టీచర్లకు అవకాశం ఇవ్వాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలుచేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. టీచర్ల ప్రతి సమస్యకూ చర్చల ద్వారా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో జరిగే క్లస్టర్ సమావేశాలకు తాను కూడా హాజరవుతానని చెప్పారు. నోబుల్ టీచర్ల సంఘం అధ్యక్షుడు కొండూరు శ్రీనివాస రాజు, ప్రధాన కార్యదర్శి హైమారావు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## ట్రైనీ ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు ప్రభుత్వం పోస్టింగ్‌లు ఇచ్చింది. ఫేజ్-2 శిక్షణ పూర్తి చేసుకున్న 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్‌లకు సబ్ కలెక్టర్లుగా పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లి సబ్ కలెక్టర్‌గా చల్లా కళ్యాణిని నియమించారు. అక్కడ పనిచేస్తున్న వై.మేఘా స్వరూప్‌ను బదిలీ చేశారు. కందుకూరు సబ్ కలెక్టర్‌గా డి.హిమ వంశీ, పాలకొండ సబ్ కలెక్టర్‌గా పవర్ స్వప్నిల్ జగన్నాథ్, నూజివీడు సబ్ కలెక్టర్‌గా బొల్లిపల్లి వినూత్న, రాజంపేట సబ్ కలెక్టర్‌గా హెచ్.ఎస్.భావన, రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా శుభమ్ నొఖ్వాల్, పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా ఆర్.వైశాలిని నియమించారు. పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవను ప్రభుత్వం బదిలీ చేసింది. వీరంతా జూన్ 25న ముస్సోరీలోని శిక్షణ నుంచి బయటికి వచ్చారు. ఈనెల 8వ తేదీలోగా వారికి కేటాయించిన స్థానాల్లో జాయిన్ కావాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఏపీలోని 2 కేంద్ర వర్సిటీలకు ఐదేళ్లలో 529 కోట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో ఏపీలోని రెండు కేంద్ర విశ్వవిద్యాలయాలకు రూ.529.14 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ వెల్లడించారు. ఏపీలోని సెంట్రల్ యూనివర్సిటీకి 2020-21 నుంచి 2024-25 వరకు రూ.404.05 కోట్లు విడుదల చేయగా, గిరిజన విశ్వవిద్యాలయానికి గత ఐదేళ్లలో రూ.125.09 కోట్లు విడుదల చేసినట్లు వివరించారు. సోమవారం లోక్‌సభలో ఎంపీ చిన్ని అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు.

## 'ఉద్యోగులకు' 24% హెచ్‌ఆర్‌ఏ కొనసాగింపు

ఆంధ్రప్రదేశ్ సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయ ఉద్యోగులకు ప్రస్తుతం అమలుచేస్తున్న 24 శాతం హెచ్‌ఆర్‌ఏను మరో ఏడాదిపాటు కొనసాగిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

## జిల్లాల్లో జెండా పండుగ అతిథులు వీరే

» మంత్రుల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం

గుంటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరిగే వేడుకల్లో జాతీయ జెండాలను ఎగురవేసి సందేశాలను ఇచ్చే మంత్రుల జాబితాని ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. విజయవాడలోని మునిసిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర వేడుకలో సీఎం చంద్రబాబు త్రివర్ణ పతాకాన్ని ఎగరేస్తారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడలో, మంత్రులు నారా లోకేశ్(గుంటూరు), కింజరాపు అచ్చెన్నాయుడు(శ్రీకాకుళం), కొల్లు రవీంద్ర(కృష్ణ), నాదెండ్ల మనోహర్(పల్నాడు), పొంగూరు నారాయణ(ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు), వంగలపూడి అనిత(అనకాపల్లి), సత్యకుమార్ యాదవ్(చిత్తూరు), నిమ్మల రామానాయుడు(పశ్చిమ గోదావరి), ఎన్ఎండీ ఫరూక్(వైఎస్ఆర్ కడప), ఆనం రామనారాయణరెడ్డి(తిరుపతి), పయ్యావుల కేశవ్(అనంతపురం), అనగాని సత్యప్రసాదు(విశాఖపట్టణం), కొలుసు పార్థసారథి(ఏలూరు), బాల వీరాంజనేయ స్వామి(ప్రకాశం), గొట్టిపాటి రవికుమార్(బాపట్ల), కందుల దుర్గేశ్(తూర్పు గోదావరి), గుమ్మడి సంధ్యారాణి(పార్వతీపురం మన్యం), బీసీ జనార్దన్‌రెడ్డి(నంద్యాల), టీజీ భరత్(కర్నూలు), ఎస్.సవిత(శ్రీ సత్యసాయి), వాసంశెట్టి సుభాశ్(కోనసీమ), కొండపల్లి శ్రీనివాస్(విజయనగరం), ఎం రాంప్రసాద్‌రెడ్డి(అన్నమయ్య) పాల్గొంటారు. అల్లూరి జిల్లాకు అక్కడి కలెక్టర్‌కే బాధ్యతలు కేటాయించింది. ఈ విషయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ(పొలిటికల్) ముఖేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులను పంపించారు.

## ప్రజారోగ్యంతో జగన్ మద్యం వ్యాపారం

» వైసీపీ పాలనలో 1,745 మంది ఆత్మహత్యలు: నీలాయపాలెం

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మత్తు పదార్థాలకు బానిసలై 1,745 మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఏపీ బయోడైవర్సిటీ బోర్డుచైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ఆఫీసులో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యంతో వ్యాపారంచేసిన వ్యక్తిగా జగన్‌చరిత్రలో నిలిచిపోతారన్నారు.

## అంగన్వాడీలను రెచ్చగొడుతున్నారు: సునీత

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కొన్ని కార్మిక సంఘాలు తమ రాజకీయ స్వప్రయోజనాల కోసమే అంగన్వాడీ కార్యకర్తలను తప్పుదోవ పట్టిస్తున్నాయని టీఎన్‌ఏటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు, అంగన్వాడీ, డ్వాక్రా సాధికార సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత విమర్శించారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఇస్తున్న ఫోన్లను తిరిగి ఇచ్చేయాలని, మాన్యువల్‌గా రికార్డులు రాసుకోవాలని చెబుతూ అంగన్వాడీలను కార్మిక సంఘాలు రెచ్చగొడుతున్నాయన్నారు. అంగన్వాడీలు తమపై పని భారం తగ్గించమని, సెల్ ఫోన్లు పనిచేయడం లేదని పదే పదే విజ్ఞప్తి చేయగా ప్రభుత్వం స్పందించి 5 జీ ఫోన్లు ఇచ్చేందుకు సిద్ధమైందని తెలిపారు.

## ఆప్కాబ్ సేవలు రాష్ట్రాభివృద్ధిలో కీలకం కావాలి

» తక్కువ వడ్డీకి రుణాలివ్వాలి: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో ఆప్కాబ్ సేవలు కీలకం కావాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం విజయవాడలో ఆప్కాబ్ 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అచ్చెన్న మాట్లాడారు. సహకార బ్యాంకుల సేవలు మరింత మెరుగుపడాలన్నారు. ఆప్కాబ్, డీసీసీబీలు, పీఏసీఎస్‌ల్లో పారదర్శకత, జవాబుదారీ తనం కోసం కంప్యూటరీకరణ చేస్తున్నామన్నారు. ప్రైవేట్ బ్యాంకుల కన్నా తక్కువ వడ్డీకి రుణాలిచ్చేలా కృషి జరగాలని సూచించారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పాల్గొన్నారు.


## వర్సిటీల సహకారంతో పరిశ్రమల్లో భద్రత

» కార్మికుల్లో నైపుణ్యాల పెంపునకు కృషి: మంత్రి సుభాశ్

అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతకు, ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నామని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. కార్మికుల్లో నైపుణ్య సామర్థ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ మేరకు అవసరమైన విధాన రూపకల్పన, పరిశోధనలను ముందుకు తీసుకెళ్లేందుకు శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ), జేఎన్‌టీయూ అనంతపురం, డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌తో సోమవారం అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నట్టు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో లేబర్ కమిషనర్ ఎం శేషగిరి బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆ అమూల్య క్షణాలు మరువలేనివి

» మోదీని కలిసిన కేంద్ర మంత్రి పెమ్మసాని కుటుంబం



న్యూఢిల్లీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తన కుటుంబ సభ్యులతో ప్రధాని నరేంద్ర మోదీని సోమవారం కలిశారు. ఆ తర్వాత తన ఆనందాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'ఈరోజు ప్రధాని నరేంద్ర మోదీని కుటుంబ సభ్యులతోపాటు మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం లభించింది. మోదీని కలిసిన ఈ అమూల్యమైన క్షణాలు మరువలేనివి. మా కోసం తన విలువైన సమయాన్ని కేటాయించినందుకు మా కుటుంబం తరఫున మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. మోదీ దూరదృష్టి గల నాయకత్వం, అంకితభావం, వినయశీలతతో కూడిన వ్యక్తిత్వం మమ్మల్ని ఎంతో ప్రభావితం చేసింది. ఈ క్షణాలు మాకు ఎప్పటికీ గుర్తుండిపోతాయి' అని పెమ్మసాని పేర్కొన్నారు.

# అధికార భాషా సంఘానికి 'మండలి' పేరు!

### వెంకట కృష్ణారావు సేవాభావం ఉన్న నేత: చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో అధికార భాషా సంఘం ఏర్పాటు కావడానికి మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు ముఖ్యకారకుడని సీఎం చంద్రబాబు తెలిపారు. ఆయన చట్టసభల్లో బిజీగా ఉన్నా, ప్రజాసేవలో ఉన్నా భాషాభిమానాన్ని ఎక్కడా తగ్గించుకోలేదని.. అందుకే రాష్ట్రంలో అధికార భాషా సంఘానికి ఆయన పేరు పెట్టాలని నిర్ణయించామని చెప్పారు. ఇక నుంచి అది 'మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం'గా ఉంటుందన్నారు. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మండలి శతజయంతి వేడుకలు జరిగాయి. సీఎం తొలుత కృష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. ఒకప్పుడు సేవాభావం కలిగిన నాయకత్వం, విలువతో కూడిన రాజకీయాలు ఉండేవని వ్యాఖ్యానించారు. ఇప్పుడు రాజకీయాల్లో పూర్తిగా విలువలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేను వ్యక్తిగత రాజకీయం చేయను. సమాజహితం కోసమే రాజకీయాలు చేస్తా. ఎవరు రెచ్చగొట్టినా లైన్ దాటలేదు. విలువలు, సంపాదన కలిసి ముందుకు సాగాలి. మండలి వెంకట కృష్ణారావు పవిత్రత, సేవాభావం కలిగిన నేత. 1978లో ఆయనతో కలిసి ఎమ్మెల్యేగా పనిచేశాను. దివిసీమకు ఉప్పెన వచ్చినప్పుడు ఆయన అందించిన సేవలపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరిగింది. గాంధీజీ ఆశయాలను, ఆదర్శాలను పాటించి మండలి ప్రజలకు సేవ చేశారు. చరిత్ర ఉన్నంత వరకు కృష్ణా జిల్లా ప్రజల గుండెల్లో ఆయన నిలిచి ఉంటారు. స్వాతంత్ర సమరయోధుల కోటాలో తనకిచ్చిన ఐదెకరాలను పేదలకు పంపిణీ చేశారు' అని వివరించారు. భారతదేశంలో ఉన్న కుటుంబ వ్యవస్థ ఏ దేశంలోనూ లేదన్నారు. 'కుటుంబ వ్యవస్థ ఒక భద్రత. దాని వల్ల ఎన్ని సమస్యలున్నా అధిగమించగలం' అని చెప్పారు.

### తెలుగుజాతి సమైక్యత కోసం పాటుబడ్డారు

మండలి కుమారుడు, అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. తన తండ్రి తెలుగుజాతి, మానవజాతి సమైక్యత కోసం పాటుపడ్డారని తెలిపారు. 'ఏ లైట్ హౌస్ ఇన్ ది స్టార్మ్' పేరుతో రూపొందించిన ఆంగ్ల వ్యాసాల సంపుటిని, భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు చిత్రీకరించిన మండలి వెంకట కృష్ణారావు చిత్రపటాన్ని, ఆయన రాసిన 'ఆదర్శ నేత, అజాత శత్రువు మండలి వెంకట కృష్ణారావు' అనే పుస్తకాన్ని సీఎం ఈ సందర్భంగా ఆవిష్కరించారు.



గరికపాటిని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, పక్కన మండలి బుద్ధప్రసాద్

# 'స్మార్ట్' రేషన్ కార్డులు రెడీ!

» చెన్నైలో ముద్రణ.. అక్కడి నుంచే నేరుగా మండలాలకు

» 25 నుంచి 31 వరకు లబ్ధిదారులకు పంపిణీకి ఏర్పాట్లు

అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కొత్త 'స్మార్ట్' రేషన్ కార్డులు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు వీటిని రేషన్ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుని క్యూఆర్ కోడ్‌తో ఆకర్షణీయంగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం నెల క్రితం ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ద్వారా టెండరు ప్రక్రియ పూర్తిచేశారు. కార్డులు ప్రస్తుతం చెన్నైలో ముద్రణ దశలో ఉన్నాయి. పూర్తయిన కార్డులను ఎప్పటికప్పుడు అక్కడి నుంచే నేరుగా రాష్ట్రంలోని మండల కేంద్రాలకు రవాణా చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25 నుంచి 31వ తేదీ లోపు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రచార పిచ్చితో రేషన్ కార్డులపై కూడా తమ పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, రెండో వైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. వాటి స్థానంలో కొత్తగా క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులను అందించాలని నిర్ణయించిన కూటమి ప్రభుత్వం.. గతంలో మాదిరిగా రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో రూపకల్పన చేసింది. దీనిపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబర్, రేషన్‌షాపు నంబర్ తదితర వివరాలు ఉంటాయి. వెనుక వైపు మిగిలిన లబ్ధిదారుల వివరాలుంటాయి. సెప్టెంబరు నుంచి ఈ స్మార్ట్ రేషన్ కార్డులపైనే సరుకులు పంపిణీ చేయనున్నారు.


### రాష్ట్రవ్యాప్తంగా 1.46 కోట్ల కార్డులు

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం దాదాపు 1.46 కోట్ల కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే గత ఐదేళ్లలో కొత్తగా వివాహం చేసుకుని వేరుగా కాపురం పెట్టిన నవదంపతులు, అర్హతలున్న పేదలు రేషన్ కార్డుల కోసం లక్షలాదిగా దరఖాస్తులు చేసుకున్నారు. కానీ అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ దరఖాస్తులు మూలనపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అర్హత ఉన్నవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న కార్డుల్లో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పించింది. ఇందుకోసం గత మే నెలలో దరఖాస్తులు స్వీకరించింది. మరోవైపు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో రేషన్ కార్డుల ఈకేవైసీని పూర్తి చేసింది. ఈ కసరత్తు పూర్తి తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 3,56,000 మంది రేషన్ లబ్ధిదారులు మరణించినట్లుగా గుర్తించారు. వారిని కార్డుల నుంచి తొలగించింది. మార్పులు, చేర్పుల కోసం 16,08,612 దరఖాస్తులు రాగా, వాటిలో 15,32,758 దరఖాస్తులను పరిష్కరించారు. కొత్తగా 9,08,644 మందిని సభ్యులుగా నమోదు చేశారు. వీరితో కలిపి రాష్ట్రంలో రేషన్ లబ్ధిదారుల సంఖ్య 4,29,79,897కు చేరింది. వీరంతా 1,45,97,486 కుటుంబాల్లో సభ్యులుగా ఉన్నారు.

### ఏజెన్సీలో డిపోలు దూరంగా ఉంటే

## ఇంటికే రేషన్

» 69 మినీ రేషన్ డిపోల ఏర్పాటు: మంత్రి మనోహర్



పాడేరు మండలం మినుములూరు డిపోలో బియ్యం పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

పాడేరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో రేషన్ డిపోలకు దూరంగా ఉన్న వారి ఇంటికే సరుకులు పంపిణీ చేపడతామని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రేషన్ డిపోలకు దూరంగా ఉన్న గ్రామాల్లోని లబ్ధిదారుల కోసం 69 మినీ రేషన్ డిపోలను ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా డిపోల్లో సరసమైన ధరకు నిత్యావసర సరుకులన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని చెప్పారు.సోమవారం అల్లూరి జిల్లా పాడేరు మండలం మినుములూరు రేషన్ డిపోను, పాడేరులోని గోదామును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో ఎండీయూ వ్యవస్థతో పోల్చితే ప్రస్తుత విధానంలోనే లబ్ధిదారులు స్వేచ్ఛగా రేషన్ సరుకులు పొందుతున్నారన్నారు.

### ఆ విద్యార్థులకు

## మరో చాన్స్

» బీటెక్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు గడువు పొడిగింపు

» ఎట్టకేలకు స్పందించిన ఉన్నత విద్యామండలి

» ఎంటెక్ అడ్మిషన్లపై త్వరలో సవరణ షెడ్యూల్

» 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదలిక

అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలు, ప్రైవేటు కాలేజీలు సర్టిఫికెట్లు మంజూరు చేయని కారణంగా.. గడువు పూర్తవడంతో ఎంటెక్ అడ్మిషన్ అవకాశం కోల్పోయిన విద్యార్థులకు మరో అవకాశం లభించింది. పీజీఈసెట్‌లో సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసేందుకు మరో అవకాశం ఇవ్వనున్నట్లు ఉన్నత విద్యామండలి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. యూనివర్సిటీల నుంచి బీటెక్ సర్టిఫికెట్లు జారీకానందున కొంత సమయం ఇవ్వాలని రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల నుంచి వినతులు వచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఆయా విద్యార్థుల కోసం అప్సన్ల ప్రక్రియతో సహా సవరణ షెడ్యూల్‌ను త్వరలో విడుదల చేస్తామని తెలిపింది. ప్రభుత్వం వద్ద ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నందున పలు యూనివర్సిటీలు, ప్రైవేటు కాలేజీలు విద్యార్థులకు బీటెక్ సర్టిఫికెట్లు నిలిపివేశాయి. ఈలోగా పీజీఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. సోమవారం ప్రచురితమైన 'చేజారిన ఎంటెక్ చాన్స్' కథనంపై స్పందించిన ప్రభుత్వం సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు మరోసారి విద్యార్థులకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వేల మంది విద్యార్థులకు మేలు జరగనుంది. అయితే సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు గడువు పొడిగించడంతో తమ గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ల జారీపై యూనివర్సిటీలు, కాలేజీలకు ఆదేశాలు ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు. లేకుంటే గడువు పొడిగించినా ఉపయోగం లేదని అభిప్రాయపడుతున్నారు.

### విచారణ పేరుతో

# ఎస్‌ఐ వేధింపులు

» గుండెపోటుకు గురైన టీడీపీ నేత

» స్టేషన్‌ను ముట్టడించిన గ్రామస్థులు

» మైనింగ్ వ్యతిరేక పోరాటంలో కీలకంగా బూత్ కన్వీనర్ పీరయ్య



పోలీసులను నిలదీస్తున్న వరికుంటపాడు గ్రామస్థులు




టీడీపీ నేత పీరయ్యను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ వేధింపుల కారణంగా టీడీపీ నేత, బూత్ కన్వీనర్ షేక్ పీరయ్య గుండెపోటుకు గురైన ఘటన తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. నెల్లూరు జిల్లా మండల కేంద్రమైన వరికుంటపాడు పంచాయతీ జంగంరెడ్డిపల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో మైనింగ్(తెల్లరాయి) తవ్వకాలను రద్దు చేయాలని స్థానికులు కొన్నాళ్లుగా ఆందోళన చేస్తున్నారు. వీరి ఆందోళనలో పీరయ్య కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆందోళనకారులపై కేసులు నమోదు చేసిన పోలీసులు పీరయ్యను సోమవారం ఉదయాన్నే ఇంటి నుంచి బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పలువురు గ్రామస్థులు స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఘటనపై బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. స్టేషన్‌లో మిగిలిన వారిని దూరంగా పంపించేసిన ఎస్‌ఐ రఘునాథ్ తెల్లకాగితంపై సంతకం చేయాలని పీరయ్యను ఒత్తిడి చేశారు. ఆయన సంతకం చేయకుండా దూరంగా వచ్చారు. పట్టు వదలని ఎస్‌ఐ రఘునాథ్.. మరోమారు బలవంతంగా గదిలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ స్థితిలో మానసికంగా ఒత్తిడికి గురైన పీరయ్య ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. దీంతో అక్కడే ఉన్న గ్రామస్థులు 108 వాహనంలో ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తీసుకెళ్లారు. గతంలో రెండుమార్లు గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్న పీరయ్యకు మరోమారు ఒత్తిడి పెరగడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

**గ్రామస్థుల ఆందోళన**

పీరయ్య అపస్మారక స్థితికి చేరుకున్నాడని తెలుసుకున్న గ్రామస్థులు స్టేషన్ వద్దకు భారీగా చేరుకుని జాతీయ రహదారిపై రాస్తారోకోకు పూనుకున్నారు. పోలీసులు అడ్డుకోవడంతో మరింత కోపోద్రిక్తులై స్టేషన్ ముట్టడికి దూసుకెళ్లారు. పరిస్థితి అదుపు తప్పుతోందని భావించిన ఉన్నతాధికారులు సిబ్బందిని భారీ సంఖ్యలో మోహరించారు. జోరు వర్షం కురుస్తున్నా లెక్కచేయని ఆందోళనకారులు రాత్రి వరకు ఆందోళనను కొనసాగించారు. కావలి డీఎస్పీ శ్రీధర్ దుత్తలూరుకు చేరుకుని జేఏసీ నాయకులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రఘునాథ్‌ను సస్పెండ్ చేసే వరకు ఆందోళన విరమించేదిలేదని వారు తేల్చిచెప్పారు. చివరికి కొంతమంది మధ్యవర్తిత్వం నడుమ శాంతించిన ఆందోళనకారులు అక్కడ నుంచి వెనుదిరిగారు.



రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలతో గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు

## రాష్ట్రపతి, ప్రధానితో గోవా గవర్నర్ భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సోమవారం ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో ముర్మును కలిసి కొంతసేపు ముచ్చటించారు. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లను గవర్నర్ అశోక్ గజపతిరాజు కలిశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు సోమవారం పార్లమెంట్‌లోని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా అశోక్ గజపతి రాజుకు టీడీపీ ఎంపీలు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

## ఈఏడాది చివరికి చెత్త రహిత రాష్ట్రం: నారాయణ

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివరికల్లా రాష్ట్రాన్ని లెగసీ వేస్ట్ ఫ్రీ స్టేట్‌గా మారుస్తామని మంత్రి నారాయణ అన్నారు. సోమవారం విజయవాడలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఐఈసీ, కెపాసిటీ బిల్డింగ్‌పై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యమివ్వాలని మంత్రి అన్నారు. ప్రస్తుతం ఉన్న విశాఖపట్నం, గుంటూరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లతో పాటు కొత్తగా కడప, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతిలో కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు రెండేళ్లలో ఏర్పాటు చేస్తామన్నారు. అమృత పథకం నిధులతో డ్రింకింగ్ వాటర్ పైప్‌లైన్లు పూర్తి చేస్తామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరాం, మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ సంపత్ కుమార్ తదితరులు ప్రసంగించారు.

## ఆ రూ.11 కోట్ల వీడియోలు ఇవ్వండి

» సిట్, బ్యాంక్ మేనేజర్‌కు ఏసీబీ కోర్టు ఆదేశం

విజయవాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌లో స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్ల నగదుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను తమకు అందజేయాలని సిట్, బ్యాంక్ మేనేజర్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నగదును ఇతర నగదుతో కలపకుండా ప్రత్యేకంగా ఉంచాలని ఈ నెల 2వ తేదీన ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. కోర్టు ఆదేశాలు ఇచ్చే సమయానికి నగదు చెస్ట్ (నగదును భద్రపరిచే విభాగం)కు వెళ్లిపోయింది. రూ.11 కోట్లు విజయవాడలోని సిట్ కార్యాలయం నుంచి మాచవరం ఎస్‌బీఐ బ్యాంక్‌కు వెళ్లడం, అక్కడి నుంచి చెస్ట్‌కు వెళ్లిన వీడియోలను భద్రపరచాలని, ఆ నోట్లపై సీరియల్ నంబర్లను రికార్డు చేయాలని ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తరఫున న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం వాదనలు జరిగాయి. కసిరెడ్డి తరఫున మాజీ ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, దుశ్యంత్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, విష్ణువర్ధన్ వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. ఫామ్‌హౌస్ నుంచి రూ.20 కోట్లు సీజ్ చేసిన సిట్ రూ.11 కోట్లను స్వాధీనం చేసుకున్నట్టు చూపిందని పొన్నవోలు వాదించారు. ఈ నగదును ప్రత్యేకంగా ఉంచాలని కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ వాటిని పాటించలేదన్నారు. నగదు సిట్ కార్యాలయం నుంచి బయలుదేరినప్పటి నుంచి ఎస్‌బీఐకి వెళ్లడం, అక్కడి నుంచి చెస్ట్‌కు చేరడం.. ఈ మొత్తం ప్రక్రియకు సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజీని భద్రపరచాలని కోరారు. ఇరువైపు వాదనలు విన్న అనంతరం న్యాయాధికారి పి.భాస్కరరావు సిట్ దర్యాప్తు అధికారికి, బ్యాంక్ మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు.

# అంతు చిక్కని ట్రూఅప్ లెక్క!

(మొదటి పేజీ తరువాయి)

లెక్కలు తీసి బాదుతూనే... మళ్లీ ఐదేళ్లకు కలిపి మరో బాదుడు ఏంటని అసలు ప్రశ్న! అదేమిటంటే... ఐదేళ్లలో వచ్చిన రెవెన్యూ లోటును ఇప్పుడు వసూలు చేసుకుంటామని డిస్కమ్‌లు అంటున్నాయి. ఈ లెక్కలను అప్పుడు చూపించలేదని, ఇప్పుడు ఆ భారాన్ని వసూలు చేసుకుంటామని వింత వాదన చేస్తున్నాయి. జగన్ జమానాలో విచ్చలవిడిగా ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు, ఇతర పరికరాలను అధిక ధరలకు కొనుగోలు చేసిన ఫలితం ఇప్పుడు రాష్ట్ర ఖజానాకు శాపంగా మారిందని విద్యుత్ రంగ నిపుణులు ఆక్షేపిస్తున్నారు. 2019-20 నుంచి 2024-25 మధ్య రూ.12,717 కోట్ల మేర ట్రూఅప్ భారంపై ఈఆర్‌సీ ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. ఇది ప్రభుత్వాన్ని ఇరుకునపడేసింది. ఆ నష్టాన్ని పూడ్చాలంటే డిస్కంలకు ఆ మొత్తాన్ని తానే చెల్లించాలి. లేకపోతే ఈ భారాన్ని ప్రజలపై వేయాల్సి వస్తుంది. ఇప్పటికే జగన్ జమానా భారం రూ.15 వేల కోట్లను గత ఏడాది నుంచీ ట్రూ-అప్ చార్జీల రూపంలో కడుతున్న జనంపై.. ఇంకో 12,717 కోట్ల భారం వేస్తే తీవ్ర వ్యతిరేకత వస్తుందని ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. ఈఆర్‌సీ నోటీసుకు ఈ నెల 29న సమాధానం ఇస్తామని.. జనంపై ఎలాంటి భారం పడకుండా వచ్చే ఏడాది ఆదాయ వ్యయ నివేదికలో సర్దుబాటు చేసుకుంటామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఇప్పటికే ప్రకటించారు. అయితే.. ఇంత పెద్దమొత్తం ఎలా సర్దుబాటు చేసుకుంటారని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద జరిగిన భేటీలో ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సందేహం లేవనెత్తారు.

### జగన్ జమానా భారం...

వైసీపీ హయాంలో 2019-20 నుంచి 24-25 దాకా రూ.వేల కోట్ల ట్రూఅప్ చార్జీల భారం మోపారు. జనం గగ్గోలు పెట్టినా 2023-24, 24-25 సంవత్సరాల్లోనూ భారీగా రూ.19,950 కోట్ల మేర ట్రూ-అప్ చార్జీల భారాన్ని జగన్ హయాంలో ప్రతిపాదించారు. ఎన్నికలకు ముందు భారీగా వసూలు చేస్తే జగన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంటుందనే ఉద్దేశంతో... ఎన్నికలు ముగియగానే రూ.15,169 కోట్ల విద్యుత్ భారం మోపేందుకు డిస్కమ్‌లకు ఈఆర్‌సీ అనుమతి లభించింది. ఇప్పుడూ... 2019-25 నడుమ రెవెన్యూ లోటు పేరుతో ఇంకో 12,717 కోట్లను ట్రూఅప్ చార్జీల కింద వినియోగదారుల నుంచి వసూలు చేసుకుంటామని డిస్కంలు పేర్కొనడం, దీనిపై ఈఆర్‌సీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వడం గమనార్హం.



అన్నదాత సుఖీభవ సొమ్ము అందుకున్న అనంతపురం జిల్లా శింగనమల మండలం సి.బండమీదపల్లికి చెందిన అంజినమ్మ

# అన్నదాత కళ్లలో మెరుపులు

- సుఖీభవ సాయం కోసం బ్యాంకులకు..
- ఉత్సాహంగా డ్రా చేసుకున్న రైతులు

శింగనమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'అన్నదాత సుఖీభవ' నగదు సాయంలోని మెరుపు రైతుల కళ్లలో కనిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జమ చేసిన ఈ పథకం సొమ్మును డ్రా చేసుకోవడానికి వచ్చిన రైతులు బ్యాంకుల వద్ద ఆనందంగా కనిపించారు. శనివారం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసింది. అయితే, మరుసటి రోజు ఆదివారం కావడంతో నగదు తీసుకోలేకపోయారు. దీంతో సోమవారం అనంతపురం జిల్లాలోని బ్యాంకులకు తరలివచ్చిన రైతులతో సందడి వాతావరణం నెలకొంది. శింగనమల మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు, సలకం చెరువులోని స్టేట్ బ్యాంకులో వందలాది మంది రైతులు డబ్బులు డ్రా చేసుకున్నారు. నగదు లెక్క పెట్టుకుంటూ, పరస్పరం పలకరించుకుంటూ ఉత్సాహంగా కనిపించారు.

### రైతు బిడ్డ చంద్రబాబు..



"ఎన్నికలప్పుడు రైతులకు అండగా ఉంటానని చంద్రబాబు మాటిచ్చారు. ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ కింద చెల్లిస్తానని చెప్పారు. ఇచ్చిన మాట నెరవేర్చి రైతులకు అండగా నిలిచారు. చంద్రబాబు రైతు బిడ్డ అనిపించుకున్నాడు."

- చిన్న ఎర్రినాగప్ప, శివపురం, అనంతపురం

### రైతులను మరవని నేత..

"రాష్ట్రం ఎంత కష్టాల్లో ఉన్నా చంద్రబాబు రైతులను మరిచిపోలేదు. మా కుటుంబాల్లో ఆనందం నింపడానికి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ డబ్బులు ఇచ్చారు. మొదటి విడత మాకు రూ.7 వేలు వచ్చింది. - అంజినమ్మ, సి.బండమీదపల్లి, అనంతపురం

### విత్తనాలకు చేసిన అప్పు తీరుస్తా..

"పంట సాగు కోసం ఇబ్బంది పడుతున్న సమయంలో ప్రభుత్వం డబ్బులిచ్చింది. విత్తనాల కోసం మరో రైతు వద్ద అప్పు చేశాను. అన్నదాత సుఖీభవ డబ్బులు ఖాతాలో పడినట్టు శనివారం మెసేజ్ వచ్చింది. ఆ డబ్బులతో విత్తనాల కోసం చేసిన అప్పు తీరుస్తా. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం నెరవేర్చారు. చాలా సంతోషంగా ఉంది."

- ఆదినారాయణ, సోదనపల్లి, అనంతపురం

# 15 నుంచి ఆన్‌లైన్‌లో 700 ప్రభుత్వ సేవలు



- తలసరి ఆదాయం పెంచడం ద్వారా జీవన ప్రమాణాలు పెంచాలి
- పథకాల అమలుతోపాటు ఆదాయం పెరిగేలా చూడాలి
- రాష్ట్ర స్థూల ఉత్పత్తిపై సమీక్షలో చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విజన్, ప్రజలు, ప్రకృతి, సాంకేతికతలకు పాలనలో ప్రాధాన్యమిస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, పనితీరు సూచీలపై ప్రణాళికా శాఖతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో, ముఖ్యమంత్రి సచివాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 15 నుంచి ఆన్‌లైన్‌లో 700 ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. కేవలం 60 లక్షల జనాభా, పరిమితమైన వనరులతో సింగపూర్ అంతర్జాతీయంగా విజయాలు సాధిస్తోంది. భారత్‌లో 140 కోట్లకు పైగా జనాభా, అపారమైన వనరులతో చాలా విజయాలు సాధించే అవకాశం ఉంది. ప్రతీ త్రైమాసికానికి సాధిస్తున్న పురోగతిపై ప్రభుత్వ శాఖలు సమీక్షించుకోవాలి. తలసరి ఆదాయం పెంచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి. 2025-26లో తలసరి ఆదాయం రూ.3,47,871 సాధించాలి. 2029 నాటికి రూ.5.42 లక్షల తలసరి ఆదాయం వచ్చేలా లక్ష్యంగా పెట్టుకోవాలి. ప్రస్తుతం అవేర్ ద్వారా వివిధ విభాగాలకు సంబంధించిన 42 సూచీలను పర్యవేక్షిస్తున్నాం. మిగతా ప్రభుత్వ విభాగాలు కూడా సూచీలను ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వ శాఖలు ఆయా రంగాల్లో ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. కుటుంబం ఒక యూనిట్‌గా తీసుకుని పథకాలు, కార్యక్రమాలు రూపొందించాలి. పథకాలతో పాటు వారి ఆదాయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. పర్యావరణానికి మేలు చేసే విధంగా ప్రభుత్వ విధానాలు, ప్రజలు ఆలోచనలు ఉండాలి. సహజ వనరులను రక్షించుకుంటూ ప్రకృతిని కాపాడుకోవాలి. ఒక పరిశ్రమలో తయారైన వ్యర్థాన్ని మరో పరిశ్రమకు ముడిసరుకు అయ్యేలా చేసి సర్క్యులర్ ఎకానమీకి నాంది పలకాలి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పుల మేరకు ప్రణాళికలు రూపొందించుకోవాలి. మన ఉత్పత్తులకు విలువ జోడింపు అనేదే కీలకం. దీంతోనే రాష్ట్ర స్థూల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. జీఎస్డీపీ వృద్ధి అయితేనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించగలం. ప్రజలకు నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యం. ప్రతీ కుటుంబం ఆర్థిక, ప్రజారోగ్య వివరాలు నమోదు కావాలి. అడవుల విస్తరణ, నాణ్యమైన గాలి, తలసరి విద్యుత్ వినియోగాన్ని సంబంధిత శాఖలు నమోదు చేయాలి' అని చంద్రబాబు ఆయా శాఖాధిపతులను ఆదేశించారు. ప్రస్తుతం ఉద్యాన పంటల ద్వారా రూ.1,26,098 కోట్ల జీవీఏ వచ్చిందనీ, ఆక్వా అనుబంధ పరిశ్రమలకు రూ.1.12 లక్షల కోట్ల మేర జీవీఏ జోడించినట్టు అధికారులు చెప్పారు.



అబ్కారీ శాఖపై సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్

# గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు సహకరించండి

- 'రామాయపట్నం రిఫైనరీ'ని వేగవంతం చేయండి
- కేంద్ర మంత్రికి టీడీపీ ఎంపీల బృందం వినతి

న్యూఢిల్లీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీ కారిడార్(జీఈసీ-3) ఏర్పాటు విషయమై ఏపీకి సహకరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని టీడీపీ ఎంపీలు కోరారు. ఢిల్లీలో సోమవారం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో కలిసి ఆయనకు వినతి పత్రం అందజేశారు. 2029 నాటికి 72 గిగావాట్లు, 2036-37ఆర్థిక సంవత్సరం నాటికి 30,975 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, దీనికి సహకరించాలని కోరారు. అలాగే, రామాయపట్నం బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటును వేగవంతం చేయాలని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరిని టీడీపీ ఎంపీలు కోరారు. ఏపీలో పెట్రోలియం, గ్యాస్ ప్రాజెక్టులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓఎన్జీసీ జాక్ అప్ రిగ్ కాంట్రాక్టు కోసం హిందుస్థాన్ షిప్ యార్డును పరిగణనలోకి తీసుకోవాలని, పీఎం ఉజ్వల యోజన కింద 65.40 లక్షల దీపం లబ్ధిదారులకు ప్రయోజనాలు కల్పించాలని అన్నారు. కేంద్రమంత్రులను కలిసిన వారిలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, నాగరాజు, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బైరెడ్డి శబరి తదితరులు ఉన్నారు.

### ఉక్కు కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించండి: శ్రీభరత్

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామిని ఎంపీ శ్రీభరత్ కోరారు. సోమవారం ఆయన ఢిల్లీలో మంత్రిని కలిశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంగణంలోని కేంద్రీయ విద్యాలయాన్ని కేంద్ర విద్యాశాఖ పరిధిలోకి తీసుకురావాలన్నారు. అక్కడి.. విమల్ విద్యాలయం సిబ్బందికి ఆర్థిక భద్రత కల్పించడానికి స్వచ్ఛంద పదవీ విరమణ పథకం అమలు చేయాలని కోరారు.

# 'కుంకీ ఆపరేషన్' సక్సెస్

- మొగిలిలో 15 రోజులుగా ఏనుగుల సంచారం
- వాటిని తరిమి దారిమళ్లించిన కుంకీలు
- అధికారులకు డిప్యూటీ సీఎం అభినందనలు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'ఆపరేషన్ కుంకీ' మొదలైంది. కర్ణాటక నుంచి తెచ్చిన కుంకీ ఏనుగులతో చేపట్టిన తొలి ఆపరేషన్ విజయవంతమైంది. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి వద్ద మామిడి తోటలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును కుంకీలు దారి మళ్లించి, అడవుల్లోకి తరిమికొట్టాయి. కృష్ణ, జయంత్, వినాయక అనే పేరు గల కుంకీలు అటవీ ఏనుగులు పంటల వైపు రాకుండా అడ్డుకున్నాయి. మొగిలి గ్రామ ప్రాంతంలో 15 రోజులుగా ఏనుగుల సంచారం ఉందనే సమాచారంతో అధికారులు కుంకీ ఆపరేషన్ నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ సాగిన ఈ ఆపరేషన్‌లో కృష్ణ అనే కుంకీ చాలా చురుగ్గా పాల్గొందని అటవీశాఖ అధికారులు సోమవారం తెలిపారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను తెచ్చాక రెండు నెలల శిక్షణ అనంతరం ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించడం పట్ల ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల రైతులు, ప్రజలకు ఈ ఆపరేషన్ భరోసా ఇస్తుందన్నారు. ఏనుగుల గుంపుల బారి నుంచి పంటలు, ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని, ఈక్రమంలో కుంకీలతో చేపట్టిన తొలి ప్రయత్నం ఫలించడానికి కృషి చేసిన మావటీలు, అటవీ అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. అడగ్గానే కుంకీ ఏనుగులు ఇచ్చిన కర్ణాటక సీఎం సిద్దరామయ్య, అటవీమంత్రి ఈశ్వర్ ఖండ్రేకు పవన్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి ఆపరేషన్ పుంగనూరు అటవీ ప్రాంతంలో చేపడతామన్నారు.

### లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి కొత్త అథారిటీ

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ నిషేధ(పీసీ-పీఎన్‌డీటీ) చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర స్థాయి అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ అథారిటీకి ఆరోగ్యశాఖ కమిషనర్ చైర్మన్/చైర్‌పర్సన్‌గా ఉంటారు. న్యాయ శాఖ జాయింట్ సెక్రటరీ, వాసవీ మహిళా మండలి సెక్రటరీ జి. రష్మిలను సభ్యులుగా నియమించారు. ఈ అథారిటీ రాష్ట్ర, జిల్లా స్థాయి ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనుంది.

# గీత కార్మికులకు 10 శాతం బార్లు

- బార్ పాలసీపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బార్ పాలసీలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం షాపుల తరహాలోనే బార్ లైసెన్స్‌ల కేటాయింపులో గీత కార్మికులకు 10 శాతం వాటా ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో బార్ పాలసీపై ఆయన సమీక్ష నిర్వహించారు. కొత్త పాలసీపై క్యాబినెట్ సబ్‌కమిటీ ప్రతిపాదనలను అధికారులు సీఎంకు వివరించగా వాటికి ఆయన ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో 840 బార్లు ఉండగా.. లాటరీ విధానంలోనే లైసెన్స్‌లు కేటాయించాలని నిర్ణయించారు. 50 వేల లోపు జనాభా ఉండే ప్రాంతాల్లోని బార్లకు రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.55లక్షలు.., 5 లక్షల జనాభా దాటితే రూ.75లక్షలు లైసెన్స్ ఫీజులుగా నిర్ణయించారు. కొత్త పాలసీలో దరఖాస్తు రుసుములు, లైసెన్స్ ఫీజుల రూపంలో ప్రారంభంలోనే రూ.700 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కాగా.. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు తప్పనిసరిగా రావాలనే నిబంధన పెట్టాలని మరో నిర్ణయం తీసుకున్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ... "మద్యం పాలసీ అనగానే దేశంలో ఏ ప్రభుత్వమైనా ఆదాయం గురించి చూసుకుంటుంది. కానీ, ఆదాయం మాత్రమే కాదు... ప్రజల ఆరోగ్యం కూడా ముఖ్యమేనని గుర్తుపెట్టుకోవాలి. ఆల్కహాల్ కంటెంట్ తక్కువ ఉన్న మద్యం ద్వారా వినియోగదారుల ఆరోగ్యాన్ని కాపాడవచ్చు. గత ప్రభుత్వంలో నాణ్యత లేని మద్యం వల్ల లక్షలాది కుటుంబాలు నష్టపోయాయి. పేదల ఇళ్లు, వళ్లు గుల్ల కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లోని షాపుల్లో మద్యం అమ్మకాలు పెరగడానికి కారణాలను అధికారులు సీఎంకు వివరించారు. ఏపీలో ధరలు తగ్గడం, అన్ని బ్రాండ్లు అందుబాటులోకి రావడం, నాణ్యమైన మద్యం దొరకడంతో మన రాష్ట్రంలోని వినియోగదారులు ఇక్కడి మద్యమే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. కాగా, ఇప్పటివరకూ 12 జిల్లాలను నాటుసారా రహితంగా ప్రకటించామని, ఈ నెలలో మరో 8 జిల్లాలు, సెప్టెంబరు నాటికి అన్ని జిల్లాలు నాటుసారా రహితమవుతాయని చెప్పారు. సమీక్షలో మంత్రులు కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



బల్లికురవ క్వారీ ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

# జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన 'సారథ్యం' యాత్రలో భాగంగా సోమవారం ఆయన పల్నాడు జిల్లా నరసరావుపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 4,400 కిలోమీటర్ల మేర రహదారుల విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాను జాతీయ రహదారితో అనుసంధానం చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రూ.5,600 కోట్ల వ్యయంతో విస్తరించే 27 రోడ్లు, ఆర్‌యూబీల నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపనలు చేశారన్నారు. అమరావతి ఓఆర్‌ఆర్ నిర్మాణంతో రాజధాని ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈనెల 14, 15 తేదీల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేసేలా 'హర్‌ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాతూరి నాగభూషణం, పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు యేలూరి శశికుమార్, ఏబీవీపీ రాష్ట్ర కోశాధికారి కొడూరు సాంబశివరావు తదితరుల పాల్గొన్నారు. కాగా, బాపట్ల జిల్లా బల్లికురవ క్వారీ ప్రమాదంలో గాయపడి నరసరావుపేటలోని జీబీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాధవ్ పరామర్శించారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# చంద్రగిరి చరిత్రను నాశనం చేసిన చెవిరెడ్డి

- లిక్కర్ స్కామ్‌లో జగన్‌కంటే ఈయన పాత్రే కీలకం: ఎమ్మెల్యే పులివర్తి

తిరుపతి(వైద్యం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'ఎంతో ఘనచరిత్ర కలిగిన చంద్రగిరి నియోజకవర్గాన్ని అక్రమాలు, దోపిడీలు, అన్యాయాలతో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నాశనం చేశాడు. రాష్ట్ర పరువునూ తీసేశాడు' అని ఎమ్మెల్యే పులివర్తి నాని ఆరోపించారు. తిరుపతి రూరల్ మండలంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మద్యం కుంభకోణంలో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి.. కోర్టు బయట అధికారులను బెదిరిస్తూ.. కోర్టు లోపల జడ్జిల వద్ద ఏడుస్తూ తన నటనతో ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తున్నాడు. పూటకో మాట, రోజుకో బాట వేస్తూ తుమ్మలగుంట అపరిచితుడిలా చెవిరెడ్డి నటిస్తున్నాడు. వేల కోట్లు కొల్లగొట్టిన మద్యం కుంభకోణంలో మాజీ సీఎం జగన్‌కంటే చెవిరెడ్డి పాత్రే కీలకం. దీనికి సంబంధించిన సాక్ష్యాలన్నీ సిట్ అధికారులు ఇప్పటికే గుర్తించారు. మద్యం కుంభకోణంలో జగన్, కేసీఆర్ సంపాదించిన అవినీతి సొమ్మును దుబాయ్ వంటి విదేశాలకు తరలించడంలో చెవిరెడ్డి ముఠా కీలకపాత్ర పోషించింది. లిక్కర్ స్కామ్‌లో సూత్రధారులందరూ చెవిరెడ్డి ప్రియశిష్యులు కాదా? అవినీతి, అక్రమాలకు చెవిరెడ్డికి సహకరించిన అధికారుల జాబితా మా వద్ద ఉంది. కీలకపాత్ర పోషించిన అధికారులకూ శిక్ష తప్పదు. అదేవిధంగా తుడాలో రూ.వందల కోట్ల అవీనితికి పాల్పడిన తండ్రీ కొడుకులు (చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి) శిక్ష అనుభవిస్తారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంలో కూడా చెవిరెడ్డిదే కీలక పాత్ర. ఎన్నికల ముందు నాతో పాటు నా కుటుంబ సభ్యుల ఫోన్లనూ చెవిరెడ్డి ట్యాప్ చేయించారు. తుమ్మలగుంట దేవాలయంలో చెరువులను చెరబట్టి పార్కులుగా మార్చి రూ.వేల కోట్లను దిగమింగిన విషయాలు బయటకు తీసి ఆయన నిజస్వరూపాన్ని సాక్ష్యాధారాలతో జనం ముందుకు తీసుకొస్తా' అని నాని అన్నారు.

# రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితమే

- 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం
- రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడి



అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15 నుంచి రాష్ట్రంలోని మహిళలందరికి ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. అంతర్రాష్ట్ర పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా మహిళలు జీరో టికెట్‌తో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. మహిళా ఉద్యోగులు, ట్రాన్స్‌జెండర్లకు కూడా ఈ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. సోమవారం అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. మొత్తం బస్సుల్లో 74 శాతం బస్సులున్న పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో 6,700 బస్సులు ఈ కేటగిరిలోకి వస్తాయన్నారు. ఈ బస్సుల్లో ఎక్కడా సమస్యలు రాకుండా చూస్తామన్నారు. మహిళలను ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డుల్లో ఏదైనా ఒకటి చూపినా అనుమతిస్తారని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే.. "ఉచిత బస్సు పథకానికి ఏటా రూ.1,950 కోట్లు ఖర్చవుతుంది. ఆటోవాలాల జీవనాధారానికి ఇబ్బంది లేకుండా త్వరలో మంచి నిర్ణయం తీసుకుంటాం. పొరుగు రాష్ట్రాల్లో అధ్యయనం చేసి.. తెలంగాణ నమూనా ప్రకారం ఏపీలో మహిళలకు ఉచిత బస్సు విధానాన్ని అమలు చేస్తాం. బస్సు సీటింగ్‌లో ఇన్నాళ్లు మహిళలకు 35 శాతం ఉండేది. ఇప్పుడది 65 శాతానికి పెరుగుతుంది. ఉచిత బస్సుల్లో బాడీవోర్న్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. మహిళల ఆక్యుపెన్సీ 65 శాతం ఉంటుందని అంచనా వేశాం. విద్యార్థినిలు, తక్కువ జీతాలు పొందే మహిళలకు ఆసరాగా ఉంటుందని సీఎం చంద్రబాబు ఈ ఉచిత బస్సు పథకాన్ని ప్రకటించారు. ఇక మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు బస్ పాసులు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. 700 స్కూల్ బస్సులు ఉదయం, సాయంత్రం నడుస్తుంటాయి. ఖాళీ సమయంలో వాటిని ఉచిత బస్సులుగా వినియోగించుకునే విషయాన్ని పరిశీలిస్తున్నాం. రానున్న కాలంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని సీఎం నిర్ణయించారు. కేంద్రం 750 బస్సులు ఇచ్చింది. అదనంగా 1,400 బస్సులు కూడా రానున్న రెండేళ్లలో కొనుగోలు చేయనున్నాం. రానున్న కాలంలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు తెస్తాం. నాలుగేళ్లలో పర్యావరణహితంగా మారడానికి ఎలక్ట్రిక్ బస్సులు కొనాలని నిర్ణయించాం. పల్లె వెలుగు ఎలక్ట్రిక్ బస్సుల్లో ఏసీ సౌకర్యం కల్పిస్తాం. కొత్తగా నియామకాలు కూడా చేపడతాం. ఈనెల 6న క్యాబినెట్‌లో తుది ఆమోదం తీసుకుంటాం.

### గత ప్రభుత్వం వల్లే ఆర్టీసీలో సమస్యలు

ఆర్టీసీ కార్గో ద్వారా ఏటా రూ.220 కోట్లు ఆదాయం వస్తోంది. ఆర్టీసీ స్థలాలను ఆదాయం, ఉపాధి కల్పించే బహుళ జాతి సంస్థలకు కేటాయిస్తాం. గత ప్రభుత్వ విధానాల వల్లే ఆర్టీసీలో సమస్యలు వస్తున్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల కొన్ని సమస్యలు వచ్చాయి. వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. ఆర్టీసీ స్థలాలు చట్టబద్ధంగానే పరిశ్రమలకు ఇస్తున్నాం.

# విశాఖకు ఐటీ బూమ్



(మొదటి పేజీ తరువాయి)

భారీ సంఖ్యలో ఉద్యోగావకాశాలు లభించడం లేదు. దీనిపై దృష్టి సారించిన ఐటీ శాఖ మంత్రి లోకేశ్ యాంకర్ కంపెనీగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)ను రప్పించారు. కాపులుప్పాడలో 21.6 ఎకరాల భూమితో పాటు తక్షణమే కార్యకలాపాలు ప్రారంభించడానికి రుషికొండ ఐటీ హిల్స్-3లోని మిలీనియం టవర్-బీని ఇచ్చారు. టీసీఎస్ యాజమాన్యం రూ.1370 కోట్ల పెట్టుబడులు పెట్టి, దశలవారీగా 13 వేలమందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చింది. అదొక్కటే సరిపోదని భావించి, మరో పెద్ద సంస్థ కాగ్నిజెంట్‌తో చర్చలు జరిపి ఒప్పించారు. ఆ సంస్థకు కాపులుప్పాడలో 21.31 ఎకరాలు కేటాయించారు. రూ.1,582.98 కోట్లు పెట్టుబడి పెట్టి, క్రమంగా ఎనిమిది వేలమందికి ఉద్యోగాలు ఇస్తామని కాగ్నిజెంట్ హామీ ఇచ్చింది. తాజాగా వారం క్రితం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో మరో ఐదు కంపెనీలకు భారీగా భూములు కేటాయించారు. త్వరలో ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుంది. గతంలోనే కాపులుప్పాడలో అదానీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన జరిగింది. ఇవి కూడా నిర్మాణ పనులు ప్రారంభిస్తే కచ్చితంగా లక్ష ఉద్యోటీవకాశాలు వస్తాయి.

**సంస్థల వారీగా పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు**

| సంస్థ | పెట్టుబడి (రూ.కోట్లలో) | ఉద్యోగాలు |
|---|---|---|
| టీసీఎస్ | 1,370 | 13,000 |
| కాగ్నిజెంట్ | 1,583 | 8,000 |
| ఏఎన్ఎస్ఆర్ | 1,000 | 10,000 |
| సిఫీ ఇన్ఫినిటీ స్పేస్ | 15,266 | 600 |
| సత్వ డెవలపర్స్ | 1,500 | 25,000 |
| బీవీఎం ఎనర్జీ | 1,250 | 15,000 |
| ఫీనమ్ పీపుల్స్ | 2079 | 2,500 |
| మొత్తం | 24,048 | 74,100 |

### పెద్ద కంపెనీలు కాబట్టి ఉద్యోగాలు గ్యారెంటీ



ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఉద్యోగాలు తగ్గిపోతున్నాయి. ఉన్న వారినే తీసేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో విశాఖలో కొత్త ఉద్యోగాలు ఎలా ఇస్తారని అనుకునే అవకాశం ఉంది. విశాఖకు రావడానికి ఎంఓయూలు చేసుకున్నవన్నీ పెద్ద కంపెనీలు. టీసీఎస్ వంటి సంస్థలు వాటి దగ్గర ఎక్కడెక్కడో పనిచేస్తున్న ఉత్తరాంధ్ర ఉద్యోగులను ముందు విశాఖకు పంపిస్తాయి. ఆ తరువాత క్రమంగా కొత్త ఉద్యోగాలు ఇస్తాయి. ఏ టెక్నాలజీకి తగ్గట్టుగా ఇక్కడి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వాల్సి ఉంది.

- ఓ. నరేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడు, రుషికొండ ఐటీ పార్క్

# మార్గదర్శిపై కేసు అవసరం లేదు

- రామోజీరావు మరణం నేపథ్యంలో కొనసాగించాల్సిన పనిలేదు
- ఊరట కలిగించిన టీ హైకోర్టు.. క్వాష్ పిటిషన్లకు అనుమతి
- మేజిస్ట్రేటు కోర్టులోని కేసు కొట్టివేత

హైదరాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చట్టానికి విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారన్న ఆరోపణల కేసులో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. ఆ సంస్థ యజమాని రామోజీరావు మరణం నేపథ్యంలో ఇక ఆ సంస్థపై కేసు అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ దాఖలు చేసిన రెండు క్వాష్ పిటిషన్లను అనుమతించింది. ఆ కారణంగా మార్గదర్శిపై నాంపల్లి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు కోర్టులో ఉన్న కేసును కొట్టివేస్తూ జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ కే సుజనల ధర్మాసనం నిర్ణయాన్ని వెలువరించింది. దాదాపు 24 ఏళ్ల కింద అప్పటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో మార్గదర్శి అక్రమ డిపాజిట్ల ఆరోపణలపై క్రిమినల్ చర్యలను ప్రారంభించారు. 2008లో ట్రయల్ కోర్టులో కేసు విచారణ ప్రారంభమైంది. ఈ కేసును కొట్టివేయాలని మార్గదర్శి ఉమ్మడి ఏపీ హైకోర్టులో 2011లో పిటిషన్లు దాఖలు చేసింది. వాటిపై విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టీ రజనీ ధర్మాసనం.. మార్గదర్శికి అనుకూలంగా 2018 డిసెంబర్ 31న తీర్పు ఇస్తూ కేసును కొట్టివేసింది. దీన్ని సవాల్ చేస్తూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఈ కేసును మళ్లీ సమగ్రంగా విచారించాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే మార్గదర్శి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్లపై జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ కే సుజన ధర్మాసనం విచారించింది. ఈ క్రమంలోనే మార్గదర్శి సంస్థ యజమాని రామోజీరావు మరణించారు. మార్గదర్శి తరఫున అన్నీ తానై వ్యవహరించిన రామోజీరావు మరణించిన తర్వాత క్రిమినల్ కేసు కొనసాగడానికి అవకాశం లేదని, క్రిమినల్ కేసుల్లో వారసులపై చర్యలు తీసుకోవడం అనేది ఉండదని మార్గదర్శి సంస్థ మధ్యంతర అప్లికేషన్లు దాఖలు చేసింది. పిటిషనర్ అయిన మార్గదర్శి సంస్థ తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్ నాగముత్తు, ముకుల్ రోహత్గీ, సిద్దార్థ లూథ్రా, ఆర్బీఐ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్, తెలంగాణ తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, ఏపీ తరఫున ఏపీ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాజేశ్వర్‌రెడ్డి వాదించారు. అన్ని పిటిషన్‌లపై విచారణ చేపట్టి ఈ ఏడాది మార్చి 7న ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. తాజాగా సోమవారం తుది తీర్పు వెలువరించింది. అసలు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుడు చనిపోయిన నేపథ్యంలో ఇక మార్గదర్శి సంస్థపై కేసు కొనసాగించలేమని స్పష్టం చేసింది.

### అన్నదానం విరాళాలూ స్వాహా

- టీటీడీ విజిలెన్స్ విచారణలో వెలుగులోకి

తిరుమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): భక్తులకు అన్నదానం చేయాలంటూ దాతలిచ్చిన విరాళాలను ఇష్టానుసారం తమ జేబుల్లో వేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. రాజధాని అమరావతిలో శ్రీవారి ఆలయంలో కొన్ని నెలలుగా అన్నదాన కార్యక్రమం జరుగుతోంది. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి విశేషమైన రోజుల్లో కొందరు దాతలు భక్తులకు అన్నదానం కోసం విరాళాలు ఇస్తుంటారు. అయితే ఈ విరాళాలను పూర్తిస్థాయిలో అన్నప్రసాదాలకు వినియోగించకుండా నొక్కేస్తున్నారంటూ ఇటీవల టీటీడీ దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో నెలన్నర క్రితం టీటీడీ విజిలెన్స్ విభాగం అమరావతికి వెళ్లి అన్నదానం కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించింది. ఎంతమంది విరాళాలు ఇచ్చారు? అన్నదానానికి ఒక రోజుకయ్యే ఖర్చు ఎంత? ఎందరు అన్నప్రసాదాలు తింటున్నారు? వంటి అంశాలపై ఆరా తీశారు. ఈ క్రమంలో కొన్ని అక్రమాలు వెలుగుచూసినట్టు సమాచారం. ముగ్గురు ఎన్ఆర్ఐ దాతలను ప్రశ్నించగా.. దాదాపు రూ.3.50 లక్షలు విరాళాలు ఇస్తే, రూ.70 వేలు మాత్రమే వినియోగించి అన్నదానం చేసినట్టు తేలింది. క్యాటరింగ్ వ్యక్తులు, అన్నదానం ఇన్‌చార్జ్ ఈ విరాళాలను దారి మళ్లించి తమ కుటుంబ సభ్యుల ఖాతాలో వేయించుకున్నట్టు విజిలెన్స్ విచారణలో తేలినట్టు సమాచారం. గతంలోనూ ఇదే తరహా అక్రమాలు జరిగి ఉండవచ్చనే నివేదికను ఇటీవల టీటీడీ ఉన్నతాధికారులకు అందజేసినట్టు తెలిసింది.

# అభద్రతలో జగన్!

## 40 మందితో ప్రైవేటు సైన్యం

- రేపటి డోన్ పర్యటన నుంచి మొదలు
- మరి పోలీసులు అనుమతిస్తారా?
- జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న ఆయనకు ఇప్పటికే 58 మంది సిబ్బంది రక్షణ
- వారిని కాదని ప్రైవేటు ఆర్మీ ఎందుకో!




అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జడ్ ప్లస్ కేటగిరీ రక్షణలో ఉన్న మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన భద్రత కోసం ప్రైవేటు సైన్యాన్ని నియమించుకున్నారు. ఏకంగా 40 మంది బౌన్సర్లను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం డోన్ పర్యటన నుంచి వీరు రంగంలోకి దిగనున్నారని వైసీపీ వర్గాలు తెలిపాయి. అయితే ఆయనకు రక్షణ కల్పిస్తున్న పోలీసులు.. ప్రైవేటు సైన్యాన్ని అనుమతిస్తారా అనేది ప్రశ్న. జగన్ భద్రతపై ఎలాంటి ఆందోళనలూ లేవు. ఆయనకు ముప్పు ఉన్నట్లు నిఘా నివేదికలూ వెల్లడించలేదు. అయినా సరే... జగన్‌కు 58 మంది పోలీసులు భద్రత కల్పిస్తున్నారు. ఇప్పుడు వీరిని కాదని ప్రైవేటు సైన్యాన్ని నియమించుకోవడంపై ఆయన పార్టీ నేతలే విస్తుపోతున్నారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి 11 స్థానాలు మాత్రమే రావడంతో జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా దక్కలేదు. అయినప్పటికీ .. మాజీ ముఖ్యమంత్రిగా ఆయనకు ప్రభుత్వం జడ్ ప్లస్ భద్రతను కల్పించింది. ఇందులో భాగంగా 58 మంది పోలీసులు జగన్‌కు రక్షణ కల్పిస్తున్నారు. జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న నాయకుడిగా ఆయన తన పర్యటనల వివరాలను పోలీసులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలి. భద్రతా ఏర్పాట్లు వారే చేపట్టాలి. పోలీసు భద్రతా నియమాలను ఆయన పక్కనపెట్టడానికి వీల్లేదు. అయితే ఇటీవల జగన్ ఎక్కడ పర్యటించినా భద్రతాపరమైన మార్గదర్శకాలన్నింటినీ ఉల్లంఘిస్తున్నారు. పోలీసులు అనుమతించిన సంఖ్యలో కాకుండా.. పథకం ప్రకారం వేల సంఖ్యలో జనాలను రప్పిస్తున్నారు. తన ముందు నడవాలంటూ నేతలు, కార్యకర్తలకు సైగలు కూడా చేస్తున్నారు. హెలిప్యాడ్ వద్దకు పెద్దసంఖ్యలో రావాలని సూచిస్తున్నారు. తమను అడ్డగిస్తున్న పోలీసులను వైసీపీ కార్యకర్తలు తోసుకుని మరీ వెళ్తున్నారు. దీంతో తనకు భద్రత కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని జగన్ ఆరోపణలు చేస్తున్నారు. కార్యకర్తలను అడ్డుకుంటే.. ఎవరూ తనను కలవకుండా ఆంక్షలు పెడుతున్నారని విమర్శిస్తున్నారు. బంగారుపాళ్యం పర్యటన తర్వాత.. జగన్ అమలు చేస్తున్న ప్రణాళికలపై పోలీసులకు స్పష్టత వచ్చింది. భద్రతను ఛేదించుకుని ఎవరూ రాకుండా కఠినంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇటీవల జగన్ నెల్లూరు పర్యటన సమయంలో కార్యకర్తల హడావుడి తగ్గింది. ఈ పరిస్థితుల్లో జగన్ ప్రైవేటు సైన్యాన్ని నియమించుకోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏదైనా అవాంఛనీయ పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిదని పోలీసువర్గాలూ ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రప్రభుత్వం సరైన రక్షణ కల్పించడం లేదని ప్రచారం చేసుకునేందుకే బౌన్సర్లను తెచ్చుకుంటున్నారని రాజకీయవర్గాలు విమర్శిస్తున్నాయి.

## మిథున్‌రెడ్డిని ములాఖత్‌లో కలిసిన భార్య

రాజమహేంద్రవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లిక్కర్ స్కామ్ నిందితుడు, వైసీపీ ఎంపీ పి.మిథున్‌రెడ్డిని ఆయన సతీమణి లక్ష్మీదివ్య సోమవారం ములాఖత్‌లో కలిశారు. సుమారు 20 నిమిషాల పాటు ఆయనతో మాట్లాడిన లక్ష్మీదివ్య.. మీడియాతో మాట్లాడకుండా నేరుగా వెళ్లిపోయారు. ఇటీవల కొద్దిరోజుల పాటు అనధికారికంగా ములాఖత్‌ల్లో మిథున్‌రెడ్డిని కలిసిన న్యాయవాది హుస్సేన్ సోమవారం నల్లకోటు లేకుండానే సెంట్రల్ జైలు వెలుపల సంచరించడం గమనార్హం.



మిథున్‌రెడ్డిని ములాఖత్‌లో కలిసి వస్తున్న ఆయన భార్య లక్ష్మీదివ్య. ఆమె వెంట ఉన్న లాయర్ హుస్సేన్



చెల్లని నోట్లతో కట్టుకథ

... నాటకానికి తెరతీశారు.

చెవిరెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడు పంపిణీ చేస్తున్న డబ్బుగా దానిని చిత్రీకరించారు. ఆ ఫొటో ..., వీడియోల్లో రూ.2 వేల నోట్లు కనిపిస్తున్నాయి.

నాయుడుతో వెంకటేశ్ నాయుడు (ఫైల్)

అయితే దేశంలో రూ.2 వేల నోట్ల చలామణి పూర్తిగా ఆగిపోయిందని 2023 మే 19న ఆర్బీఐ చివరి సారిగా ప్రకటించింది. కానీ 2024 ఎన్నికల సమయంలో మద్యం సొమ్ము అక్రమంగా తరలించారని చెవిరెడ్డిని అరెస్టు చేశారు. దీనిని బట్టే అర్థం ...

'చెల్లని నోట్లతో కట్టుకథ' అంటూ సోమవారం సంచికలో జగన్ పత్రిక ప్రచురించిన కథనం. ఇందులో... 2వేల నోట్ల చలామణి పూర్తిగా ఆగిపోయిందని 2023 మే 19న ఆర్బీఐ చివరిసారిగా ప్రకటించిందని వెల్లడించింది.

## ఏది 'చివరిసారి?'

జనంవద్ద ఇంకా 2వేల నోట్లు ఉన్నాయని, వాటిని ఆర్బీఐ ఇష్యూ కేంద్రాల వద్ద మార్చుకోవచ్చునని శనివారం జగన్ పత్రికలో ప్రచురితమైన కథనం.

# అయోమయం... జగన్ నాదం!



(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ, బీఆర్ఎస్ నేతలతోనూ ఫొటోలు దిగారు. 'మరి.. దొరికిపోయిన డబ్బులు వాళ్లందరివీ కూడా అని అనుకోవచ్చు కదా!' అనే అతితెలివి లాజిక్కును లేవనెత్తింది. వెంకటేశ్ నాయుడు వేర్వేరు సందర్భాల్లో ఇతర పార్టీలకు చెందిన నేతల పక్కన నిలబడి ఫొటోలు దిగడం నిజమే. కానీ... చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వంటి నేతలతో 'తాడేపల్లి ప్యాలెస్'లోకి వెంకటేశ్ నాయుడు డైరెక్ట్ ఎంట్రీ ఇచ్చారు. జగన్‌ను అనేకపర్యాయాలు కలిశారు. ఇద్దరూ ఆత్మీయ కరచాలనాలు చేసుకున్న చిత్రాలు అనేకం బయటికి వచ్చాయి. తాడేపల్లి ప్యాలెస్‌లోకి 'ఎంట్రీ' అంత ఈజీ కాదని.. ఎవరు పడితే వారు లోపలికి వెళ్లి, జగన్‌ను కలిసే అవకాశం రాదని వైసీపీ నేతలకు బాగా తెలుసు. అంతెందుకు... 'చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన స్నేహితుడు వెంకటేశ్ నాయుడుపై సిట్ సమర్పించిన రిమాండ్ నివేదికలు ప్రభుత్వ పెద్దల కుట్రను మరోసారి వెలుగులోకి తెచ్చాయి" అని జగన్ పత్రిక ఒక కథనంలో పేర్కొంది. 'అతను మా వాడే' అని ధ్రువీకరించింది.

### రూ.2వేల నోట్ల కథ...

వెంకటేశ్ నాయుడు గుట్టలుగా ఉన్న నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిపోగా... అందులో ఒకే ఒక్క 2వేల రూపాయల నోట్ల కట్టలు కొన్ని బయటపడ్డాయి. వీటి విలువ రూ.6లక్షల నుంచి 8 లక్షలు ఉండొచ్చు. మిగిలినవన్నీ రూ.500 నోట్ల కట్టలే! కానీ... 'చెల్లని నోట్లతో కట్టు కథ' అంటూ రోతపత్రిక వింత వాదన మొదలుపెట్టింది. 'దేశంలో 2వేల రూపాయల నోట్ల చలామణీ పూర్తిగా ఆగిపోయిందని 2023 మే 19న ఆర్బీఐ చివరి సారిగా ప్రకటించింది' అని కూడా సోమవారం నాటి సంచికలో రోత పత్రిక వెల్లడించింది. అసలు విషయం ఏమిటంటే... 2వేల నోటు చెల్లని నోటు కాదు! చెలామణిలో లేని లేటు మాత్రమే! ఆ నోట్లను బహిరంగ మార్కెట్లో మార్చుకోలేరు కానీ... ఆర్బీఐ ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ఇప్పటికీ వాటిని మార్చుకోవచ్చు. ఇక... 'ఆర్బీఐ చివరిసారిగా ప్రకటించింది' అనే విషయానికి వద్దాం! ఆగస్టు 2వ తేదీన, అంటే శనివారంనాటి సంచికలో జగన్ పత్రికలోనే ఒక వార్త ప్రచురించింది. దీని ప్రకారం "దేశంలో ఇంకా రూ.6,017 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు జనంవద్దే ఉన్నాయి. అవి ఆర్బీఐకి తిరిగి రాలేదు. దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ ఇష్యూ కేంద్రాల వద్ద ఇప్పటికీ రూ.2వేల నోట్లను మార్చుకోవచ్చు"! ఇది అక్షరాలా నిజం! '2వేల నోట్లు చెల్లవని 2023 మే 19న ఆర్బీఐ చివరిసారిగా ప్రకటించింది' అని సోమవారం సంచికలో జగన్ పత్రిక రాసిన విషయం పచ్చి అబద్ధం. జనంవద్దే ఉన్న రూ.6017 కోట్ల రూ.2వేల నోట్లలో 'లిక్కర్ గ్యాంగ్' వద్ద ఎన్ని ఉన్నాయో తెలియదు! రకరకాల మార్గాల్లో లిక్కర్ సొమ్మును మార్చుకున్న ఈ ముఠా వద్ద 2వేల నోట్లు ఉండటంలో ఆశ్చర్యం ఏముంది?

### అలా వదిలేస్తారా...

నిజంగానే వెంకటేశ్ నాయుడుకు టీడీపీ నేతలతో సంబంధాలుంటే... ఆ డబ్బులు తెలుగుదేశం పార్టీకి చెందినవారివైతే... అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ ఊరికే వదిలేస్తుందా? జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో .. సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రత్యేక విమానాల్లో వెంకటేశ్ నాయుడు తిరగగలరా? జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరిపైనా నిఘా పెట్టారు. వెంకటేశ్ నాయుడు గుట్టలుగా నోట్ల కట్టలు తరలిస్తుంటే అప్పటి వైసీపీ ప్రభుత్వం వదిలేసే అవకాశమే లేదు.

## పూర్తిగా వెనక్కి రాని 2,000 నోట్లు

### రూ.6,017 కోట్ల మేర ప్రజల వద్దే



ముంబై: మార్కెట్ నుంచి 2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించి రెండేళ్లు దాటినా.. ఇప్పటికీ రూ.6,017 కోట్ల విలువ చేసేవి వెనక్కి తిరిగి రాలేదు. 2023 మే 19న రూ.2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. చట్టపరంగా చెల్లుబాటును రద్దు చేయలేదు. 2023 మే 19 నాటికి వ్యవస్థలో రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే పెద్ద నోట్లు చలామణిలో ఉన్నాయి. 2025 జూలై 31 నాటికి రూ.6,017 కోట్లకు తగ్గిపోయినట్టు ఆర్‌బీఐ డేటా వెల్లడించింది. నాడు చలామణిలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో 98.31 శాతం వెనక్కి వచ్చినట్టు తెలిపింది. తొలుత బ్యాంకుల్లో ఈ నోట్ల మార్పిడికి అవకాశం కల్పించడం తెలిసే ఉంటుంది. హైదరాబాద్ సహా

## లిక్కర్ నిందితుల బెయిల్ పిటిషన్ల విచారణ వాయిదా

- నలుగురి పిటిషన్లపై కౌంటర్ దాఖలు

విజయవాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనుంజయ్‌రెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో సోమవారం కౌంటర్ దాఖలు చేశారు. ధనుంజయ్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, మిథున్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై వాదనలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. కృష్ణమోహన్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై వాదనలను న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారానికి వాయిదా వేశారు. మరో నిందితుడు సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ ఏడో తేదీకి వాయిదా పడింది.

# జగనన్న ఇళ్లు కట్టిస్తానని భారీ మోసం

- పేద లబ్ధిదారుల నుంచి సొమ్ము తీసుకుని పరారైన వైసీపీకి చెందిన కాంట్రాక్టర్
- 200 మంది నుంచి రూ.కోటి వసూలు
- బాధితుల గగ్గోలు.. స్పందించిన లోకేశ్
- కాంట్రాక్టర్‌ను పట్టుకున్న అధికారులు



దుగ్గిరాల పంచాయతీ కార్యాలయంలో అధికారులకు తమగోడు చెప్పుకొంటున్న బాధిత లబ్ధిదారులు

దుగ్గిరాల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో చేపట్టిన జగనన్న కాలనీల్లో మరో అక్రమం వెలుగు చూసింది. కాలనీల్లో ఇళ్లను నిర్మించి ఇస్తానని చెప్పి.. పేద లబ్ధిదారుల నుంచి సుమారు రూ.కోటికి పైగా తీసుకుని మోసం చేసిన వైసీపీ నేత, కాంట్రాక్టరును ఎట్టకేలకు అధికారులు ప్రజల ముందు నిలబెట్టారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం, దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో పేదలకు జగనన్న ఇళ్లు మంజూరయ్యాయి. దీంతో ప్రభుత్వం విడుదల చేసిన రూ.లక్షా 80 వేలతోపాటు లబ్ధిదారులు కూడా కొంత మొత్తం వెచ్చించి సొంతగా ఇల్లు నిర్మించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన మోరంపూడి ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు, కాంట్రాక్టర్ ప్రసన్న.. ఇళ్లు నిర్మించి ఇస్తానని పేదలను నమ్మించారు. 200 మందికి పైగా లబ్ధిదారుల నుంచి రూ.20 వేల నుంచి రూ.50 వేల చొప్పున వసూలు చేశారు. ఇలా మొత్తం రూ.కోటిపైగానే ఆయన పోగేసుకున్నారు. కానీ, ఇళ్ల నిర్మాణాలు మాత్రం పూర్తి చేయలేదు. పైగా లబ్ధిదారుల కంట పడకుండా పరారయ్యారు. దీంతో బాధిత లబ్ధిదారులు ఈ విషయాన్ని టీడీపీ నేతల ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిని తీవ్రంగా పరిగణించిన మంత్రి లోకేశ్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. పరారైన కాంట్రాక్టర్‌ను పట్టుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు నెల రోజులపాటు గాలించి కాంట్రాక్టర్ ప్రసన్న ఆచూకీ కనుగొన్నారు. సోమవారం దుగ్గిరాల, పెదకొండూరు, గొడవర్రు గ్రామాలకు చెందిన లబ్ధిదారులను, స్థానిక పంచాయతీ కార్యాలయానికి పిలిపించారు. సుమారు 200 మందికిపైగా లబ్ధిదారులు పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. తమ వద్ద రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు కాంట్రాక్టర్ తీసుకున్నారని ఫిర్యాదు చేశారు. తమకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని, లేదా తీసుకున్న సొమ్ము తిరిగి ఇప్పించాలని వారు వేడుకున్నారు. ఈ సందర్భంగా గృహనిర్మాణ శాఖ ఈఈ భాస్కర్ మీడియాతో మాట్లాడుతూ, తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కొందరు, తమ నగదు తిరిగి వెనక్కి ఇప్పించాలని మరికొందరు బాధిత లబ్ధిదారులు కోరినట్టు చెప్పారు. బాధితులు చాలా మందే ఉన్నారని, రెండు రోజులపాటు వారిని కూడా పిలిపించి మాట్లాడతామన్నారు. "కాంట్రాక్టర్ ఎవరి వద్ద ఎంత మొత్తం తీసుకున్నారు?. వారి ఇళ్ల నిర్మాణం ఎంత వరకు వచ్చింది?. ఏవిధంగా వారికి న్యాయం చేయాలో తుది నిర్ణయం తీసుకుంటాం." అని వివరించారు.

ఇదిలావుంటే, ఈమని గ్రామంలోనూ కొంతమందిని మరో కాంట్రాక్టర్ ఇదేవిధంగా మభ్యపెట్టి నగదు వసూలు చేసి పరారీలో ఉన్నట్లు అక్కడి వారు చెబుతున్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, స్థానిక టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# అప్పటి ఘటనల్లో ఇప్పుడు అరెస్టా?

- అంత అవసరం ఏమొచ్చింది?
- తురకా కిశోర్ కేసులో పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు
- కళ్లు మూసుకొని రిమాండ్ విధించారు
- మెజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులపై ఆక్షేపణ



అమరావతి, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రెండు, మూడేళ్ల క్రితం జరిగిన ఘటనలకు సంబంధించి వైసీపీ నేత తురకా కిశోర్ పై ఇప్పుడు ఫిర్యాదులు అందుకొని, అంత అత్యవసరంగా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పోలీసులను హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. అరెస్ట్ సమయంలో పోలీసులు చట్టనిబంధనలు పాటించనప్పటికీ మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడాన్ని ధర్మాసనం ఆక్షేపించింది. మెజిస్ట్రేట్ కళ్లు మూసుకొని రిమండ్ విధించారని పేర్కొంది. వారికి సరైన శిక్షణ ఇవ్వకపోవడం తమ తప్పేనని వ్యాఖ్యానించింది. తురకా కిశోర్‌ను అరెస్ట్ చేసే సమయంలో పోలీసులు చట్టనిబంధనలు పాటించలేదని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు దస్త్రాలు అందజేయడంతో, అవి తమకు ఇవ్వలేదని సహాయ ప్రభుత్వం న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దస్త్రాలు అందజేసేందుకు పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రయత్నించగా, రిజిస్ట్రీ ముందు దాఖలు చేసేలా ఆదేశించాలని సహాయ ప్రభుత్వ న్యాయవాది ధర్మాసనాన్ని అభ్యర్థించారు. పేపర్లు అందుకోకుండా పదే పదే అదే విషయాన్ని చెప్పడంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తమ ముందు దస్త్రాలను తీసుకోవడానికి నిరాకరించడం ఏంటని ప్రశ్నించింది. హైకోర్టులో అందునా ద్విసభ్య ధర్మాసనం ముందు నడుచుకొనేది ఇలాగేనా అంటూ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని ఉత్తర్వుల్లో రికార్డు చేసింది. రిజిస్ట్రార్ (జ్యుడీషియల్)ను కోర్టు ముందుకు పిలిపించింది. పిటిషనర్ అందజేసే దస్త్రాలను సీల్డ్ కవర్‌లో ఉంచి తదుపరి విచారణలో తమ ముందు ఉంచాలని ఆయనను ఆదేశించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. గుంటూరుజిల్లా జైలు నుండి విడుదలైన తన భర్త తురకా కిశోర్‌ను పల్నాడుజిల్లా రెంటచింతల పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరు పర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తురకా సురేఖ బుధవారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. తన భర్త పై 12 కేసులు పెట్టారని, ఒక కేసులో బెయిల్ వస్తే మరో కేసులో అరెస్ట్ చేస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం...తురకా కిశోర్ పై ఎన్ని కేసులు నమోదయ్యాయో వివరాలు తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించగా, సహాయ ప్రభుత్వ న్యాయవాది కేసు వివరాలు కోర్టు ముందు ఉంచారు. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్.రామలక్ష్మణ్‌రెడ్డి వాదనలు వినిపించారు.

## విశాఖలో రేవ్ పార్టీ కలకలం


- ఫ్రెండ్షిప్ డే పేరుతో ఓ రిసార్ట్‌లో లేట్‌నైట్ పార్టీ
- డ్రగ్స్ వాడినట్టు సోషల్ మీడియాలో ప్రచారం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రేవ్ పార్టీ కలకలం రేగింది. స్నేహితుల దినోత్సవం వేడుకల పేరుతో భీమిలి బీచ్‌రోడ్డులోని రెండు చోట్ల ఆదివారం రాత్రి రేవ్ పార్టీలు నిర్వహించారంటూ పెద్దఎత్తున ప్రచారం జరిగింది. ఆ రెండు చోట్లకు భారీఎత్తున హాజరైన యువత కేరింతలు కొడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే రేవ్ పార్టీ ప్రచారంలో వాస్తవం లేదని పోలీసులు చెప్పారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం విశాఖలో పలు హోటళ్లు, రెస్టారెంట్‌లు, పబ్‌లు, రిసార్ట్స్‌ల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. తొట్లకొండ వద్ద ఉన్న ఒక రిసార్టులో రేవ్ పార్టీ జరిగిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అలాగే తిమ్మాపురం సమీపంలోని ఒక రెస్ట్రో పబ్‌లో కూడా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈ రెండు చోట్ల కొందరు మత్తెక్కించే డ్రగ్స్ వాడినట్టు జరిగిన ప్రచారం పోలీసుల దృష్టికి చేరింది. ఆ రిసార్టు, పబ్‌లకు వెళ్లి పోలీసులు సోదాలు చేశారు. పోలీసులను చూసి పార్టీకి వచ్చిన వారు మధ్యలోనే వెళ్లిపోయినట్టు సమాచారం. అయితే తమ సోదాల్లో రేవ్ పార్టీ జరిగినట్టు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఫ్రెండ్స్ డే సందర్భంగా పార్టీ నిర్వహించుకునేందుకు ముందస్తు అనుమతులు తీసుకున్నారని, దాని ప్రకారమే కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రచారం జరిగినట్టు రేవ్‌పార్టీ గానీ, డ్రగ్ వినియోగం గానీ జరగలేదని భీమిలి పోలీసులు స్పష్టం చేశారు. అయితే భీమిలి బీచ్‌రోడ్డులోని హోటళ్లు, రిసార్టులు, పబ్‌ల్లో తరచూ లేట్‌నైట్ పార్టీలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## 6 గంటలు.. 36 ప్రశ్నలు

- అనిల్ కుమార్ యాదవ్‌ను విచారించిన పోలీసులు
- ప్రశాంతిరెడ్డిపై ప్రసన్న అనుచిత వ్యాఖ్యలపై ప్రశ్నలు




విచారణ అనంతరం డీఎస్పీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న అనిల్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాటల్లో మీకు ఏమర్థమైంది? మీరు ఎందుకు నవ్వారు.' అని పోలీసులు మాజీ మంత్రి, వైసీపీ నేత అనిల్‌కుమార్ యాదవ్‌ను ప్రశ్నించారు. ప్రశాంతిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యల కేసులో ఏ-2గా ఉన్న ఆయన్ను సోమవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి విచారించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు సుమారు ఆరు గంటలపాటు విచారణ సాగింది. పోలీసులు 36 ప్రశ్నలు సంధించారు. పీహెచ్‌డీ అంటే ఏమిటి? బోరుబావి అంటే ఏమిటి? ఏ ఉద్దేశంతో ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడారు. మీ పార్టీ ఆదేశిస్తేనే మాట్లాడారా.. ఇలా అనేక ప్రశ్నలు అడుగగా.. వాటికి అనిల్ సమాధానాలు చెప్పడంతోపాటు లిఖితపూర్వకంగానూ రాసిచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కోవూరులో జరిగిన వైసీపీ కార్యకర్తల సభలో ప్రసన్నకుమార్‌రెడ్డి.. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గురించి మాట్లాడుతున్న సమయంలో వేదిక కింద ఉన్న వెయ్యి మంది నవ్వారని..ఈలలు వేశారని.. తానూ అలాగే నవ్వినట్లు చెప్పానన్నారు. ఈ ప్రభుత్వంలో నవ్వడం, చప్పట్లు కొట్టడం కూడా తప్పేనంటే.. రేపు ఇంకో ప్రభుత్వం వచ్చినప్పుడు కూర్చున్నా, నిల్చున్నా కేసులు పెట్టే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు.

# రఘురామపై కేసు కొనసాగించలేను

- సుప్రీంకు తెలిపిన కానిస్టేబుల్ ఫరూక్ బాషా



న్యూఢిల్లీ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, మాజీ ఎంపీ రఘురామ కృష్ణరాజుపై కేసును ఇక కొనసాగించలేనని సుప్రీం కోర్టుకు ఫిర్యాదుదారు కానిస్టేబుల్ ఫరూక్ బాషా తెలిపారు. హైదరాబాద్ నుంచి తన (ఏపీలోని) నివాసం 400 కిలోమీటర్లు ఉన్నదని, ఇకపై ఆ కేసులో ముందుకు వెళ్లే ఉద్దేశం తనకు లేదని సర్వోన్నత న్యాయస్థానానికి తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్‌లోని రఘురామకృష్ణరాజు నివాసం వద్ద ఒక వ్యక్తి (ఏపీ ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఎస్‌కే ఫరూక్ బాషా) అనుమానాస్పదంగా తిరుగుతుండగా, ఆయన భద్రతా సిబ్బంది పిలిచి విచారించారు. ఐడీ, ఆధార్ కార్డులు చూపించేందుకు తొలుత ఆ వ్యక్తి నిరాకరించారు. అనుమానంతో ఆ వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులకు రఘురామ భద్రతాసిబ్బంది అప్పగించారు. అక్కడి విచారణలో ఆయన ఏపీ ఇంటెలిజెన్స్‌కు చెందిన కానిస్టేబుల్ ఫరూక్ బాషా అని తెలిసింది. ఆయనపై రఘురామ కృష్ణరాజు పీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు విధి నిర్వహణలో ఉన్న తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారని ఫరూక్ బాషా సైతం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంపీ రఘురామ కృష్ణరాజుతోపాటు మరో నలుగురిపై కేసు నమోదైంది. తనతోపాటు తన కుమారుడు, ఇతరులపై కేసును క్వాష్ చేయాలని రఘురామ కృష్ణరాజు హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. హైకోర్టు తీర్పుని రఘురామ కృష్ణంరాజు 12 జూలై 2022న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తొలుత.. రఘురామ తరపున సీనియర్ న్యాయవాది ఆదినారాయణ రావు వాదనలు వినిపించారు. "రఘురామ కృష్ణంరాజు ఈ కేసు నమోదైనప్పుడు పార్లమెంట్ సభ్యుడు. ఆయనకు వై కేటగిరీ భద్రత ఉంది. హైదరాబాద్‌లోని ఆయన ఇంటి వద్ద అనుమానాస్పదంగా ఒక వ్యక్తి సంచరించడాన్ని గమనించిన సీఆర్పీఎఫ్ సిబ్బంది ఆయనను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి సీఆర్పీఎఫ్ సిబ్బందిని, రఘురామ కుమారుడిని గాయపరిచారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మాత్రం వాళ్లకే వ్యతిరేకంగా కేసు నమోదు చేశారు. ఆయన ఇంటి వద్దకు వచ్చిన వ్యక్తిని సందేహంతో ప్రశ్నిస్తే.. ఇదంతా జరిగింది. ఇదంతా.. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో రఘురామ కృష్ణరాజుకు ఉన్న విబేధాలు, ఘర్షణల కారణంగానే జరిగింది.." అని ధర్మాసనం దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీనికి సంబంధించిన వివరాలన్నీ సమగ్రంగా రీజాయిండర్ రూపంలో దాఖలు చేశారని ధర్మాసనం ఆదేశించగా, మూడు వారాల్లో అందజేస్తామని బదులిచ్చారు. రఘురామ కృష్ణరాజు ఇప్పుడు కూడా పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారా? అని జస్టిస్ మహేశ్వరి ప్రశ్నించారు. ఆయన డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగుతున్నారని ఆదినారాయణరావు బదులిచ్చారు. ఈ నేపథ్యంలోనే, ఫిర్యాదుదారు ఫరూక్‌బాషా పోలీస్ స్టేషన్ లో కేసును కొనసాగించేందుకు సిద్ధంగా లేరని ఆయన తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, దీనిపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.